# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..

సంచలన తెలుగు దిన పత్రిక









ప్రచురణ : హైదరాబాద్ - పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర - సంపుటి : 1 - సంచిక : 312 - శనివారం - 11 జులై 2026 - ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు - పేజీలు : 8+16 - వెల రూ. 7/-

ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ


## సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం



- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన

4

## అయోధ్య రామాలయ విరాళాల కేసుపై 13న విచారణ



అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై నమోదు అయిన పిటీషన్లపై జులై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

4

## నాలుగు దశాబ్దాల తర్వాత..

- న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం
- ఆక్లాండ్‌లో పర్యటన ప్రారంభం..
- ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు

4



# కేసీఆర్ కుట్రలు సాగవు!



### ఫామ్‌హౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం కల్వకుంట్ల కుటుంబాన్ని తరిమి కొడతాం

- బావా బామ్మర్దుల అబద్ధాల ప్రచారం
- రాహుల్ గాంధీని ప్రధానిగా చూస్తాం
- బీజేపీతో హరీశ్ రావు మంతనాలు : సీఎం రేవంత్ రెడ్డి
- రైతులకు భరోసా నిధులు విడుదల

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని, బావా బామ్మర్దులు అబద్ధాలు ప్రచారం చేస్తూ ఊళ్ల మీద పడి తిరుగుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇదే సభలో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని చెబుతూనే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరిక మేరకు మధిరలో ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సభ వేదికగా రైతులకు భరోసా నిధులను కూడా సీఎం విడుదల చేశారు.

-మధిర (మనసులో మాట): 2

## బీఆర్ఎస్‌ను తరిమి కొడతాం



- కాళేశ్వరం పేరుతో భారీ అవినీతి
- హరీశ్ రావువి పచ్చి అబద్ధాలు
- ఖమ్మం సభలో భట్టి ఫైర్

వివరాలు 2లో..





# పట్టిసీమకే గోదావరి జలాలు!

### తెలంగాణ ప్రాజెక్టులకు నీరు నిలుపుదల

### కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలి

### యాదాద్రిలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆందోళన

కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు మహాధర్నాకు దిగాయి. ప్రాణహితలో వరద పారుతున్నా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు ఎత్తిపోయకుండా.. కేవలం ఏపీలోని పట్టిసీమ, తాడిపూడి పంప్‌హౌస్‌లకు సాయం చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకు వదిలేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

- యాదాద్రి భువనగిరి, జూలై 9 (మనసులో మాట)

3

# అబద్ధాలకు పేటెంట్ రేవంత్!

- ఖమ్మం సభలో పచ్చి అబద్ధాలు
- మాట తప్పడం నీ సంస్కృతి
- రైతులపై కక్ష తీర్చుకోవద్దు
- భద్రాచలం ముంపు పేరుతో నాటకాలు
- బీఆర్ఎస్‌పై పోరాడండి రైతులపై కాదు
- సీఎం రేవంత్‌పై హరీశ్ ఫైర్



వివరాలు 2వ పేజీలో

# ముందు కాంగ్రెస్‌లో చేరు

### పార్టీలోకి వస్తానంటే కమిటీలో చర్చిస్తాం

### హరీశ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన పీసీసీ చీఫ్



తనకు 3 నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి కష్టాలు తీరుస్తానన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో సెటైర్లు వేశారు. ఆయన ముందుగా కాంగ్రెస్‌లో చేరితే.. మంత్రి పదవి ఇవ్వాలా వద్దా అనేది కమిటీలో చర్చిస్తామని ఎద్దేవా చేశారు.

2



# అక్క రాజ్యం చూపిస్తా

- టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

2

# క్లౌడ్ కిచెన్లలో కుళ్లిన పదార్థాలు

- ప్రముఖ హోటళ్లలో అపరిశుభ్ర వాతావరణం
- ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు



శ్రీకాకుళం జిల్లాలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుల ఆశలు అడియాసలు అవుతున్నాయి. గతంలో పలు మంత్రి పదవులు చేపట్టిన సీనియర్ నాయకులు ఇప్పుడు ఎమ్మెల్యే పదవులకు మాత్రమే అంకితం అవుతున్నారు.

2



# నాకు తెలంగాణే ముఖ్యం

3

### పార్టీ కంటే నా మొదటి ప్రాధాన్యం ప్రజలే

### ఎంపీ ఈటల రాజేందర్

## భలే మాట!



# కేసీఆర్ కుట్రలు సాగవు

- ఫామ్‌హౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం
- కల్వకుంట్ల కుటుంబాన్ని తరిమి కొడతాం
- బావా బామ్మర్దుల అబద్ధాల ప్రచారం
- రాహుల్ గాంధీని ప్రధానిగా చూస్తాం
- బీజేపీతో హరీశ్ రావు మంతనాలు
- రైతులకు భరోసా నిధులు విడుదల
- సీఎం రేవంత్ రెడ్డి



**మధిర (మనసులో మాట):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని, బావా బామ్మర్దులు అబద్ధాలు ప్రచారం చేస్తూ ఊళ్ల మీద పడి తిరుగుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇదే సభలో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని చెబుతూనే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరిక మేరకు మధిరలో ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సభ వేదికగా రైతులకు భరోసా నిధులను కూడా సీఎం విడుదల చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాధపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశామన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి తొలగించే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరని హెచ్చరించారు. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదని, బీజేపీతో హరీశ్ రావు మంతనాలు జరుపుతున్నారో లేదో భద్రాచలం రాముడిపై ఒట్టేసి చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని కేటీఆర్ చెబుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ఆన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అడుగుతున్నారని, అది ఆన్ చేస్తే భద్రాచలం రాముడి ఆలయంతో సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు.

**లక్ష్యం రాహుల్ గాంధీయే!**

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 20 పార్లమెంట్ సీట్లు గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని, అప్పటికి అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కు, లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. 2029 మే-జూన్‌లో జరిగే ఎన్నికల్లో 182 స్థానాల్లో 117కు పైగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని చెప్పానని, 64 వచ్చాయని, ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచామని గుర్తుచేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

**మధిరకు ఇంజనీరింగ్ కళాశాల..**

మధిరలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి మేరకు దీన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పేదలు చదువుకునేందుకు కోరిన చిన్న కోరికగా దీన్ని ఆయన అభివర్ణించారు. అనంతరం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసేందుకు బటన్ నొక్కారు. 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లో 1009.15 కోట్లు జమ చేశారు. అదే వేదికపై నుంచి ఈ-పట్టాదార్ పాస్ పుస్తకాలను జారీ చేశారు. తాజా విడుదలతో కలిపి రాష్ట్రంలో ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిన మొత్తం సాయం 8759 కోట్లకు చేరిందన్నారు. ఈ సాయం ద్వారా 74 లక్షల మందికి లబ్ధి చేకూరిందని, 1.45 కోట్ల ఎకరాల సాగు భూములకు గానూ మొత్తం 7750 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించినట్లు అధికారులు స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్‌ను తరిమి కొడతాం!

- కాళేశ్వరం పేరుతో భారీ అవినీతి
- హరీశ్ రావువి పచ్చి అబద్ధాలు
- అప్పులు తీరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఖమ్మం సభలో భట్టి ఫైర్



**ఖమ్మం (మనసులో మాట):** తెలంగాణలో రైతులకు పెట్టుబడి సాయం అందించే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్తగా 1009 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. గత ప్రభుత్వం రైతుబంధు కోసం 169 రోజులు తిప్పుకోగా.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే 9000 కోట్లు ఇచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో ఆయన బీఆర్ఎస్ నాయకులపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో మహిళా సాధికారత, సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేవలం 2.5 ఏళ్లలోనే మహిళలకు 67000 కోట్ల రుణాలు అందించామని స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ వారిని రాజుగా చూస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 74 లక్షల మంది రైతులకు, 1.45 కోట్ల ఎకరాల భూములకు గానూ మొత్తం 8759 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించామని వివరించారు.

**బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు ఒక్కటి కూడా దెబ్బతినలేదని, కానీ బీఆర్ఎస్ నాయకులు 27000 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును 147000 కోట్లకు పెంచి, నాసిరకంగా కట్టిన కాళేశ్వరాన్ని కూల్చేశారని మండిపడ్డారు. హరీశ్ రావు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, బీఆర్ఎస్ చేసిన అప్పులు, వడ్డీలు కడుతూనే తాము ఉద్యోగుల బిల్లులు క్లియర్ చేస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నాయకుల భవిష్యత్తు ముగిసిందని, వారు మళ్లీ మాయమాటలతో ఊళ్లలోకి వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని, తరిమి తరిమి కొడతారని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

# ముందు కాంగ్రెస్‌లో చేరు!

**పార్టీలోకి వస్తానంటే కమిటీలో చర్చిస్తాం**

**10 ఏళ్లు మంత్రిగా ఏం పీకారు**

**హరీశ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన పీసీసీ**

**హైదరాబాద్ (మనసులో మాట):** తనకు 3 నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి కష్టాలు తీరుస్తానన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో సెటైర్లు వేశారు. ఆయన ముందుగా కాంగ్రెస్‌లో చేరితే.. మంత్రి పదవి ఇవ్వాలా వద్దా అనేది కమిటీలో చర్చిస్తామని ఎద్దేవా చేశారు. 10 ఏళ్లు మంత్రిగా ఉండి ఆయన కట్టిన ప్రాజెక్టే కుంగిపోయిందని, ఇప్పుడు 3 నెలల సమయం ఎందుకని ఆయన ఎండగట్టారు. బీఆర్ఎస్ పార్టీ నిధులపై కవిత చేసిన వ్యాఖ్యల్లో నిజం ఉందని, ఒక ప్రాంతీయ పార్టీకి 1400 కోట్లు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన సవాల్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీటుగా బదులిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)లో చర్చిస్తామన్నారు. ఆయనను పార్టీలో చేర్చుకోవాలా వద్దా అనే దానిపై అక్కడే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. 10 ఏళ్లు మంత్రిగా ఉండి ఏమీ చేయని వారు, ఇప్పుడు 3 నెలల సమయంలో ఏం అద్భుతాలు చేస్తారని ఆయన నిలదీశారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని, దాని గురించి హరీశ్ ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు.



**కవిత ఆరోపణలు నిజమే..**

బీఆర్ఎస్ పార్టీ నిధుల విషయంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణల్లో వంద శాతం నిజం ఉందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఒక ప్రాంతీయ పార్టీకి ఏకంగా 1400 కోట్లు ఫండ్ ఎలా వచ్చిందో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను తాము సరిచేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో నీళ్ల దోపిడీ జరిగినప్పుడు బీజేపీ నేత ఈటల రాజేందర్ మంత్రిగానే ఉన్నారని ఆయన గుర్తుచేశారు.

**అంతర్గత వివాదాల పరిష్కారం..**

పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలపై కూడా పీసీసీ చీఫ్ స్పందించారు. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య, అలాగే తుంగతుర్తిలో నేతల మధ్య నెలకొన్న వివాదాలను సామరస్యంగా పరిష్కరిస్తామని చెప్పారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు రావడం సహజమేనని, సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదని ఆయన అన్నారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉన్నందున, వివాదాల పరిష్కారం కోసం ఇద్దరు సీనియర్లను పరిశీలకులుగా నియమించామని తెలిపారు. వరంగల్ అంశాన్ని సచిన్ సావంత్‌కు, తుంగతుర్తి బాధ్యతను జగ్గారెడ్డికి అప్పగించామని, అందరి వాదనలు విని ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొడతామని విపక్షాలు అన్నప్పుడే.. బీఆర్ఎస్ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు.

# ఫీజు బకాయిలపై ధర్నా

**హైదరాబాద్,జూలై10:** విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రజాభవన్‌ను ముట్టడించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలంటూ వామపక్ష విద్యార్థి సంఘాల బంద్‌లో భాగంగా ప్రజాభవన్ వద్ద ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవటం లేదని, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆయన ఆడుకుంటున్నారని ధర్నాకు దిగారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల సహా... ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల కట్టడికి చట్టం తేవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

# కూలిన పాఠశాల గది పైకప్పు

**విద్యార్థులకు తప్పిన ముప్పు**

**నాగర్‌కర్నూలు,జూలై10:** ప్రభుత్వ పాఠశాల తరగతి గది పైకప్పు కూలిన ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రమాదం నుంచి విద్యార్థులు త్రుటిలో తప్పించుకున్నారు. విద్యార్థులు తరగతిలో ఉండగా ఒక్కసారిగా గది పైకప్పు ముందు భాగం కూలింది. విద్యార్థులకు కొద్ది దూరంలో కూలడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు రోజులాగే ప్రార్థన అనంతరం తరగతి గదిలోకి వెళ్లిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. పాఠశాలలో 107 మంది విద్యార్థులకు గాను శుక్రవారం.. 70 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్ తెలిపారు. వర్ష కాలం వస్తే పాఠశాల గదులు వర్షపు నీటితో నిండిపోతాయని, కొన్ని గదుల్లో పెచ్చులూడిపడి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. 70 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని చెప్పారు.

# హీరో అవకాశం ఇస్తామంటూ మూడున్నర కోట్లు వసూలు

**పిల్ల జమిందార్ నిర్మాత దర్శకులపై కేసు నమోదు**

**హైదరాబాద్,జూలై10:** తెలుగు సినిమా రంగంలో హీరోగా ఎంట్రీ ఇప్పిస్తామంటూ భారీ మోసానికి పాల్పడిన వ్యవహారంలో టాలీవుడ్ హిట్ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిలపై సైబరాబాద్ పోలీస్ పరిధిలో కేసు నమోదైంది. బాధితుల కథనం ప్రకారం.. ఒక యువకుడిని టాలీవుడ్‌లో హీరోగా పరిచయం చేస్తామంటూ నమ్మించిన దర్శకుడు అశోక్ బాబు, సదరు యువకుడి తల్లిదండ్రుల నుండి విడతల వారీగా దాదాపు రూ.3.5 కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే, డబ్బులు తీసుకుని చాలా కాలం గడుస్తున్నా సినిమా ఊసే ఎత్తకపోగా, యువకుడిని హీరోగా లాంచ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా నిలదీశారు. తీసుకున్న భారీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేందుకు కూడా నిరాకరించడంతో, బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి చెందిన పోలీసులు దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబుతో పాటు నిర్మాత విజయలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# క్లౌడ్ కిచెన్లలో కుళ్లిన పదార్థాలు

**ప్రముఖ హోటళ్లలో అపరిశుభ్ర వాతావరణం**

**ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు.. గడువు ముగిసిన పెరుగు వాడకం**

**సిబ్బందికి నకిలీ వైద్య ధ్రువపత్రాలు..**

**హైదరాబాద్ (మనసులో మాట):** హైదరాబాద్‌లోని పలు క్లౌడ్ కిచెన్లు, ప్రముఖ హోటళ్లు, హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. కొండాపూర్‌లోని ప్రముఖ క్లౌడ్ కిచెన్‌లో కుళ్లిపోయిన, గడువు ముగిసిన పదార్థాలతో వంటలు చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పాడైపోయిన పెరుగుతో కస్టమర్లకు మజ్జిగ తయారు చేస్తుండటాన్ని గుర్తించి అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని, నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసిన పలు సంస్థల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. కొండాపూర్‌లోని 'రెబెల్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే క్లౌడ్ కిచెన్ సెంటర్ నుంచి పలు బ్రాండ్ల పేర్లతో ఆన్‌లైన్‌లో ఫుడ్ డెలివరీ చేస్తున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫుడ్ సేఫ్టీ బృందం ఇక్కడ తనిఖీలు చేయగా గడువు తీరిపోయిన పెరుగు ప్యాకెట్లు, గ్రేవీని గుర్తించారు. పాడైపోయిన ఈ పెరుగుతోనే కస్టమర్ల కోసం మజ్జిగ తయారు చేస్తున్నట్లు కనిపెట్టారు. వంటగది పరిసరాల్లోని వాష్ రూమ్‌లు చాలా అపరిశుభ్రంగా ఉన్నాయి. అక్కడ పనిచేసే సిబ్బందికి సంబంధించిన హెల్త్ సర్టిఫికెట్లలో కూడా నకిలీవి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు మెడికల్ రిపోర్టులకు, వారు చూపించిన సర్టిఫికెట్లకు ఏమాత్రం సంబంధం లేదని తేల్చారు.

**కొన్ని సానుకూల అంశాలు..**

అనేక లోపాలు ఉన్నప్పటికీ ఆ సెంటర్‌లో కొన్ని మంచి పద్ధతులు కూడా కనిపించాయి. వంటల్లో కృత్రిమ రంగులు వాడకపోవడం, వంట చేసేవారు హెయిర్‌నెట్స్ ధరించడం, నూనె నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించడం వంటివి బాగున్నాయి. దీంతో పరిశుభ్రత రేటింగ్‌లో ఈ ఔట్‌లెట్‌కు 100కి 78 మార్కులు వచ్చాయి. అధికారులు గడువు ముగిసిన వస్తువులన్నింటినీ అక్కడికక్కడే పారవేయించారు. లోపాలన్నింటినీ తక్షణమే సరిదిద్దుకోవాలని యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. నకిలీ మెడికల్ సర్టిఫికెట్ల వ్యవహారంపై విడిగా విచారణ జరుపుతామని చెప్పారు.

**ఇతర ప్రాంతాల్లోనూ తనిఖీలు..**

సైబరాబాద్ వ్యాప్తంగా పలు హోటళ్లు, క్లౌడ్ కిచెన్లు, ఇన్‌స్టామార్ట్ గోదాములు, కాలేజీ మెస్‌లలో అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. రెయిన్‌బో విస్టాస్ రెస్టారెంట్‌లో ఎలుకల వ్యర్థాలు, కుళ్లిపోయిన పుట్టగొడుగులు దొరికాయి. మాదాపూర్‌లోని శ్రీ చైతన్య, నారాయణ కాలేజీల సెంట్రల్ కిచెన్ పరిసరాల్లో పిల్లి మలం, వీధి కుక్కలు తిరుగుతూ కనిపించాయి. గాజులరామారం ఇన్‌స్టామార్ట్ గోదాములో గడువు ముగిసిన చీజ్, పెరుగు నిల్వ ఉంచారు. కొంపల్లి రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో గడువు ముగిసిన ప్యాకెట్లు, పురుగులు పట్టిన సరుకులు కనిపించాయి. చాలా చోట్ల ఆహార పదార్థాలు తయారు చేసే సిబ్బందికి కనీస వైద్య ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం పదే పదే జరుగుతున్నట్లు అధికారులు మండిపడ్డారు.

# అబద్ధాలకు పేటెంట్ రేవంత్

**ఖమ్మం సభలో పచ్చి అబద్ధాలు.. మాట తప్పడం నీ సంస్కృతి**

**రైతులపై కక్ష తీర్చుకోవద్దు ..భద్రాచలం ముంపు పేరుతో నాటకాలు**

**సీఎం రేవంత్‌పై హరీశ్ ఫైర్**

**హైదరాబాద్ (మనసులో మాట):** ఖమ్మం జిల్లాలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. మాట తప్పడం, పార్టీలు మారడం సీఎం సంస్కృతి అని, తనది కాదని ఆయన ఘాటుగా విమర్శించారు. భద్రాద్రి రాముడి సాక్షిగా చెప్పిన సంపూర్ణ రుణమాఫీ ఏమైందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయలేని చేతగానితనాన్ని కవర్ చేసుకునేందుకే.. మోటార్లు ఆన్ చేస్తే భద్రాచలం మునుగుతుందంటూ కొత్త నాటకాలకు తెరతీశారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఖమ్మంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డిలా తాను ఒట్టు వేసి ఒక మాట, వేయకుండా మరో మాట చెప్పనని ఆయన స్పష్టం చేశారు. తమ ఇద్దరి రాజకీయ చరిత్రే దీనికి నిదర్శనమన్నారు. ప్రతి సభలో సీఎం రేవంత్ రెడ్డి ఎందుకంత ఆవేశం, అసహనంతో రగిలిపోతున్నారని ఆయన ప్రశ్నించారు.



**రుణమాఫీ ఏమైంది రేవంత్**

సంపూర్ణ రుణమాఫీ అమలు చేస్తామని భద్రాద్రి రాముడి సాక్షిగా ఇచ్చిన హామీ ఏమైందని హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రం సంగతి పక్కన పెడితే.. కనీసం సభ పెట్టిన ఖమ్మం జిల్లాలోనైనా రైతులకు రుణమాఫీ చేశారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీపై రాజకీయంగా పోరాడాలని, కానీ రైతులపై కక్ష తీర్చుకోవద్దని ఆయన హితవు పలికారు. అన్నదాతల ఉసురు తగిలితే ఈ ప్రభుత్వం శాపం నుంచి తప్పించుకోలేదని ఆయన హెచ్చరించారు.

**ఇది ప్రభుత్వ చేతగానితనం..**

కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు లిఫ్ట్ చేయలేని ప్రభుత్వ చేతగానితనాన్ని రేవంత్ రెడ్డి అబద్ధాలతో కవర్ చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. గోదావరిలో నీరు ఎత్తిపోసి రైతులను ఆదుకోవాల్సింది పోయి.. మోటార్లు ఆన్ చేస్తే భద్రాచలం మునుగుతుందని సీఎం తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని ముప్పు ఇప్పుడే కొత్తగా ఎందుకు వచ్చిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ఇలాంటి సాకులు చెబుతున్నారని హరీశ్ రావు ఎండగట్టారు.

# నాకు తెలంగాణే ముఖ్యం!

- పార్టీ కంటే నా మొదటి ప్రాధాన్యం ప్రజలే
- కాళేశ్వరం మరమ్మతుల్లో తీవ్ర జాప్యం
- కాంగ్రెస్ బీఆర్ఎస్ కపట నాటకాలు
- ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్

**హైదరాబాద్ (మనసులో మాట):** తనకు పార్టీ, రాజకీయాల కంటే తెలంగాణ రాష్ట్రమే అత్యంత ముఖ్యం అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కావాలనే డ్రామాలు ఆడుతున్నాయని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల కోసం రైతులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోనని, అలాంటి వారిని చీల్చి చెండాడతానని గట్టిగా హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తోందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టును రిపేర్ చేయకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కపట నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. ఉత్తర తెలంగాణకు మిడ్ మానేరు ప్రాజెక్టు జీవనాడి లాంటిదని, కరువు వస్తుందని తెలిసీ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన నిలదీశారు. ప్రాజెక్టులోని లో లెవల్ పాయింట్‌కు వచ్చే నీటిని ఎందుకు ఎత్తిపోయడం లేదని పాలకులపై ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు.

## నాకు తెలంగాణే ముఖ్యం..

తాను తెలంగాణ మట్టిబిడ్డనని, ఒక ఉద్యమకారుడినని..



అదే తన అసలైన గుర్తింపు అని ఈటల రాజేందర్ ఉద్ఘాటించారు. "నాకు తెలంగాణ ఫస్ట్.. ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత విషయాలు. రాజకీయాల కోసం తెలంగాణ ప్రజలకు నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోను. నష్టపరిచే వారిని ఏమాత్రం వదలను, చీల్చి చెండాడతా. నేను ఎవరి చేతిలో కీలుబొమ్మను కాను.. వేరొకరు ఆడిస్తే ఆడే వ్యక్తిని అంతకన్నా కాదు. మేం స్వయం ప్రకాశితులం. ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే చదివే వాళ్లం కాదు. అలా ఆరోపించే నీచులకు నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు" అని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాను కేవలం కాంగ్రెస్ లేదా ఇతర పార్టీలను తిట్టడానికే రాలేదని, పని చేయాల్సిన పాలకులను బాధ్యతగా నిలదీస్తున్నానని చెప్పారు.

## రైతులకు నష్టం చేయొద్దు..

దేవాదుల ప్రాజెక్టుకు బ్యారేజి లేకపోయినా నీళ్లు పంపింగ్ చేస్తున్నారని ఈటల గుర్తుచేశారు. మేడిగడ్డలో పూర్తిగా నీళ్లు నింపమని తాను అడగడం లేదని.. కేవలం అందుబాటులో ఉన్న నీటిని పంప్ చేయాలని మాత్రమే కోరుతున్నానని చెప్పారు. పనికిమాలిన రాజకీయాలు చేస్తూ రైతులను ఇబ్బందుల పాలు చేస్తే ఖబడ్దార్ అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికే హైదరాబాద్ నగరానికి 107 ఎంజీడీల మేర నీటి సరఫరా తగ్గిందని, భవిష్యత్తులో తీవ్ర నీటి కొరత వస్తే ప్రజలు ఎటు పోవాలని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు.

# పట్టిసీమకే గోదావరి జలాలు!

- తెలంగాణ ప్రాజెక్టులకు నీరు నిలుపుదల
- రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఫైర్
- కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలి
- కాంగ్రెస్ అసమర్థ పాలనతో తీవ్ర నష్టం
- యాదాద్రిలో పార్టీ శ్రేణుల ఆందోళన



**యాదాద్రి భువనగిరి (మనసులో మాట):** కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు మహాధర్నాకు దిగాయి. ప్రాణహితలో వరద పారుతున్నా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు ఎత్తిపోయకుండా.. కేవలం ఏపీలోని పట్టిసీమ, తాడిపూడి పంప్‌హౌస్‌లకు సాయం చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకు వదిలేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు సాగు, తాగునీటి అవసరాల కోసం కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా గోదావరి జలాలను వెంటనే ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మహాధర్నా చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ అసమర్థ పాలన వల్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్లు, క్యామ మల్లేశ్, కల్లూరి రామచంద్రారెడ్డి, ధర్మేందర్ రెడ్డి, కొల్పుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు కోసమే కన్నెపల్లి బంద్..

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రాణహిత జలాలను ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే దిగువకు వదిలేస్తున్నారని ఆరోపించారు. సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 50 టీఎంసీల ప్రాణహిత జలాలు దిగువకు తరలిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఈ సమయంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా ఉపయోగించుకోవడమే అత్యంత ముఖ్యమని సూచించారు.

ఎత్తిపోయడానికి నీళ్లు లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన గంటల్లోనే.. దిగువన పట్టిసీమ, తాడిపూడి పంప్‌హౌస్‌లను ఏపీ ప్రభుత్వం ఆన్ చేసిందని వారు గుర్తుచేశారు. తెలంగాణలో వానల్లేక పంటలు ఎండుతున్నా.. మేడిగడ్డలో ప్రాణహిత వరద పారుతున్నా వాటిని ఎత్తిపోయడానికి రేవంత్ సర్కారుకు చేతులు రావడం లేదన్నారు. కానీ, అందివచ్చిన అవకాశంతో చంద్రబాబు సర్కార్ మాత్రం ఏపీలో నీటిని లిఫ్ట్ చేయడం ప్రారంభించిందన్నారు. పట్టిసీమకు నీళ్లు ఇచ్చేందుకే ఇక్కడ కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేయడం లేదని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. ఏపీ ప్రయోజనాల కోసమే రేవంత్ సర్కార్ పనిచేస్తోందని వారు విమర్శించారు.

# అక్క రాజ్యం చూపిస్తా

- మహిళల కోసం ప్రత్యేక ప్రణాళిక!
- పాంచజన్యంతో ప్రజల ముందుకు వస్తాం
- ఆదివాసీల హక్కుల కోసం పోరాటం
- టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

**భద్రాద్రి కొత్తగూడెం (మనసులో మాట):** రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)ను గెలిపిస్తే అన్న రాజ్యం కాదు.. అక్క రాజ్యం ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేసి గౌరవిస్తామని ఆమె ప్రకటించారు. మహిళల కోసం ఓ వినూత్న ఆలోచన చేశానని, త్వరలోనే ప్రత్యేక కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు. శుక్రవారం ఆమె భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించి గిరిజనులు, ఆదివాసీల సమస్యలు తెలుసుకున్నారు. పాంచజన్యం పేరుతో తాను ప్రజల ముందుకు వస్తున్నానని, తన ప్రయాణానికి ప్రజల సహకారం కావాలని కవిత కోరారు. సమాజంలో ఉన్న వెనుకబడిన వ్యవస్థను మార్చడానికే తాను ఆడబిడ్డగా ధైర్యంగా ముందుకు వచ్చానని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామంతో పాటు పలు ఆదివాసీ నాయకపోడు గ్రామాల్లో పర్యటించారు.





గిరిజనుల సమస్యలను, వారి జీవన విధానాన్ని ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తాను రాజకీయాల కోసం రాలేదని, ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే వచ్చానని చెప్పారు. వెనుకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే తాను తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించానని కవిత వివరించారు. ఈ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉందని, గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## నిరుద్యోగం, కరెంట్ కష్టాలు తీరలేదు..

రాష్ట్రంలో ఎక్కడా మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదన్నారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరమని, గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కవిత ఆరోపించారు. ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని.. అది వారి ప్రాథమిక హక్కు అని ఆమె డిమాండ్ చేశారు.

## గిరిజనులకు లోన్లు ఎందుకు ఇవ్వరు?

తెలంగాణలో ఆదివాసీల బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని కవిత మండిపడ్డారు. బ్యాంకులను లూటీ చేసిన బడాబాబుల అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వడం లేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడ కూడా ఆదివాసీలకు 2 లక్షల నుంచి 2 కోట్ల రూపాయల వరకు బ్యాంకు లోన్లు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఎంతు పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం దొరుకుతుందని, ప్రజల మద్దతుతో అద్భుతాలు సాధిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# దంపతుల మిస్సింగ్ కేసులో కొత్త కోణం

### అధిక వడ్డీ ఆశతో 50 కోట్లు ముంచినట్లు వెల్లడి

### పలువురి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్,జూలై10:** హైదరాబాద్‌లోని చెర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో స్విట్జర్లాండ్‌కు వెళ్లినట్లు చెప్పి అదృశ్యమైన దంపతుల వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. తొలుత మిస్సింగ్ కేసుగా నమోదైన ఈ ఘటనలో తాజాగా భారీ ఆర్థిక మోసం ఆరోపణలు వెలుగులోకి రావడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. పబ్బా చంద్రశేఖర్ (51), ఆయన భార్య పబ్బా స్వప్న (42) జూన్ 22న స్విట్జర్లాండ్‌కు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. అయితే ఆ తర్వాత జూలై 8 వరకు వారు కుటుంబ సభ్యులను ఫోన్ లేదా ఇతర మార్గాల్లో సంప్రదించలేదు. ఇద్దరి మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో అనుమానం వ్యక్తం చేసిన వారి కుమార్తె పబ్బా శ్రేయ చెర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దంపతుల ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో తాజాగా మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితమే పబ్బా చంద్రశేఖర్ దంపతులపై పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎక్కువ వడ్డీ ఇస్తామని, వివిధ పెట్టుబడి పథకాల పేరుతో డబ్బులు పెట్టిస్తామని చెప్పి సుమారు రూ.50 కోట్ల వరకు వసూలు చేసి మోసం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌లో పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించిన అనంతరం పబ్బా చంద్రశేఖర్ దంపతులు స్విట్జర్లాండ్‌కు వెళ్లి అక్కడే తలదాచుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. మిస్సింగ్‌గా కనిపిస్తున్న ఈ ఘటన వెనుక ఆర్థిక నేరం కోణం కూడా ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దంపతులు నిజంగా స్విట్జర్లాండ్‌కు వెళ్లారా.? ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు.? వారు దేశం విడిచి వెళ్లడానికి ముందు ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయి.? అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అలాగే మోసం ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలిస్తూ.. ఈ రెండు కేసుల మధ్య సంబంధం ఉందా అనే దిశగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు దంపతుల ప్రయాణ వివరాలు, బ్యాంకు లావాదేవీలు, బాధితుల ఫిర్యాదులు, విదేశీ ప్రయాణ రికార్డులను పరిశీలిస్తూ కేసును ఛేదించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం హైదరాబాద్‌లో సంచలనంగా మారింది.

# రోడ్డు ప్రమాద ఘటనలో మరో ఇద్దరు కూలీల మృతి

**రాజన్న సిరిసిల్ల,జూలై10:** వేములవాడ మండలం అనుపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు మృతిచెందారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరు కూలీలు మరణించారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య మూడుకు చేరింది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా పూణెళి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇటీవల తెలంగాణకు వచ్చారు. కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండలంలోని జెగ్గారావుపల్లె వద్ద కొదురుపాకకు చెందిన కాంట్రాక్టర్ ద్వారా ఇక్కడ వరినాట్లకు కూలీలుగా వెళ్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం నాడు తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో వరి నాట్లు వేసేందుకు 17 మంది మహిళలు, ఆరుగురు పురుషులు వెళ్లారు. నాట్లు ముగించుకుని సాయంత్రం డ్రైవర్‌తో సహా మొత్తం 24 మంది టాటా ఏస్ వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. వారు అనుపురం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి ఆర్టీసీ అ÷-దదె వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో దాదాపు పది అడుగుల దూరంలోకి ఎగిరిపడి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వాసుదేవ్ (35) కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్‌తో పాటు 23 మందదికి తీవ్ర గాయాలయ్యాయయి. వారిని హుటాహుటిన వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉండగా.. అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

# ఫిల్మ్ నగర్‌లో నటుడి ఇంట్లోకి దూసుకొచ్చిన కారు

### మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు

**హైదరాబాద్,జూలై10:** హైదరాబాద్ ఫిలింనగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి నేరుగా టాలీవుడ్ నటుడు ధర్మ నివాసంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి గేటు, ప్రహరీ గోడ ధ్వంసమయ్యాయి. అయితే ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు రోడ్డుపై నుంచి నేరుగా నటుడు ధర్మ ఇంటి ప్రాంగణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఘటన సమయంలో కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ధర్మ కుటుంబ సభ్యులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కారులో ఉన్న యు-ువకులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

# గచ్చిబౌలిలో వాటర్ ట్యాంకర్ బీభత్సం

### టూవీలర్‌ను ఢీకొనడంతో యువతి మృతి

**హైదరాబాద్,జూలై10:** హైదరాబాద్ గచ్చిబౌలిలో వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అదుపు తప్పి రోడ్డుపై వెళ్తున్న యువతులను ఢీకొట్టడంతో పెద్ద ప్రమాదం జరిగింది. హాస్టల్ లో ఉంటూ ప్రైవేట్ జాబ్స్ చేస్తున్న యువతులలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. గచ్చిబౌలి ఫ్లై ఓవర్ వద్ద ఈ ఘోర ప్రమాదం జరిగింది . వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి యాక్టివాపై వెళ్తున్న యువతులపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో గచ్చిబౌలిలోని హాస్టల్ లో ఉంటూ సేల్స్ గర్ల్ గా పనిచేస్తున్న మల్లం భవాని(23) ఘటనాస్థలిలోనే చనిపోయింది. ఆమె స్నేహితురాలు సుభాషిని (30) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. భవాని, ఆమె స్నేహితురులా సుభాషిని అంజయ్య నగర్ లోని హాస్టల్ లో ఉంటున్నారు.



# ఎత్తిపోతల పంచాయితీ!

## కాళేశ్వరం నీటి తరలింపుపై దాగుడు మూతలు

కాళేశ్వరంపై దాగుడు మూతలు కొనసాగుతున్నాయి. ఎవరిది నిజం అన్నది తేలడం లేదు. అధికార కాంగ్రెస్ కాళేశ్వరం పనికిరాదని, నీరు ఎత్తిపోయడానికి లేదని చెబుతోంది. చెరువులు కుంటలు నింపాలంటే ఎత్తిపోయాల్సిందే అని విపక్ష బిఆర్ఎస్ వాదిస్తోంది. సందట్లో సడేమియ్యాలా బిజెపి గోడవాటం వాదనలు చేస్తోంది. ఇందులో ఎవరు నిజం..ఎవరు అబద్దం అన్నది తేలాల్సి ఉంది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయడంలో ఉన్న ఇబ్బందులు, కష్టనష్టాలను నిపుణుల కమిటీ తేల్చాల్సి ఉంది. ఎందుకంటే ఎల్‌నినో ప్రభావంతో వర్షాల జాడ లేకుండా పోయింది. జలాశయాలు వట్టిపోయాయి. ఎస్సారెస్పీ సహా గోదావరి బేసిన్‌లోని ప్రతి జలాశయం ఇప్పటికే డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. వానలు కురిసే అవకాశమూ తక్కువగానే ఉన్నది. ఎగువ నుంచి వరద వచ్చే ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ క్రమంలో కన్నెపల్లిలో పంప్‌లను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేస్తే తద్వారా ఎల్లంపల్లి సహా మధ్యమానేరు, దిగువ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, మల్కపేట తదితర రిజర్వాయర్లను నింపుకోవచ్చని బిఆర్ఎస్ వాదిస్తోంది. అదే విధంగా దేవాదుల నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా రేవంత్ సర్కార్ నీటిని లిఫ్ట్ చేయడం లేదని కూడా హరీస్ రావు అన్నారు. కేవలం ఎన్డీఎస్ఏ నివేదికలను సాకుగా చూపుతూ ప్రాణహిత జలాలను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలిపెడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.. కేవలం ఏపీలోని కృష్ణా డెల్టా కోసమే రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రాజెక్టులను పడావు పెడుతున్నారని ఆరోపించారు కూడా. అయితే ఇందులో నిజమెంత అన్నది తేలాల్సి ఉంది. దీనిని ఎవరు తేల్చాలన్నది ప్రజలకు తెలియదు. ప్రస్తుతం సర్కార్ వ్యవహరిస్తున్న తీరు సైతం అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్ల నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టి, తద్వారా పంటలు.. రైతుల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం డిమాండ్ చేసింది. బరాజ్‌ల్లో మినిమమ్ డ్రా డౌన్ లెవల్ మేరకు జలాలను నిల్వ చేయవచ్చని, తద్వారా ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని స్పష్టంచేసింది. అదీగాక ఎస్సారెస్పీ ఎగువన, దిగువన ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం వరకు వరదనే లేకుండా పోయింది. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతున్నది. మరోవైపు కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా రోజుకు 2 టీఎంసీలను ఎత్తిపోసుకొనే సామర్థ్యమున్నది. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఎల్ నినో నేపథ్యంలో అప్పుడే ఎత్తిపోతలను ప్రారంభించింది. గోదావరిలో వస్తున్న వరదను ఉపయోగించుకుని కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నది. పోలవరం డ్యామ్ పూర్తయ్యే వరకు కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకుని ఏలూరు జిల్లాలో పట్టిసీమ లిఫ్ట్ స్కీమ్‌ను ఏపీ గతంలోనే చేపట్టింది. రోజుకు 8,500 క్యూసెక్కుల జలాలను గోదావరి నుంచి లిఫ్ట్ చేసి కుడికాలువ ద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టుకు 80 టీఎంసీల మేరకు సాగునీటిని అందించడం ప్రధాన లక్ష్యం. అదేవిధంగా పోలవరం కుడికాలువకు సమాంతరంగా తాడిపూడి కెనాల్‌ను సైతం ఎపి నిర్మించింది. తాడిపూడి లిఫ్ట్ ద్వారా ఇక్కడా 1,400 క్యూసెక్కులను తరలించే ఏర్పాట్లు చేసింది. ఈ రెండు కాలువల ద్వారా గోదావరి జలాలను మళ్లిస్తున్నది. ప్రస్తుతం సూపర్ ఎల్ నినో నేపథ్యంలో పొరుగున ఏపీ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి లిఫ్ట్‌లను ప్రారంభించింది. సామర్థ్యం మేరకు గోదావరి జలాలను ఎత్తి పోసేందుకు సిద్ధమైంది.ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు పడటం లేదని,మరోవైపు కేంద్ర జలసంఘం తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని పెద్ద ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే సుమారు 16-46 శాతం తకువగా ఉన్నాయని వివరించారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రాణహిత నది మాత్రమే ఎల్లప్పుడూ ప్రవహించే నది. రాష్ట్రంలో నీరు లేని పరిస్థితిలోనూ ప్రాణహిత-గోదావరిలో వినియోగయోగ్య మైన వరద ప్రవాహాలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించు కోవడం అత్యంత సమంజసమని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రాణహితలో వరద నీటిమట్టం మేడిగడ్డ ఎండీడీఎల్ కంటే ఎత్తుగా కొనసాగుతున్నంతకాలం, మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌స్టేషన్ నీటిని లిఫ్ట్ చేసి, అన్నారం, సుందిల్ల బరాజ్‌లను ఎండీడీఎల్ స్థాయిల వద్దే కొనసాగిస్తూ, నీటిని ఎల్లంపల్లి వరకు తరలించ వచ్చని, అది హైడ్రాలిక్‌పరంగా స్థిరమైన, నమ్మకమైన విధానమని విశ్రాంత ఇంజనీర్లు స్పష్టంచేశారు. గత వరద అనుభవాల ప్రకారం, సాంకేతిక నియమాలకు లోబడి, జాగ్రత్తతో, సురక్షిత పద్ధతుల్లో లిఫ్టులను నడిపితే గ్రామాల ముంపు, ఆస్తి నష్టం, ప్రాణనష్టం వంటి ప్రమాదాలు లేకుండానే నీటి పంపింగ్ వ్యవస్థను సఫలీకృతంగా వినియోగించుకోవచ్చని విశ్రాంత ఇంజినీర్లు చెబుతున్నారు. అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో పంటలు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా గోదావరిలో వచ్చే వరదనీటిని కాపాడుకోవాలి. అది ఎలా చేస్తారన్నది ఆలోచన చేయాలి. ప్రస్తుత దుర్భర పరిస్థితుల్లో సాగు,తాగునీటి అవసరాల కోసం అత్యసవర కార్యాచరణ సిద్దం చేయాలి. అదికూడా యుద్ధప్రాతిపదిక సాగాలి. అప్పుడే మనకు నీటి కష్టాలు తీరుతాయి. పదేపదే విమర్శలతో కాలయాపన చేయడం కూడా మంచిది కాదు. ప్రజల, రైతుల ప్రయోజనం దృష్ట్యా కార్యరంగం లోకి దిగాల్సి ఉంది.



**డాక్టర్ కంచర్ల అచ్యుత రావు**
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక

# నాలుగు దశాబ్దాల తర్వాత చారిత్రక అడుగు

- న్యూజిలాండ్‌లో ప్రధాని మోదీకి ఘన స్వాగతం
- ఆక్లాండ్‌లో పర్యటన ప్రారంభం.. ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు



**ఆక్లాండ్ (న్యూజిలాండ్), జూలై 10:** భారత విదేశాంగ చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. ఆస్ట్రేలియా పర్యటనను విజయవంతంగా ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరానికి చేరుకున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధానమంత్రి అధికారికంగా న్యూజిలాండ్‌లో పర్యటించడం విశేషం. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ఆక్లాండ్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి లక్సన్ స్వయంగా స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ పర్యటనలో ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సముద్ర భద్రత, విద్య, సాంకేతికత, పర్యాటకం, క్రీడలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ఇటీవల కుదిరిన సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుతో భారత్-న్యూజిలాండ్ సంబంధాలు మరింత బలోపేతం కావడంతో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఆక్లాండ్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, క్రీడా రంగ ప్రముఖులతో ప్రధాని మోదీ సమావేశమవుతారు. అలాగే న్యూజిలాండ్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రత్యేక కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న సాంస్కృతిక, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చిలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ భారతదేశాన్ని సందర్శించిన సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశాలకు కొనసాగింపుగా తాజా పర్యటనను భావిస్తున్నారు. అంతకుముందు మూడు రోజులపాటు ఆస్ట్రేలియాలో పర్యటించిన ప్రధాని మోదీ, ఆ పర్యటన అత్యంత ఫలప్రదంగా సాగిందని పేర్కొన్నారు. న్యూజిలాండ్ పర్యటనతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం

- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి శ్రీకారం
- భారత్‌కు ఎగుమతులపై 57 శాతం ఉత్పత్తులకు సుంకాల రద్దు
- 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని అధికారిక పర్యటన



**న్యూఢిల్లీ, జూలై 10 :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో శుక్రవారం తీవ్ర నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒక కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ హద్దులు మీరు ప్రవర్తించాడు. న్యాయ మూర్తులపై దూషణలకు దిగడమే కాకుండా, చేతిలోని కేసు పత్రాలను వారి వైపు విసిరికొట్టి తీవ్ర గందరగోళం సృష్టించాడు. తక్షణమే అప్రమత్తమైన భద్రతా అధికారులు అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు పంపించారు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రబల్ ప్రతాప్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన స్వయంగా వాదనలు వినిపించాడు. అయితే, విచారణ ప్రారంభంలోనే పిటిషనర్ న్యాయమూర్తులను 'జ్యుడీషియల్ సర్వెంట్' అని సంబోధిస్తూ, 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను' అని వ్యాఖ్యానించాడు. దీనిపై తీవ్ర విస్మయం వ్యక్తం చేసిన జస్టిస్ విశ్వనాథన్, "మమ్మల్ని ఆదేశిస్తున్నావా?" అని ప్రశ్నించారు. ఈ క్రమంలో ప్రబల్ ప్రతాప్ మరింత ఆవేశంతో ఊగిపోతూ, తన చేతిలోని పత్రాలను గాలిలోకి విసిరాడు. అదే సమయంలో, ఆ బెంచ్‌లో లేని ప్రధాన న్యాయమూర్తిపై కూడా దూషణలకు దిగాడు. దీంతో భద్రతా సిబ్బంది వెంటనే రంగప్రవేశం చేసి అతడిని కోర్టు హాలు నుంచి వెలుపలికి తరలించారు. ఒక సైబర్ క్రైమ్ సిండికేట్‌కు సంబంధించిన కేసులో, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 173(4) కింద తాను సమర్పించిన దరఖాస్తును ప్రైవేట్ కంప్లైంట్‌గా మార్చడాన్ని సవాల్ చేస్తూ ప్రబల్ ఈ పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు హాలులో చోటుచేసుకున్న ఈ అసాధారణ ఘటనకు సంబంధించిన వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# అయోధ్య రామాలయ విరాళాల కేసుపై 13న సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ:** అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై నమోదు అయిన పిటీషన్లపై జూలై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రామాలయ నిధుల చోరీ కేసులో అరెస్టు అయిన 8 మందిని ఒక్క రోజు కస్టడీలోకి తీసుకోవాలని జూలై 7వ తేదీన అయోధ్య కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేశ్ పాండేలను రిమాండ్‌లోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. జూన్ 29వ తేదీన స్థానిక కోర్టు 8 మంది నిందితులను 14 రోజుల జుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. అయితే ఈ అంశంపై దాఖలైన మూడు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్లను పరిశీలించనున్నది. అయోధ్య ఘటనలో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని నరేంద్ర కుమార్



గోస్వామి అనే పిటీషనర్ సుప్రీంను ఆశ్రయించారు. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు చెందిన కాగ్ ఆడిట్ వివరాలను వెల్లడించాలని కోరారు. ఇదే కేసులో అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్ కూడా పిటీషన్లు వేశారు.

# భారత్‌కు తరలిస్తున్న 22 కేజీల కొకైన్ అమెరికాలో సీజ్



**న్యూఢిల్లీ:** భారత్‌కు విమాన మార్గంలో తరలిస్తున్న సుమారు 22 కేజీల కొకైన్(జశీఝఱఅవ ూవఅఓవను)ను అమెరికా పోలీసులు పట్టుకున్నారు. ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మియామీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఉన్న ఎయిర్ కార్గో వేర్‌హౌజ్‌లో ఆ కొకైన్‌ను సీజ్ చేశారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఓ పార్సిల్‌లో ఉన్న స్పీకర్లు, ఆంప్లిఫయర్స్ కింద ఆ కొకైన్ దాచారు. మ్యూజిక్ ఎక్విప్మెంట్ అన్న మార్కింగ్‌తో పార్సిల్ చేశారు. ఆపరేషన్ స్ట్రయికర్ పేరుతో సీబీపీ ఆపరేషన్ చేపట్టారు. స్పీకర్లు, ఆంప్లిఫయర్లలో 8 ప్యాకెట్లు, నాలుగు బ్రిక్స్ రూపంలో వైట్ పౌడర్‌ను దాచిపెట్టినట్లు సీబీపీ అధికారులు తెలిపారు. ఆ పౌడర్‌ను కొకైన్ హైడ్రోక్లోరైడ్‌గా గుర్తిస్తూ అధికారులు నిర్ధారణ చేశారు. 22 కేజీలు ఉన్న ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లుగా ఉంటుందని కస్టమ్స్ అధికారులు చెప్పారు.

# ఇరాన్‌పై అమెరికా మిస్సైల్ దాడులు

## అణు కేంద్రం వద్ద పేలిన భవనం

**టెహ్రాన్, జూలై 10:** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. గురువారం అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గురువారం తెల్లవారుజామున ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. దీంతో అణు ప్లాంట్ ఆవరణలోని ఓ భవనం దెబ్బతింది. అమెరికా మిస్సైల్ దాడి చేసిన వెంటనే ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వెంటనే స్పందించి ఎదురుదాడి చేశాయి. పరస్పర దాడుల కారణంగా ఆ ప్రాంతం మొత్తం పేలుళ్ల శబ్దాలతో హోరెత్తింది. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న 'బుషెహర్' ప్రాంతంతో పాటు చోగడక్, బందర్ అబ్బాస్, వ్యూహాత్మక ఓడరేవు ఉన్న కొనారక్ ప్రావిన్స్‌లలో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. బుషెహర్ నగర శివార్లలోని మిలిటరీ ప్రధాన కార్యాలయంపై కూడా మిస్సైల్ దాడి జరిగింది. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీరప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే ఈ చర్యలు ఈ దాడులు చేస్తున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.





# పాత తరం మహా నటుడు సీఎస్ఆర్

ఎన్టీఆర్, ఏఎన్నార్ కాలానికి ముందే అగ్ర నటుడిగా వెలిగిన చిలకాలపూడి

## 'మాయాబజార్' శకునిగా, 'పాతాళభైరవి' రాజుగా తెలుగు గుండెల్లో శాశ్వత స్థానం

## నేడు 'అభినవ శకుని' జయంతి

తెలుగు నాటకరంగం, వెండితెరపై పౌరాణిక, చారిత్రక, సాంఘిక పాత్రలకు తనదైన అభినయంతో ప్రాణ ప్రతిష్ఠ చేసిన మహానటుడు చిలకాలపూడి సీతారామాంజనేయులు(సీఎస్ఆర్). జూలై 11న ఆయన జయంతి సందర్భంగా తెలుగు చిత్రసీమ, ప్రేక్షకులు ఆ అభినవ శకునికి ఘన నివాళులర్పిస్తున్నారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి దిగ్గజాల ప్రవేశానికి ముందే, అంటే 1930ల కాలంలోనే సి.ఎస్.ఆర్ ఒక వెలుగు వెలిగారు. సుమారు 175కి పైగా చిత్రాల్లో విభిన్నమైన పాత్రలు పోషించి మూడు దశాబ్దాల పాటు పరిశ్రమపై చెరగని ముద్ర వేశారు.

### రైటర్ టు స్టార్ యాక్టర్..

సి.ఎస్.ఆర్ 1907 జూలై 11న మచిలిపట్నం సమీపంలోని చిలకాలపూడిలో ఒక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి లక్ష్మీనరసింహమూర్తి రెవెన్యూ విభాగంలో పనిచేసేవారు. పొన్నూరులో పాఠశాల విద్యాభ్యాసం పూర్తయ్యాక కొద్దిరోజులు సహకార పర్యవేక్షకుడిగా ఉద్యోగం చేసినా.. నాటకాలపై ఉన్న మక్కువతో రంగస్థల బాట పట్టారు. పద్యాలు పాడటం దేవుడిచ్చిన వరమైతే, కవితలు రాయడంలో ఆయన దిట్ట. అంటరానితనానికి వ్యతిరేకంగా ఆయన 'పతితపావన' అనే నాటకాన్ని రాసి, దర్శకత్వం వహించారు. దేశభక్తి నింపుకున్న ఆయన.. 'తుకారాం' నాటక ప్రదర్శనల ద్వారా వసూలైన రూ. 10,000 నిధులను నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన 'ఆజాద్ హింద్ ఫౌజ్'కు విరాళంగా అందించి తన ఉదారతను చాటుకున్నారు.

### వెండితెరపై అప్రతిహత ప్రస్థానం

1932లో విడుదలైన 'రామపాదుకా పట్టాభిషేకం' చిత్రంతో సి.ఎస్.ఆర్ సినీరంగ ప్రవేశం చేశారు. 'శ్రీకృష్ణ తులాభారం'లో కృష్ణుడిగా, 'భక్త రామదాసు'లో రామదాసుగా, 'తుకారాం'గా పౌరాణిక, భక్తిరస పాత్రల్లో అద్భుతంగా నటించారు. 1950వ దశకంలో వచ్చిన క్లాసిక్ హిట్స్ ఆయన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. 'పాతాళభైరవి' చిత్రంలో ఉజ్జయిని రాజుగా ఆయన నటన అపూర్వం. భారతదేశపు మొదటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించబడిన ఘనత ఈ చిత్రానికి దక్కింది. అలాగే, 'దేవదాసు' చిత్రంలో సావిత్రిని వివాహం చేసుకునే ముసలి జమీందార్ పాత్రలో సి.ఎస్.ఆర్ జీవించారు.

### నభూతో నభవిష్యతి.. శకుని పాత్ర

తెలుగు సినీ చరిత్రలో 'శకుని' అనగానే అందరికీ గుర్తొచ్చే ఏకైక రూపం సి.ఎస్.ఆర్. 'మాయాబజార్' చిత్రంలో ఆయన పోషించిన శకుని పాత్ర 'నభూతో నభవిష్యతి'గా నిలిచిపోయింది. ఆయన డైలాగ్ డెలివరీ, మాయావి పాత్రలో చూపించిన హావభావాలు ఇప్పటికీ నటులకు ఒక పాఠ్యపుస్తకం. 'పెళ్ళి చేసి చూడు', 'కన్యాశుల్కం' (రామప్ప పంతులుగా), 'రోజులు మారాయి', 'అప్పు చేసి పప్పు కూడు', 'జగదేకవీరుని కథ' వంటి ఎన్నో అజరామర చిత్రాల్లో ఆయన కీలక పాత్రలు పోషించారు.

### తుది శ్వాస వరకు నటనలోనే..

సి.ఎస్.ఆర్ కుటుంబం కూడా సినీ పరిశ్రమతో ముడిపడి ఉంది. ఆయన సోదరుడు నాగేశ్వరరావు మాయాబజార్, సువర్ణసుందరి వంటి చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేయగా.. మరో సోదరుడు సి.వి. రత్నం భరణి స్టూడియోస్ చిత్రాలకు ప్రొడక్షన్ మేనేజర్‌గా వ్యవహరించారు. 1962లో విడుదలైన 'చిట్టి తమ్ముడు' ఆయన కళ్లముందు విడుదలైన చివరి చిత్రం కాగా.. ఆయన మరణానంతరం 1964లో విడుదలైన 'బొబ్బిలి యుద్ధం' సి.ఎస్.ఆర్ నటించిన ఆఖరి చిత్రం. అక్టోబర్ 8, 1963న తన 56వ ఏట ఈ అభినయ చక్రవర్తి కన్నుమూశారు. ఆయన భౌతికంగా దూరమైనా, ఆయన పోషించిన పాత్రలు, పలికిన సంభాషణలు తెలుగు సినీ చరిత్ర ఉన్నంత కాలం సజీవంగానే ఉంటాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జనాభా సమతుల్యతతోనే సుస్థిర ప్రగతి

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

చైనాను దాటి నూట నలభై నాలుగు కోట్లతో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా భారత్

సహజ వనరులపై పెరుగుతున్న తీవ్ర ఒత్తిడి



ఒక నిర్ణీత భౌగోళిక సరిహద్దుల పరిధిలో జీవించే మానవ సమూహాల ఉనికిని, వారి సంఖ్యా బలాన్ని జనాభాగా పరిగణిస్తారు. ఏ దేశానికైనా ఆ దేశ జనాభా ప్రాథమికంగా ఒక అద్భుతమైన మానవ వనరుగా, ప్రగతి చక్రాలను నడిపించే ఇంధనంగా పనిచేస్తుంది. అయితే, అదే జనాభా ఆయా దేశాల పరిమిత సహజ వనరులను, ఆర్థిక ఉత్పాదక సామర్థ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను, ఉపాధి అవకాశాలను మించి అడ్డూ అదుపూ లేకుండా పెరిగినప్పుడు అది ప్రగతికి ఊతమిచ్చే శక్తిగా కాక, వ్యవస్థలను కుప్పకూల్చే మహా భారంగా మారుతుంది. జనాభా విస్ఫోటనం వల్ల తలెత్తే పర్యావరణ పతనాన్ని, మానవ జీవన ప్రమాణాల క్షీణతను నివారించేందుకు ప్రజల్లో చైతన్యం తేవడమే ప్రతి ఏటా జూలై 11న నిర్వహించే ప్రపంచ జనాభా దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం.

### చారిత్రక నేపథ్యం..

1987 జూలై 11 నాటికి ప్రపంచ జనాభా ఐదు వందల కోట్లకు (5 బిలియన్లు) చేరుకుంది. ఆ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని, పెరిగిపోతున్న సంఖ్యపై ప్రపంచవ్యాప్తంగా మేధోమథనం జరగాలనే సంకల్పంతో ఐక్యరాజ్యసమితి దీనికి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఆ తర్వాత, 1989లో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (ఖచీణూ) పాలక మండలి అధికారికంగా ఈ దినోత్సవాన్ని ప్రతిపాదించగా, 1990 జూలై 11న ప్రపంచంలోని తొంభైకి పైగా దేశాల్లో మొదటిసారిగా ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. నాటి నుండి నేటి వరకు నిరంతరాయంగా ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక సామాజికాంశంతో ఈ దినోత్సవాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

### 800 కోట్లు దాటిన గ్లోబల్ పాపులేషన్..

క్రీస్తుశకం వెయ్యో సంవత్సరంలో భూమిపై కేవలం 40 కోట్ల మంది మాత్రమే ఉండేవారు. కానీ, పారిశ్రామిక విప్లవం, ఆధునిక వైద్య ఆవిష్కరణల ఊతంతో 1804 నాటికి ఆ సంఖ్య వంద కోట్లకు చేరింది. ఆపై రెండు వందల కోట్ల మార్కును అందుకోవడానికి మరో నూట ఇరవై ఏళ్ల సమయం పట్టగా, ఇరవైయో శతాబ్దపు ద్వితీయార్థంలో సంభవించిన వైద్యరంగ పురోగతి, అంటువ్యాధుల నిర్మూలన, శిశుమరణాల రేటు తగ్గడం, సగటు ఆయుర్దాయం పెరగడం వల్ల జనాభా పెరుగుదల ఉధృతి ఊహకందని స్థాయికి చేరింది. 1974లో 400 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా, కేవలం యాభై ఏళ్ల వ్యవధిలోనే రెట్టింపై ప్రస్తుతం 820 కోట్లకు (8.2 బిలియన్లు) పైగా చేరింది. ఐక్యరాజ్యసమితి తాజా నివేదికల ప్రకారం, రాబోయే 2050 నాటికి ప్రపంచ జనాభా 970 కోట్లకు, ఈ శతాబ్దపు అంతానికి అంటే 2100 నాటికి వెయ్యి కోట్లకు పైగా చేరుకుంటుందని అంచనా. అయితే ఐరోపా, ఉత్తర అమెరికా వంటి అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో జననాల రేటు క్షీణించి, వృద్ధుల జనాభా పెరిగిపోతుండగా, ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలలో జనాభా పెరుగుదల రేటు అత్యంత వేగంగా సాగుతోంది.

### భారత్‌లో జనాభా ఒత్తిడి - క్షేత్రస్థాయి వాస్తవాలు..

ఈ అంతర్జాతీయ జనాభా పరిణామాల నేపథ్యంలో, భారతదేశం చారిత్రాత్మకమైన మైలురాయిని దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన అగ్రగామి దేశంగా అవతరించింది. చైనాను వెనక్కి నెట్టి మన దేశం మొదటి స్థానానికి చేరుకోవడం ఒక రకంగా యువశక్తి (డెమోగ్రాఫిక్ డివిడెండ్) పరంగా మనకు అపారమైన అవకాశాలను అందిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలు దేశ ప్రణాళికాకర్తలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. మన దేశంలో 1872లో బ్రిటీష్ వారి కాలంలో తొలిసారిగా జనాభా గణన ప్రక్రియ ప్రయోగాత్మకంగా ప్రారంభం కాగా, 1881 నుండి ప్రతి పదేళ్లకు ఒకసారి క్రమబద్ధమైన జనగణన నిరంతరాయంగా సాగుతూ వచ్చింది. స్వతంత్ర భారతంలో 1951లో మొదటి జనాభా లెక్కలు సేకరించగా, చివరగా 2011లో నిర్వహించిన 15వ జనగణన ప్రకారం భారత జనాభా 121 కోట్లుగా నమోదైంది. ఆ తర్వాత దేశంలో పూర్తి స్థాయి అధికారిక జనగణన జరగనప్పటికీ, ప్రస్తుత అంచనాల ప్రకారం దేశ జనాభా 144 కోట్లకు పైగా దాటినట్లు నిపుణులు ధ్రువీకరిస్తున్నారు. ఈ అపారమైన జనాభా ఒత్తిడి వల్ల దేశవ్యాప్తంగా విద్య, వైద్యం, గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ప్రజారవాణా వ్యవస్థల పైన అంతకుమించిన భారం పడుతోంది. ఏటా కోట్లాది మంది విద్యావంతులైన యువతీ యువకులు ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నప్పటికీ, వారి నైపుణ్యాలకు తగిన ఉపాధి కల్పించడం పాలకులకు కత్తిమీద సాములా మారింది.

### పర్యావరణంపై పడుతున్న పెను సవాలు..

జనాభా విస్ఫోటనం అనేది కేవలం ఒక సంఖ్యాత్మక సమస్యా మాత్రమే కాదు, అది దేశ సామాజిక పర్యావరణ మనుగడకు సంబంధించిన పెను సవాలు. అపరిమితమైన మానవ అవసరాల కోసం పచ్చని అడవులను నరికివేస్తూ కాంక్రీట్ జంగిళ్లుగా మారుస్తుండటం వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోంది. గతంలో పంటలు పండిన సారవంతమైన సాగుభూములు నేడు బహుళ అంతస్తుల భవనాలుగా, పారిశ్రామిక మండలాలుగా రూపాంతరం చెందుతున్నాయి. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతుండటంతో నీటి ఎద్దడి అల్లాడిస్తోంది. జీవనదులన్నీ పారిశ్రామిక వ్యర్థాలతో, ప్లాస్టిక్ కాలుష్యంతో జీవచ్ఛవాలుగా మారుతున్నాయి. ఒకవైపు ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా దేశంలో ఆహారోత్పత్తి పెరుగుతున్నప్పటికీ, ఆ ఉత్పాదకతను మించి జనాభా పెరుగుతుండటంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ దుస్థితి సమాజంలో పేదరికం, తీవ్రమైన పోషకాహార లోపం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలను పెంచి పోషిస్తూ, నగరాల శివార్లలో మురికివాడల విస్తరణకు కారణమవుతోంది. ప్రకృతి ఇచ్చిన వనరులపై ఒత్తిడి పెరిగిన కొద్దీ మానవుల మధ్య నదీ జలాల వివాదాలు, భూమి కోసం ఘర్షణలు, ఉపాధి కోసం వలసలు పెరిగిపోయి అంతర్గత భద్రతకు కూడా ముప్పు వాటిల్లుతోంది.

### మహిళా విద్య - సాధికారతే ప్రధాన ఆయుధం

ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా 1952లో అధికారికంగా జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రకటించిన ఘనత భారతదేశానిదే. 'చిన్న కుటుంబమే చింత లేని కుటుంబం', 'ఇద్దరు లేదా ఒక్కరు' అనే నినాదాలతో ప్రభుత్వాలు విస్తృత ప్రచారం కల్పించడం వల్ల జాతీయ స్థాయిలో సగటు సంతానోత్పత్తి రేటు (ఊఖీ=) తగ్గుతూ వచ్చింది. అయినప్పటికీ, దేశంలోని కొన్ని వెనుకబడిన రాష్ట్రాలలో, గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న నిరక్షరాస్యత, తీవ్రమైన పేదరికం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, అన్నింటికీ మించి మగసంతానంపై ఉన్న మితిమీరిన వ్యామోహం వల్ల కుటుంబ నియంత్రణ ఆశించిన స్థాయిలో సత్ఫలితాలను ఇవ్వలేకపోయింది. జనాభా నియంత్రణకు, స్థిరీకరణకు మహిళా విద్య, సాధికారత అత్యంత ప్రధానమైన ఆయుధాలని అంతర్జాతీయ సామాజిక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక మహిళ చదువుకుని, ఆర్థికంగా తన కాళ్ల మీద తాను నిలబడినప్పుడు, ఆమె తన వివాహ వయసును, సంతాన నిర్ణయాధికారాన్ని స్వతంత్రంగా తీసుకోగలుగుతుంది. బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించడం, వారి ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా బాల్య వివాహాలను అడ్డుకోవచ్చు, తద్వారా జననాల రేటును సహజ సిద్ధంగానే అదుపు చేయవచ్చు. జనాభా నియంత్రణ అనేది ఏదో ఒక ప్రభుత్వ చట్టం ద్వారా లేదా బలవంతపు నిబంధనల ద్వారా సాధించేది కాకూడదు. అది ప్రతి కుటుంబం యొక్క నైతిక బాధ్యతగా సమాజంలో అంతర్గత చైతన్యం తీసుకురావాలి.




**చిన్న కుటుంబం అంటే కేవలం దేశ జనాభాను తగ్గించడం మాత్రమే కాదు; ఆ కుటుంబంలోని ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను, పౌష్టికాహారాన్ని, అత్యుత్తమ వైద్య సదుపాయాలను అందించి ప్రయోజకులను చేయడమే అనే సత్యాన్ని ప్రజల ఆలోచనా విధానాల్లోకి చొప్పించాలి. భూమి విస్తీర్ణం పరిమితమైనది, ప్రకృతి ప్రసాదించే వనరులు తరిగిపోయేవి అనే సత్యాన్ని గ్రహించి, సుస్థిరమైన అభివృద్ధి పథంలో దేశం సాగాలంటే జనాభా స్థిరీకరణను ఒక సామాజిక ఉద్యమంగా మార్చాలి. పాలకుల ప్రణాళికలు, పౌరుల బాధ్యతాయుత ప్రవర్తన, పర్యావరణ స్పృహ, మహిళా చైతన్యం సమాంతరంగా సాగినప్పుడే అపారమైన ఈ జనాభా దేశానికి అడ్డంకిగా మారకుండా, నవభారత నిర్మాణానికి అద్భుతమైన సంపదగా మారుతుంది.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మీ కారు ఈ-20కి అనుకూలమేనా?

**ఇలా సులభంగా తెలుసుకోండి**




**హైదరాబాద్, జులై 10:** దేశవ్యాప్తంగా ఈ--ఇరవై ఇంధనం వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, తమ కారు ఈ ఇంధనానికి అనుకూలంగా ఉందో లేదో తెలుసుకోవాలనే ఆసక్తి వాహనదారుల్లో పెరుగుతోంది. ముఖ్యంగా పాత కార్ల యజమానులు ఈ విషయంపై సందిగ్ధంలో ఉన్నారు. అయితే కొన్ని సులభమైన మార్గాల ద్వారా మీ వాహనం ఈ--ఇరవై ఇంధనాన్ని ఉపయోగించేందుకు అనుకూలంగా ఉందో లేదో సులభంగా నిర్ధారించుకోవచ్చు. ఈ-20 అనేది ఎనభై శాతం పెట్రోలు, ఇరవై శాతం ఇథనాల్ కలిపి తయారు చేసే మిశ్రమ ఇంధనం. చెరకు, ధాన్యాల వంటి పంటల నుంచి తయారయ్యే ఇథనాల్ వినియోగాన్ని పెంచడం ద్వారా ముడి చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు వాహనాల వల్ల కలిగే కాలుష్యాన్ని కూడా నియంత్రించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఇంధనాన్ని ప్రోత్సహిస్తోంది. మీ కారు ఈ-20 ఇంధనానికి అనుకూలంగా ఉందో లేదో తెలుసుకోవడానికి ముందుగా ఇంధన ట్యాంకు మూతను పరిశీలించాలి. కొత్త వాహనాల్లో సాధారణంగా ఇంధన ట్యాంకు మూత వద్ద ఈ-20 ఇంధనం ఉపయోగించవచ్చని సూచించే ప్రత్యేక గుర్తు లేదా స్టిక్కర్‌ను సంస్థలు అమర్చుతున్నాయి. అలాంటి గుర్తు కనిపిస్తే మీ వాహనం ఈ ఇంధనాన్ని ఉపయోగించేందుకు సిద్ధంగా ఉందని అర్థం. ఇంధన ట్యాంకు మూతపై అలాంటి గుర్తు కనిపించకపోతే వాహనంతో పాటు ఇచ్చే యజమాని పుస్తకాన్ని పరిశీలించడం మంచిది. అందులో ఇంధనానికి సంబంధించిన విభాగంలో ఏ రకమైన ఇంధనాన్ని ఉపయోగించవచ్చో స్పష్టంగా పేర్కొంటారు. ముఖ్యంగా పాత వాహనాల యజమానులకు ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుంది. యజమాని పుస్తకంలో కూడా స్పష్టత లేకపోతే వాహనం యొక్క గుర్తింపు సంఖ్య ఆధారంగా అధికారిక సేవా కేంద్రాన్ని సంప్రదించవచ్చు. ఈ సంఖ్య వాహనం నమోదు ధ్రువీకరణ పత్రంలో, ముందు అద్దం సమీపంలో లేదా డ్రైవర్ తలుపు ఫ్రేమ్‌పై ఉంటుంది. ఆ సంఖ్య ఆధారంగా సంస్థ ప్రతినిధులు మీ వాహనం ఈ-20 ఇంధనానికి అనుకూలమో కాదో నిర్ధారించి చెబుతారు. అదే విధంగా వాహన తయారీ సంస్థల అధికారిక వెబ్‌సైట్లలో కూడా ఈ-20 ఇంధనానికి సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. వాహనం మోడల్, తయారీ సంవత్సరాన్ని బట్టి అనుకూలత వివరాలను అక్కడ తెలుసుకోవచ్చు. కాలక్రమేణా ఇంధన ట్యాంకు మూతపై ఉన్న స్టిక్కర్లు చెదిరిపోయిన సందర్భాల్లో ఈ పద్ధతి మరింత ఉపయోగకరంగా ఉంటుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ-20 ఇంధనానికి అనుకూలంగా రూపొందించిన వాహనాల్లో ఇంజిన్, ఇంధన వ్యవస్థకు సంబంధించిన భాగాలు అధిక ఇథనాల్‌ను తట్టుకునేలా తయారు చేస్తారు. అయితే పాత సాంకేతికతతో రూపొందించిన వాహనాల్లో దీర్ఘకాలం ఈ-20 ఇంధనాన్ని ఉపయోగిస్తే రబ్బరు భాగాలు, ఇంధన వ్యవస్థలోని కొన్ని పరికరాలు త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అందువల్ల ఊహాగానాలపై ఆధారపడకుండా, మీ వాహనం ఈ-20 ఇంధనానికి అనుకూలమో కాదో అధికారికంగా నిర్ధారించుకుని మాత్రమే వినియోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# తగ్గిన అర్హతలతో గిరిజనులకు గృహ రుణాలు




**హైదరాబాద్, జులై 10:** గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వ రంగంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రత్యేక గృహ రుణ పథకాన్ని ప్రారంభించింది. సంప్రదాయ తనఖా, భూ యాజమాన్య సమస్యల కారణంగా బ్యాంకు రుణాలు పొందలేకపోతున్న అర్హులైన గిరిజన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించింది. ప్రస్తుతం ఈ పథకాన్ని గౌహతి, రాయ్‌పూర్ జోన్ల పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తుండగా, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశాలు ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. ఈ ప్రత్యేక గృహ రుణ పథకం కింద నెలసరి వేతనం పొందుతున్న ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, వృత్తి నిపుణులు, చిన్న వ్యాపారులు నివాస గృహాలు, ఫ్లాట్లు కొనుగోలు చేయడం, కొత్త ఇల్లు నిర్మించడం, మరమ్మతులు చేయడం లేదా విస్తరణ చేపట్టడం కోసం రుణాలు పొందవచ్చు. ఉద్యోగులకు కనిష్ఠంగా లక్ష రూపాయల నుంచి గరిష్ఠంగా నలభై లక్షల రూపాయల వరకు రుణం అందుబాటులో ఉండగా, స్వయం ఉపాధి పొందుతున్నవారు, వ్యాపారులు, వృత్తి నిపుణులకు ఇరవై ఐదు లక్షల రూపాయల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. రుణాన్ని గరిష్ఠంగా పదిహేనేళ్ల వ్యవధిలో తిరిగి చెల్లించే అవకాశం కల్పించారు. వడ్డీ రేట్లు దరఖాస్తుదారుడి రుణ చరిత్ర, ఆర్థిక స్థితి, ఇతర అర్హతల ఆధారంగా నిర్ణయించబడతాయి. గిరిజన ప్రాంతాల్లో భూమి తనఖా సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉండటంతో వాటిని దృష్టిలో ఉంచుకుని సవరించిన అర్హత నిబంధనలను ఈ పథకంలో అమలు చేస్తున్నట్లు బ్యాంకు తెలిపింది. ఈ పథకం ద్వారా గిరిజన ప్రాంతాల్లోని అర్హులైన కుటుంబాలు సులభంగా గృహ రుణాలు పొందగలుగుతాయని బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. ఎంపిక చేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ శాఖల ద్వారా మాత్రమే ఈ రుణ సదుపాయం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడంతో పాటు ప్రజలకు అధికారిక రుణ వ్యవస్థను చేరువ చేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రధాన అధికారుల్లో ఒకరైన సుబోధ్ కుమార్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల ప్రజలు గృహ రుణాల విషయంలో ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు. సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడం, అధికారిక బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించడం, గిరిజన ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

# ఆకట్టుకునేలా సోనీ కొత్త కెమెరా



**హైదరాబాద్, జులై 10:** ఫోటోగ్రఫీ ప్రియులను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ సోనీ సరికొత్త బ్రిడ్జ కెమెరాను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. గతంలో మంచి ఆదరణ పొందిన మోడల్‌కు వారసుడిగా విడుదలైన ఈ కెమెరాలో రూపకల్పనతో పాటు పలు సాంకేతిక మార్పులు చేశారు. లెన్స్ మార్చాల్సిన అవసరం లేకుండా విస్తృత జూమ్ సామర్థ్యాన్ని అందించేలా దీనిని రూపొందించారు. కొత్త కెమెరాలో మెరుగైన ఎలక్ట్రానిక్ వ్యూఫైండర్, ఆధునిక ప్రాసెసర్, కృత్రిమ మేధ ఆధారిత ఆటోఫోకస్ వ్యవస్థను అమర్చారు. మనుషులు, జంతువులు, పక్షులు, వాహనాలు వంటి పలు అంశాలను వేగంగా గుర్తించి ఫోకస్ చేసే సామర్థ్యం ఇందులో ఉంది. అలాగే సులభంగా ఉపయోగించుకునే కొత్త మెనూ వ్యవస్థ, మెరుగైన నియంత్రణ బటన్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. పగటి సమయంలో తీసే చిత్రాలు అత్యంత స్పష్టంగా, సహజ రంగులతో కనిపిస్తున్నాయని ఫోటోగ్రఫీ నిపుణులు పేర్కొంటున్నారు. విస్తృత జూమ్ లెన్స్ కారణంగా ప్రకృతి దృశ్యాలు, వన్యప్రాణులు, క్రీడా ఈవెంట్లు వంటి వాటిని చిత్రీకరించేందుకు ఇది అనువుగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. వేగవంతమైన ప్రాసెసర్ కారణంగా చిత్రాల ప్రాసెసింగ్ కూడా త్వరగా పూర్తవుతోంది. అయితే తక్కువ వెలుతురులో చిత్రాల నాణ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడం ఈ కెమెరాకు ప్రతికూలంగా మారింది. వెలుతురు తగ్గినప్పుడు చిత్రాల్లో స్పష్టత తగ్గడంతో పాటు శబ్దం ఎక్కువగా కనిపిస్తోందని సమీక్షలు చెబుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆటోఫోకస్ వ్యవస్థ కూడా లక్ష్యాన్ని గుర్తించడంలో ఆలస్యం చేస్తోందని నిపుణులు సూచిస్తున్నారు. అయినప్పటికీ ఒకే కెమెరాతో విస్తృత జూమ్, ఆధునిక సాంకేతికత, సులభ వినియోగాన్ని కోరుకునే వారికి ఈ కొత్త మోడల్ మంచి ఎంపికగా నిలుస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. పగటి ఫోటోగ్రఫీకి అధిక ప్రాధాన్యం ఇచ్చే వినియోగదారులను ఈ కెమెరా మరింత ఆకట్టుకునే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

# కల్యాణ్ జ్యువెలర్స్ షేర్ల జోరు..

**పెట్టుబడిదారులకు భారీ లాభాలు**

**హైదరాబాద్, జులై 10:** దేశీయ ఆభరణాల విక్రయ రంగంలో ప్రముఖ సంస్థ కళ్యాణ్ జ్యువెలర్స్ షేర్లు వరుసగా మూడో రోజు కూడా బలమైన లాభాలతో దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన ట్రేడింగ్‌లో ఈ షేరు ఏడు శాతానికి పైగా పెరిగి అత్యధిక స్థాయిని తాకింది. దీంతో పెట్టుబడిదారులకు గణనీయమైన లాభాలు చేకూరగా, కంపెనీ మార్కెట్ విలువ కూడా భారీగా పెరిగింది. గత మూడు ట్రేడింగ్ రోజులలోనే ఈ షేరు దాదాపు 34 శాతం మేర పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువకు సుమారు రూ.11,500 కోట్లు అదనంగా చేరాయి. ప్రస్తుతం సంస్థ మొత్తం మార్కెట్ విలువ రూ.48,850 కోట్లకు చేరుకుంది. ఈ ఏడాది ఆరంభంలో ఎదురైన నష్టాలను కూడా ఈ పెరుగుదలతో దాదాపు భర్తీ చేసుకుంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థ ఒకటి ఈ షేరుపై అనుకూల నివేదిక విడుదల చేయడం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచింది. సంస్థ షేర్లను కొనుగోలు చేయాలని సూచించడంతో పాటు ఒక్కో షేరుకు రూ.750 లక్ష్య ధరను నిర్దేశించింది. ప్రస్తుతం ఉన్న ధరతో పోలిస్తే భవిష్యత్తులో మరింత పెరుగుదలకు అవకాశం ఉందని పేర్కొంది. ఇటీవల ముగిసిన తొలి త్రైమాసికంలో సంస్థ ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 38 శాతం పెరగడం కూడా పెట్టుబడిదారులను ఆకర్షించింది. దీర్ఘకాలంలో కంపెనీ వృద్ధి అవకాశాలు బలంగా ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో కూడా ఈ షేరు పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.






# బంగారం ధరలు మళ్లీ పెరుగుదల


**హైదరాబాద్, జులై 10:** దేశంలో బంగారం ధరలు మరోసారి స్వల్పంగా పెరిగాయి. వరుసగా రెండో రోజు పసిడి ధరల్లో పెరుగుదల నమోదైంది. అయినప్పటికీ గత నెలతో పోలిస్తే ప్రస్తుతం ధరలు కొంత తక్కువ స్థాయిలోనే ఉన్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,820కు చేరుకుంది. గురువారంతో పోలిస్తే రూ.380 పెరిగింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.350 పెరిగి రూ.1,32,750గా నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,620 వద్ద కొనసాగుతోంది. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిల్లో కూడా 24 క్యారెట్ల బంగారం రూ.1,44,820, 22 క్యారెట్ల బంగారం రూ.1,32,750 వద్ద విక్రయమవుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం అత్యధికంగా రూ.1,45,640గా ఉండగా, న్యూఢిల్లీలో రూ.1,44,950గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో ధరలు దాదాపు హైదరాబాద్ స్థాయిలోనే కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధరల కదలికలు, డాలర్ మారకపు విలువ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ప్రతిరోజూ మారుతున్నాయని బులియన్ వ్యాపారులు తెలిపారు. కొనుగోలు చేసే ముందు స్థానిక నగల దుకాణాల్లో తాజా ధరలను ఒకసారి నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు.

# ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓకు రంగం సిద్ధం




**హైదరాబాద్, జులై 10:** భారతీయ బ్యాంకింగ్ రంగంలో ప్రముఖ సంస్థ స్టేట్ బ్యాంక్ అనుబంధ సంస్థ అయిన ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ తన తొలి ప్రజా వాటాల విక్రయానికి సిద్ధమైంది. ఈ ఐపీఓ కోసం ఒక్కో షేరు ధరను రూ.545 నుంచి రూ.574 మధ్య నిర్ణయించారు. ఒక లాట్‌లో 26 షేర్లు ఉండగా, పెట్టుబడిదారులు కనీసం ఒక లాట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఐపీఓకు దరఖాస్తుల స్వీకరణ జులై 14న ప్రారంభమై 16తో ముగియనుంది. వాటాల కేటాయింపు అనంతరం జులై 21న కంపెనీ షేర్లు స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కానున్నాయి. ఈ ఇష్యూ పూర్తిగా ఇప్పటికే ఉన్న వాటాల విక్రయం రూపంలోనే నిర్వహించబడుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా స్టేట్ బ్యాంక్ సుమారు 12.83 కోట్ల షేర్లను, అముండి ఇండియా సంస్థ 7.56 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి. దేశంలో విశ్వసనీయ ఆర్థిక సంస్థగా గుర్తింపు పొందిన స్టేట్ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన సంస్థ కావడంతో ఈ ఐపీఓపై పెట్టుబడిదారుల్లో ఆసక్తి నెలకొంది. మార్కెట్ నుంచి భారీ నిధులు సమీకరించడమే ఈ ప్రజా వాటాల విక్రయ ప్రధాన లక్ష్యంగా కంపెనీ భావిస్తోంది.

# విశాఖ పాల ధర పెంపు




**విశాఖపట్నం, జులై 10:** ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ విశాఖ డెయిరీ పాలు, పెరుగు ధరలను పెంచింది. పాల సేకరణ, నిర్వహణ వ్యయాలు పెరగడంతో సవరించిన ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు యాజమాన్యం తెలిపింది. తాజా ధరల ప్రకారం అర లీటర్ ఫుల్ క్రీమ్ పాల ప్యాకెట్ రూ.34 నుంచి రూ.36కు, లీటర్ ప్యాకెట్ రూ.68 నుంచి రూ.71కు పెరిగింది. అలాగే 400 గ్రాముల పెరుగు కప్పు రూ.32 నుంచి రూ.35కు, ఒక కిలో పెరుగు బకెట్ రూ.95 నుంచి రూ.100కు పెంచారు. ధరల పెంపుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడనుంది. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పాలు, పెరుగు ధరలు కూడా పెంచడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలు, పెరిగిన నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డెయిరీ వర్గాలు వెల్లడించాయి.

# చెన్నైలో బిగ్‌బాష్ తొలి విదేశీ మ్యాచ్







**చెన్నై, జులై 10:** ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ఆదరణ పొందిన లీగ్‌లలో ఒకటైన ఆస్ట్రేలియా బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో తొలిసారిగా విదేశీ గడ్డపై అధికారిక మ్యాచ్‌ను నిర్వహించనుంది. బిగ్‌బాష్ లీగ్ 2026-27 సీజన్‌కు సంబంధించిన ప్రారంభ మ్యాచ్‌ను తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మెల్‌బోర్న్‌లో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించిన వివరాల ప్రకారం డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో ఈ చారిత్రాత్మక మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ మెల్‌బోర్న్ రెనెగేడ్స్ జట్టు, పెర్త్ స్కార్చర్స్‌తో తలపడనుంది. ఈ పోరులో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ హోం జట్టుగా బరిలోకి దిగనుండటం విశేషం. విదేశీ దేశీయ క్రికెట్ లీగ్‌కు చెందిన అధికారిక మ్యాచ్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి కావడం మరో ప్రత్యేకతగా నిలిచింది. ఈ మ్యాచ్ విజయవంతంగా నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి కూడా పూర్తి సహకారం అందించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే చారిత్రాత్మక అడుగుగా ఈ మ్యాచ్‌ను అభివర్ణించారు. చెన్నైలో జరిగే ఈ ప్రత్యేక పోరులో గెలుపోటముల కంటే ఆట స్ఫూర్తి, ఇరు దేశాల స్నేహబంధమే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. బిగ్‌బాష్ లీగ్‌ను భారత క్రికెట్ అభిమానులకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాచ్‌తో పాటు చెన్నైలో సాంస్కృతిక, చలనచిత్ర ఉత్సవాలను కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల ద్వారా రెండు దేశాల మధ్య పర్యాటకం, వ్యాపారం, సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆస్ట్రేలియాలో ఐపీఎల్‌కు బాటలు






**మెల్‌బోర్న్, జులై 10 :** భారత్-ఆస్ట్రేలియా క్రికెట్ సంబంధాలు మరో కీలక మైలురాయిని చేరుకోనున్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ టీ20 టోర్నీ బిగ్‌బాష్ లీగ్ చరిత్రలో తొలిసారిగా ఆ దేశం వెలుపల మ్యాచ్ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం (చేపాక్) స్టేడియంలో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్ల మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుంది. ఈ చారిత్రాత్మక ప్రకటనను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ సంయుక్తంగా వెల్లడించారు. రెండు దేశాల మధ్య దౌత్య, క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగంగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. అయితే ఈ సహకారం బిగ్‌బాష్ లీగ్‌తో మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను కూడా భవిష్యత్తులో ఆస్ట్రేలియాలో నిర్వహించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియా మీడియా కథనాల ప్రకారం, చెన్నైలో బిగ్‌బాష్ ప్రారంభ మ్యాచ్‌ను ప్రతి ఏడాది నిర్వహించేలా ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. దీనికి ప్రతిగా ఆస్ట్రేలియాలో ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించాలని క్రికెట్ ఆస్ట్రేలియా భారత క్రికెట్ నియంత్రణ మండలికి ప్రతిపాదించింది. ప్రస్తుతం ఇరు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య ఈ అంశంపై అంతర్గత చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ప్రతిపాదనకు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదం తెలిపితే, భవిష్యత్తులో మెల్‌బోర్న్, సిడ్నీ వంటి నగరాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం ఏర్పడనుంది. దీంతో ఆస్ట్రేలియాలో నివసిస్తున్న భారత అభిమానులు తమ అభిమాన జట్ల మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం దక్కనుంది. క్రీడా విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం అమల్లోకి వస్తే రెండు దేశాల మధ్య క్రికెట్ సహకారం మరింత బలపడటంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా టీ20 క్రికెట్‌కు కొత్త దిశను చూపించే పరిణామంగా నిలిచే అవకాశం ఉంది.

# పర్ఫామెన్స్‌కు విలువ లేదా?

### టీ20ల్లో టీమిండియా వరుస పరాజయాలు

### సిఫార్సుల ద్వారానే ఛాన్స్‌లు..

### టీమిండియా ఎంపికలపై విమర్శలు!

### ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై మూడు టీ20ల్లో ఓటమి

**ముంబై:** టీమిండియా గత 5-6 టీ20ల్లో వరుస పరాజయాలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై మూడు టీ20ల్లో భారత్ ఓడిపోయింది. ఈ నేపథ్యంలో భారత జట్టు ఎంపికపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఆటగాళ్ల ఎంపికలో ప్రతిభ కంటే వ్యక్తిగత అనుబంధాలు, లాబీయింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అభిమానులు, నెటిజన్లు.. బీసీసీఐ, సెలెక్టర్లపై విమర్శలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఓ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వైరల్ పోస్టులో టీమిండియా ఆటగాళ్ల ఎంపికపై నెటిజెన్స్ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. అభిషేక్ శర్మకు యువరాజ్ సింగ్ మద్దతు కారణంగా అవకాశం దక్కిందని, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అతని వయస్సు కారణంగా ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని నెటిజెన్స్ పేర్కొన్నారు. ఇషాన్ కిషన్ మాత్రం దేశవాళీ క్రికెట్‌లో రాణించి తిరిగి భారత జట్టులోకి వచ్చిన ఏకైక ఆటగాడని అభిప్రాయపడ్డారు. శ్రేయస్ అయ్యర్ దేశవాళీ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చి జట్టులో చోటు సంపాదించాడని పేర్కొన్నారు. శివమ్ దూబేను స్పిన్ బౌలర్లపై భారీ షాట్లు ఆడగలడనే ఉద్దేశంతో ఎంపిక చేసినా.. స్పిన్ బౌలింగ్‌కే బలవుతున్నాడని విమర్శించారు. తిలక్ వర్మ ఎంపిక వెనుక రోహిత్ శర్మ మద్దతు, ముంబై లాబీ ప్రభావం ఉందని ఆరోపించారు. అక్షర్ పటేల్‌కు 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఆడిన కీలక ఇన్నింగ్స్, ఫీల్డింగ్ కారణంగా అవకాశాలు కొనసాగుతున్నాయని.. వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాలకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మద్దతు కారణమని ఆ పోస్టులో నెటిజెన్స్ పేర్కొన్నారు. భారత క్రికెట్‌లో ప్రస్తుతం ప్రదర్శన కంటే ఇతర అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. రజత్ పాటీదార్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్ ప్రస్తుత టీ20 జట్టులోని చాలా మంది ఆటగాళ్ల కంటే మెరుగైన ప్రదర్శన చేయగలరని అభిప్రాయపడ్డారు. ఇషాన్, శ్రేయాస్ మాత్రమే అద్భుత ప్రదర్శనతో జట్టులో చోటు సంపాదించారని ఫాన్స్ పేర్కొంటున్నారు.

# లార్డ్స్‌లో తొలి టెస్టు

### స్మృతి మంధాన అరుదైన ఘనత



భారత మహిళా జట్టు ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఆతిథ్య ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఈ ఏకైక టెస్టులో.. టీమిండియా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అరుదైన ఘనత సాధించింది. అంతర్జాతీయ కెరీర్‌లో అతి పిన్న వయసులో 300 మ్యాచ్‌లు ఆడిన బ్యాటర్‌గా నిలిచింది. ఈ క్రమంలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన భారత మహిళల జాబితాలో స్మృతి మూడో స్థానంలో ఉంది. 2013లో బంగ్లాదేశ్‌పై టీ20 మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన స్మృతి.. ఇప్పటి వరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 300 మ్యాచ్‌లు ఆడింది. ఈ జాబితాలో ప్రస్తుతం భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(374) అగ్రస్థానంలో ఉండగా, భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్(333) రెండో స్థానంలో కొనసాగుతోంది. 29ఏళ్ల స్మృతి ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు, 120 వన్డేలు, 171 టీ20 మ్యాచులు ఆడింది. మొత్తం 10వేలకుపైగా పరుగులు చేసింది. ఇందులో 17 సెంచరీలు, 74 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 67 బంతుల్లో 56 పరుగులు చేసి క్రీజులో కొనసాగుతోంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. లంచ్ బ్రేక్ సమయానికి 3 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(0), యాస్తికా భాటియా(12) నిరాశ పర్చారు. జెమీమా రోడ్రిగ్స్(35) పరుగులు చేసి ఔటైంది. కాగా స్మృతి మంధాన(56ని), హర్మన్ ప్రీత్ కౌర్(14ని) క్రీజులో కొనసాగుతున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్, లారెన్ ఫైలర్, ఇస్సీ వాంగ్ తలొక వికెట్ పడగొట్టారు.



# లార్డ్స్‌లో భారత మహిళలకు చారిత్రక టెస్టు

**లండన్, జులై 10:** టీ20 ప్రపంచకప్‌లో నిరాశాజనక ప్రదర్శనతో గ్రూప్ దశలోనే నిష్క్రమించిన భారత మహిళల క్రికెట్ జట్టు మరో కీలక సవాల్‌కు సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్ మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో శుక్రవారం భారత జట్టు బరిలోకి దిగింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత మహిళలు తొలుత బ్యాటింగ్ ప్రారంభించారు. లార్డ్స్ మైదానంలో భారత మహిళల జట్టు టెస్టు మ్యాచ్ ఆడటం ఇదే తొలిసారి కావడం విశేషం. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక వేదికగా గుర్తింపు పొందిన ఈ మైదానంలో తొలి టెస్టు ఆడుతూ భారత మహిళలు చారిత్రక ఘట్టాన్ని నమోదు చేశారు. ఈ మ్యాచ్ ద్వారా ఇరు జట్లు విజయంతో సిరీస్‌ను ముగించాలనే లక్ష్యంతో బరిలోకి దిగాయి. భారత్ తరఫున టీ20 ప్రపంచ నంబర్-ఒకటి బౌలర్ శ్రీచరణి టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేస్తుండగా, ఇంగ్లండ్ తరఫున క్యాప్సీ, మ్యాడీలు తొలి టెస్టు మ్యాచ్ ఆడుతున్నారు. ఈ అరంగేట్ర ఆటగాళ్ల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మహిళల టెస్టు మ్యాచ్‌లు నాలుగు రోజుల పాటు జరుగుతాయి. ఇంగ్లండ్ తుది జట్టు: నాట్ సీవర్ బ్రంట్ (కెప్టెన్), టామీ బీమౌంట్, మియా బౌచీర్, హీథర్ నైట్, క్యాప్సీ, అమీ జోన్స్ (వికెట్ కీపర్), మ్యాడీ, సోఫీ ఎకిల్‌స్టన్, ఇస్సీ వాంగ్, లారెన్ బెల్, లారెన్ ఫైలర్. భారత్ తుది జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, యాస్తికా భాటియా, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, సయాలీ, శ్రీచరణి, క్రాంతి గౌడ్.

# టీ20ల్లో శ్రేయస్ అరుదైన రికార్డు

### జట్టు విఫలమైనా 'సర్పంచ్ సాబ్' ఒంటరి పోరాటం!

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత జట్టు వరుసగా నిరాశపరుస్తున్నా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాత్రం తన బ్యాటింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. ఇప్పటికే మూడు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన భారత్.. బ్రిస్టల్ వేదికగా జరిగిన నాలుగో టీ20లోనూ బ్యాటింగ్‌లో తడబడింది. అయితే కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఒంటరి పోరాటంతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్ వరుసగా విఫలమైన వేళ శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా బ్యాట్ ఊపాడు. చివరి వరకు అజేయంగా నిలిచిన ఆయన 80 పరుగులు చేసి భారత్‌ను 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగుల వరకు తీసుకెళ్లాడు. శ్రేయస్ తర్వాత భారత బ్యాటర్లలో అత్యధిక స్కోరు కేవలం 22 పరుగులే కావడం ఆయన ఇన్నింగ్స్ ఎంత విలువైనదో చెప్పకనే చెబుతోంది. ఈ ఇన్నింగ్స్‌తో శ్రేయస్ అయ్యర్ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. భారత జట్టులో మిగతా ఏ బ్యాటర్ కూడా 25 పరుగులు దాటని మ్యాచ్‌ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు నమోదు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆయన మూడో స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్‌పై చేసిన అజేయ 80 పరుగులు ఈ ప్రత్యేక జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితాలో తొలి స్థానంలో మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఉన్నాడు. అమెరికాపై అజేయంగా 84 పరుగులు చేసిన ఆ మ్యాచ్‌లో మరో భారత బ్యాటర్ 25 పరుగులకు మించి చేయలేదు. రెండో స్థానంలో విరాట్ కోహ్లీ ఉన్నాడు. ఆస్ట్రేలియాపై ఆయన చేసిన అజేయ 82 పరుగుల ఇన్నింగ్స్ సమయంలో మిగతా బ్యాటర్లలో ఎవరూ 21 పరుగులు దాటలేదు. విశేషమేమిటంటే.. ఈ ప్రత్యేక జాబితాలో శ్రేయస్ అయ్యర్ పేరు ఒకసారి కాదు, మూడు సార్లు ఉంది. ఇంగ్లండ్‌పై చేసిన అజేయ 80 పరుగులతో పాటు, శ్రీలంకపై అజేయ 73 పరుగులు, మరోసారి ఇంగ్లండ్‌పైనే చేసిన 67 పరుగుల ఇన్నింగ్స్‌లు కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. జట్టు మొత్తం విఫలమైన సందర్భాల్లో కూడా బాధ్యత తీసుకుని ఒంటరిగా పోరాడే బ్యాటర్‌గా శ్రేయస్ తన విలువను మరోసారి నిరూపించాడు.



మనసులోమాట

## జన నాయగన్‌కు
# ఏ సర్టిఫికెట్

### పలు మార్పులు సూచించిన సెన్సార్ బోర్డు

తమిళనాడు సీఎం, నటుడు విజయ్ కథానాయకుడిగా, హెచ్.వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన 'జన నాయగన్' చిత్రం ఎట్టకేలకు సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత సెన్సార్ బోర్డు ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. అయితే మొత్తం మూడు గంటల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో దాదాపు 12 కీలక మార్పులు చేయాలని బోర్డు సూచించింది. ఇందులో భాగంగా విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని. అలాగే 'అంబేద్కర్ చట్టం' అనే డైలాగ్‌ను మార్చాలని, ఓ పుస్తకం కవర్‌పై అంబేద్కర్ ఉన్న విజువల్స్‌ను సవరించాలని బోర్డు స్పష్టం చేసింది. ఇక దేశభక్తికి సంబంధించిన అంశాల్లో భాగంగా భారత జాతీయ జెండా కింద పడుతున్నట్లు ఉన్న ఒక కీలకమైన షాట్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. వీటితో పాటు సినిమాలో 'రంగనాథర్', 'ఓం' అనే పదాలతో పాటు 'ఆపరేషన్ మేలుహా' వివరణలో వచ్చే 'న్యూ ఇండియా' అనే పదాన్ని మ్యూట్ చేయాల్సిందిగా పేర్కొంది. సమాజంలో సున్నితమైన అంశాలకు సంబంధించి ఒక చిన్నారిని తగలబెడుతున్నట్లు ఉన్న విజువల్స్‌ను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే విజువల్స్ రీప్లేస్ చేయాలని బోర్డు వెల్లడించింది. అలాగే సినిమాలో 'షీలా రాణి' అనే పేరు ఎక్కడ వచ్చినా మార్చాలని, అంతర్జాతీయ అంశాలకు సంబంధించిన సద్దాం హుస్సేన్ ఉరితీత డైలాగ్‌ను కూడా మ్యూట్ లేదా రీప్లేస్ చేయాలని సూచించింది. వీటితో పాటు మరికొన్ని సన్నివేశాల్లో వచ్చే వివాదాస్పద పదాలను కూడా మ్యూట్ చేయాలని సెన్సార్ బోర్డు ఆదేశాల జాబితాలో పేర్కొంది. ఈ సినిమాలో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించగా, మమితా బైజు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ మార్పులన్నింటినీ పూర్తి చేసుకుని జులై 24న 'జన నాయగన్' థియేటర్‌లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.






# 40 ప్లస్‌లోనూ స్టన్నింగ్ లుక్

### వైరల్ అవుతున్న విమలా రామన్ ఫొటోలు

మలయాళ, తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి విమలా రామన్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. 44 ఏళ్ల వయసులోనూ అదే ఫిట్‌నెస్, అదే గ్లామర్‌ను మెయింటైన్ చేస్తూ అభిమానులను ఫిదా చేస్తోంది. తమిళ చిత్రం 'పోయి'తో సినీ రంగంలో అడుగుపెట్టిన విమలా రామన్.. అనంతరం 'టైమ్' సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. వరుసగా పలు మలయాళ చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. తెలుగులో 'ఎవరైనా ఎప్పుడైనా' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైన ఆమె.. తొలి చిత్రంతోనే అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఇటీవల కాలంలో సినిమాల సంఖ్య తగ్గింది. సినిమాల్లో తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం విమలా రామన్ చాలా యాక్టివ్‌గా ఉంటోంది. తరచూ తన గ్లామరస్ ఫోటోషూట్లను అభిమానులతో పంచుకుంటూ నెట్టింట సందడి చేస్తోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. లైట్ పింక్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో స్టైలిష్‌గా మెరిసిన విమలా.. ట్రెండీ లుక్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఎద, నడుము అందాలు హైలైట్ అయ్యేలా ఇచ్చిన స్టైలిష్ పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొన్ని ఫొటోల్లో కురులను ముఖంపైకి వదిలి, మరికొన్నింటిలో వెనక్కి సర్దుకుని డిఫరెంట్ లుక్స్‌లో కనిపించింది. ఒక చేతికి బ్రేస్‌లెట్, వేళ్లకు ఉంగరాలు ధరించి తన స్టైలింగ్‌కు మరింత అందాన్ని జోడించింది. మొత్తంగా 40 ప్లస్‌లోనూ తన గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని మరోసారి నిరూపించిన విమలా రామన్.. తాజా ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు ఆమె అందంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



# హీరో అవకాశం ఇస్తామంటూ మూడున్నర కోట్లు వసూలు


### పిల్ల జమిందార్ నిర్మాత దర్శకులపై కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 10:** తెలుగు సినిమా రంగంలో హీరోగా ఎంట్రీ ఇప్పిస్తామంటూ భారీ మోసానికి పాల్పడిన వ్యవహారంలో టాలీవుడ్ హిట్ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిలపై సైబరాబాద్ పోలీస్ పరిధిలో కేసు నమోదైంది. బాధితుల కథనం ప్రకారం.. ఒక యువకుడిని టాలీవుడ్‌లో హీరోగా పరిచయం చేస్తామంటూ నమ్మించిన దర్శకుడు అశోక్ బాబు, సదరు యువకుడి తల్లిదండ్రుల నుండి విడతల వారీగా దాదాపు రూ.3.5 కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే, డబ్బులు తీసుకుని చాలా కాలం గడుస్తున్నా సినిమా ఊసే ఎత్తకపోగా, యువకుడిని హీరోగా లాంచ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా నిలదీశారు. తీసుకున్న భారీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేందుకు కూడా నిరాకరించడంతో, బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి చెందిన పోలీసులు దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబుతో పాటు నిర్మాత విజయలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. టాలీవుడ్‌లో ఈ తరహా మోసం బయటపడటం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

# ఫిల్మ్ నగర్‌లో నటుడి ఇంట్లోకి దూసుకొచ్చిన కారు

### మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు

హైదరాబాద్, జూలై 10: హైదరాబాద్ ఫిలింనగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి నేరుగా టాలీవుడ్ నటుడు ధర్మ నివాసంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి గేటు, ప్రహరీ గోడ ధ్వంసమయ్యాయి. అయితే ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు రోడ్డుపై నుంచి నేరుగా నటుడు ధర్మ ఇంటి ప్రాంగణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఘటన సమయంలో కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ధర్మ కుటుంబ సభ్యులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కారులో ఉన్న యువకులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.







# కొత్త కథనంతో వచ్చిన లెనిన్

### అఖిల్ నటనా తీరు అద్భుతం

టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ 'లెనిన్' సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయిపోయారు. అఖిల్ కెరీర్‌లో 'లెనిన్'కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శుక్రవారం 'లెనిన్'గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు. ఇది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉంటుంది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు 'లెనిన్'. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ. పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్య, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్య, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురళీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాథగా ఆ ఊరు వచ్చిన లెనిన్ 'నా' అనుకున్న వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ, ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ సబ్జెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తుల మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్లుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్థం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్థం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురళీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు. ఇక 'లెనిన్'గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, 'లెనిన్' ఒకెత్తు. అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని 'లెనిన్'లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్థంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్ఫార్మెన్స్‌గా 'లెనిన్'ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746

మనసులో మాట
KANCHARLA

# తెలంగాణ

| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

శనివారం 11 జులై 2026 పేజీలు 16




## తెలంగాణ సంస్కృతి వైభవం.. బోనాల జాతర

8

- ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతరను భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అత్యంత వైభవంగా నిర్వహించాలి
- లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు సేవలు అందించడంలో సంబంధిత విభాగాలన్నీ సహనంతో, సంయమనంతో వ్యవహరించాలి



# 117 సీట్లు మావే: సీఎం రేవంత్

- మధిర సభలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక రాజకీయ వ్యాఖ్యలు చేశారు.
- అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరుగుతాయని పేర్కొన్నారు.
- 2029లో జరిగే ఎన్నికల్లో 182లో 117కుపైగా సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.
- "భద్రాచలం రాముడిపై ఆన" అంటూ విజయంపై విశ్వాసం వ్యక్తం చేశారు.
- రైతులకు రెండున్నరేళ్లలో రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.
- వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నామని, ఉచిత విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వ పేటెంట్ అని అన్నారు.

**మధిర (మనసులో మాట) జూలై 10:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (Revanth Reddy) కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవన్నారు. అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని.. 2029 మేజూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలుస్తామని, ఇది భద్రాచలం రాముడిపై ఆన అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, భాజపాపై విమర్శలు చేశారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు సీఎంకు స్వాగతం పలికారు. "ఇక్కడి ప్రజలను చూస్తే నా గుండె పులకిస్తోంది.

..మిగతా 2లో




2

## సంపూర్ణ రుణమాఫీ హామీ ఏమైంది?: హరీశ్‌రావు

- ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు స్పందించారు.
- మాట తప్పడం, పార్టీలు మారడం సీఎం రేవంత్‌రెడ్డి సంస్కృతి అని విమర్శించారు.

## పెద్దపల్లిలో దారుణం.. భార్య చేతిలో భర్త హత్య!



6

## సీఎం ప్రజావాణిలో 247 దరఖాస్తులు




9

## బీటెక్ తొలి విడత అలాట్‌మెంట్ విడుదల

- తెలంగాణ ఎప్‌సెట్ (TG EAPCET) తొలి విడత బీటెక్ సీట్ల కేటాయింపు ఫలితాలు విడుదల.
- వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు సీట్లు కేటాయించిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి.



2



2

## పెద్దపల్లి కమాన్ విస్తరణ ఎప్పుడూ..?

- నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు.. అవస్థల్లో ప్రజలు
- కమాన్ జంక్షన్ విస్తరణ, బైపాస్ నిర్మాణం వేగవంతం చేయాలని డిమాండ్

# 117 సీట్లు మావే: సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయంగా నాకు పాలమూరు ప్రాణం. నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పని చేసింది. నేడు వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నాం. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్ని స్తున్నారు. నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారు. ఉచిత కరెంట్..కాంగ్రెస్ పేటెంట్ రైట్. మా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70లక్షల కోట్లు ఖర్చు చేశాం'' అని రేవంత్ అన్నారు.



**కల్వకుంట్ల కుటుంబాన్ని పాతాళానికి తొక్కేవరకు విశ్రమించం**

కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విశ్రమించరని రేవంత్‌రెడ్డి అన్నారు. ''గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని కొందరు చెప్పారు. వాళ్లని ఎలా ఎదుర్కోగలరని ప్రశ్నించారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తోందని ఆనాడే అన్నా. ఎన్నికల్లో మాకు 64 సీట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచాం. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లోనూ గుండు సున్నా తప్పదని చేవెళ్ల సభలో చెప్పా. అన్ని ఎన్నికల్లోనూ నేను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కి పరిమితం చేశాం. కౌరవ వంశాన్ని తెలంగాణ గడ్డ నుంచి తొలగిస్తాం. కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, సర్వేలను ఓడిస్తాం. మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం.

**భాజపాతో హరీశ్‌రావు మంతనాలు**

కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు. ఆ కుటుంబంలో ఒకరిని చూస్తే.. మరొకరికి నచ్చదు. మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. అక్కడ నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుంది. మీ రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా?హరీశ్‌రావు భాజపా నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారు. అలా చేయదలంలేదని భద్రాచలం రాముడిపై ఆయన ప్రమాణం చేస్తారా?'' అని రేవంత్ సవాల్ విసిరారు. మోదీ, అమిత్‌షా ఇతర పార్టీలను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. ''ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌లను వారు చీల్చారు. ఇతర పార్టీలను కూడా లొంగదీసుకుని లోక్‌సభ సీట్ల పెంపు బిల్లును ఎలా అయినా ఆమోదింపజేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ విషయంలో వారు విజయం సాధించడానికి అవకాశం ఉంది'' అని రేవంత్ అన్నారు.



## బీటెక్ తొలి విడత అలాట్‌మెంట్ విడుదల

తెలంగాణ (మనసులో మాట) జూలై 10:

తెలంగాణ ఎప్‌సెట్ (TG EAPCET) మొదటి విడత సీట్ల కేటాయింపు ఫలితాలు విడుదలయ్యాయి. తొలి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు బీటెక్ సీట్లను కేటాయించారు. ఏ కళాశాల, ఏ బ్రాంచీలో సీటు వచ్చిందో ఈ లింక్‌పై క్లిక్ చేసి విద్యార్థులు నేరుగా తెలుసుకోవచ్చు. అలాగే, క్యాండిడేట్ లాగిన్ ద్వారా అభ్యర్థులు తమ వివరాలను ఎంటర్ చేసి అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొత్తంగా 88,062 మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోగా.. కన్వీనర్ కోటాలో ఈడబ్ల్యూఎస్ కలుపుకొని 88,053 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 4న మాక్ సీట్ల కేటాయింపు తర్వాత వేలాది మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు మార్చుకోగా.. తాజాగా శుక్రవారం రాత్రి అధికారులు తొలి విడత సీట్ల కేటాయింపు జాబితాను అధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.



## పెద్దపల్లి కమాన్ విస్తరణ ఎప్పుడూ..?

హైదరాబాద్ (మనసులో మాట) జూలై 10:

పెద్దపల్లి పట్టణంలోని కమాన్ జంక్షన్ వద్ద రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. పట్టణంలోకి ప్రవేశించే, బయటకు వెళ్లే వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో ఈ జంక్షన్ నిత్యం రద్దీగా మారి, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి భారీ వాహనాల రాకపోకల కారణంగా కమాన్ జంక్షన్ వద్ద తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. రహదారి వెడల్పు సరిపోకపోవడంతో పెద్ద వాహనాలు మలుపులు తిరిగే సమయంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు, పాదచారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ రద్దీ కారణంగా అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు వంటి అత్యవసర సేవల వాహనాలు కూడా సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం సంభవించిన ఘటనలను గుర్తు చేస్తూ, తక్షణ చర్యలు తీసుకోకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా కమాన్ జంక్షన్‌ను విస్తరించాలని, పట్టణంలోని ప్రధాన రహదారులను వెడల్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పెద్దపల్లి బైపాస్ రహదారి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి, భారీ వాహనాలను పట్టణం వెలుపలే మళ్లించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## బిడ్డ దగ్గరికి వచ్చి, అనంతలోకాలకు తండ్రి



వెల్గటూర్ (మనసులోమాట) జూలై 10:

ఎండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన దాస రాజు అనే వ్యక్తి స్పాట్ లోనే మృతి చెందాడు. రాజు ఈ ప్రాంతంలోనే ఉన్న తన కూతురు దగ్గరకు వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనం పై ధర్మారం వైపు వెళ్తున్న రాజును ఎండపల్లి పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తల పగిలి రాజు స్పాట్ లోనే దారుణంగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని స్వాధీనం చేసుకొని రోడ్డు క్లియర్ చేశారు.

## సంపూర్ణ రుణమాఫీ హామీ ఏమైంది?: హరీశ్‌రావు

హైదరాబాద్ (మనసులో మాట) జూలై 10:

ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. మాట తప్పడం, పార్టీలు మారడం రేవంత్‌రెడ్డి సంస్కృతి అని.. తనది కాదని విమర్శించారు. తమ ఇద్దరి రాజకీయ చరిత్రే దీనికి నిదర్శనమన్నారు. ''రేవంత్‌రెడ్డిలా ఒట్టు వేసి ఓ మాట.. వేయకుండా ఓ మాట చెప్పను. భద్రాద్రి రాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానన్న హామీ ఏమైంది? రాష్ట్రం సంగతి పక్కన పెట్టండి.. కనీసం ఖమ్మం జిల్లాలోనైనా రుణమాఫీ చేశారా? ఎందుకంత ఆవేశం, అసహనంతో రగిలిపోతున్నారు రేవంత్‌రెడ్డి?కన్నెపల్లి నుంచి నీళ్లు లిఫ్ట్ చేయలేని చేతగానితనాన్ని అబద్ధాలతో కవర్ చేస్తున్నారు. బీఆర్ఎస్‌పై రాజకీయంగా పోరాడండి.. రైతులపై కక్ష తీర్చుకోవద్దు. అన్నదాతల శాపం నుంచి ఈ ప్రభుత్వం తప్పించుకోలేదు'' అని హరీశ్‌రావు అన్నారు.



# కోహెడలో రూ.47.03 కోట్ల ఎగుమతి ఆధారిత

**ఇబ్రహీంపట్నం (మనసులోమాట) జూలై 10:**





రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధు, రంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కోహెడలో చేపల ఎగుమతుల కేంద్రం ఏర్పాటు తెలంగాణ మత్స్యరంగ చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. సముద్రతీర ప్రాంతం కాకుండా అంతర్గత రాష్ట్రంలో ఆధునిక మంచినీటి చేపల ఎగుమతి కేంద్రం ఏర్పాటు కావడం విశేషమన్నారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మత్స్యకారుల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోహెడలో విలువైన భూమిని మత్స్యకారుల అభివృద్ధి కోసం కేటాయించడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ ప్రాంతానికి మరో రూ.50 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టును మంజూరు చేయాలని మంత్రిని కోరగా, దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రాజెక్టు సాధనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



## శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర 2026 విజయవంతానికి సమన్వయ సమావేశం

**హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:**

రానున్న శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర - 2026 ఏర్పాట్లను సమీక్షించేందుకు మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని సికింద్రాబాద్ విశ్వకర్మ ఫంక్షన్ హాల్‌లో ఒక ఉన్నత స్థాయి సమన్వయ (కన్వెర్జెన్స్ ) సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ ) కుమారి రక్షిత కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ ) చ. శ్రీధర్, మహంకాళి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. రవికుమార్‌లతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే ఈ సమావేశానికి ఉజ్జయిని మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు, పలహారం బండి, తోటెల నిర్వాహకులు, వెల్కమ్ స్టేజ్ నిర్వాహకులు మరియు ఇతర ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బోనాల జాతరను అత్యంత వైభవంగా, సురక్షితంగా మరియు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తీసుకోవాల్సిన ముఖ్యమైన ఏర్పాట్లు, ముందస్తు భద్రతా చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి అన్ని శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని డీసీపీ పేర్కొన్నారు. నిర్దేశిత పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు ఈ సందర్భంగా అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.

## చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి:

# జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

- **జూలై 18న ప్రత్యేక లోక్ అదాలత్.. రాజీ ద్వారా శాశ్వత పరిష్కారానికి అవకాశం**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**



చెక్ బౌన్స్ కేసుల్లో ఇరుపక్షాలు రాజీ మార్గాన్ని ఎంచుకుని వివాదాలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా రంగంపల్లిలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం 1,659 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 476 కేసుల్లో వారెంట్లు జారీ అయినట్లు వెల్లడించారు. వారెంట్లు జారీ అయిన వ్యక్తులు కూడా భయపడకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. జూలై 18న నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఇరువర్గాల పరస్పర అంగీకారంతో చెక్ బౌన్స్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఒకేసారి మొత్తం మొత్తాన్ని చెల్లించలేని వారికి విడతల వారీగా చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రుణగ్రహీతలు సంబంధిత బ్యాంకు అధికారులతో చర్చించి రాజీకి రావచ్చని, అవసరమైన సందర్భాల్లో రాయితీలు కూడా లభించే అవకాశం ఉందన్నారు. యూనియన్ బ్యాంక్ సహా పలు చిట్‌ఫండ్ సంస్థలకు సంబంధించిన చెక్ బౌన్స్ కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని న్యాయవాదులకు ప్రత్యేక విజ్ఞప్తి చేస్తూ, తమ క్లయింట్లకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి, రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు. ప్రజలు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కోర్టు ఖర్చులు, సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పిలుపునిచ్చారు.



## ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

- **19, 26వ వార్డుల్లో పర్యటన.. శానిటేషన్ పనుల పరిశీలన, అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**

పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఇంటి యజమాని బాధ్యతగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య పిలుపునిచ్చారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 19, 26వ వార్డులను సందర్శించిన ఆయన స్థానిక కౌన్సిలర్లతో కలిసి శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, గత నెల రోజులుగా అన్ని వార్డులను సందర్శిస్తూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కొంతమంది ఇంటి చెత్తను మురుగు కాలువల్లో వేయడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు తప్పనిసరిగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సహకారంతో ఇటీవల 19వ వార్డులో రూ.1.87 కోట్లతో, 26వ వార్డులో రూ.46 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు నల్లాల పద్మ, నల్లాల సురేష్, సుధమల్ల అమ్రిష్, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, సురేందర్, వార్డు అధికారులు సురేష్ నాయక్, సురేష్, జవాన్లు చిన్న, వేణులాల్, ఎలక్ట్రిషియన్ పులిపాక నరేష్, వాటర్ సప్లై సిబ్బంది మహేష్, మెప్మా ఆర్పీ హసీనా, ఆశా వర్కర్ తిరుమల, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం: ఎస్ఎఫ్ఐ ఆరోపణ

- విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి.. విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

**మంథని (మనసులోమాట) జూలై 10:**




రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపులో భాగంగా గురువారం మంథని కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. ఇప్పటికీ రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకే పరిమితం చేయాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి సంస్థలకు కాకుండా మహిళా సంఘాల ద్వారా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈఓలు, లెక్చరర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీవో నంబర్లు 7, 8, 9లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ విక్రయాలను నియంత్రించాలని, ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి తగిన నిధులు కేటాయించాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్‌కుమార్, నాయకులు తిరుపతి, రాకేష్, అవినాష్, సాయి, సుమన్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## తలసేమియా చిన్నారుల కోసం..



- 60 యూనిట్ల రక్తం సేకరించిన జైభారత్ సంస్థ

**ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 10:**

తలసేమియా బాధిత చిన్నారుల కోసం జైభారత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీనగర్ లోని విజయ విహారం ఖల్సా భవన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఖదిజ్జాని ఆత్మ సమర్పణ దీక్ష-2026, దీక్షా విరమణ దినం సందర్భంగా జైభారత్ పూర్వ జాతీయ అధ్యక్షుడు ఆజాద్ షేక్ 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయవిహారం రమణమూర్తి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు ప్రతి నెల రెండు సార్లు రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. తలసేమియాతో బాధపడుతున్న వారికి రక్తదానం జీవనాధారంగా నిలుస్తుందని పేర్కొంటూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని అన్నారు. జైభారత్ జాతీయ కార్యదర్శి రజని మాట్లాడుతూ ఒక్క యూనిట్ రక్తం ఒక తలసేమియా చిన్నారి ప్రాణాలను కాపాడగలదని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా జైభారత్ తలసేమియా చిన్నారుల కోసం నిరంతరంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ వస్తోందని తెలిపారు. ఖాదీ-2026 మహా ప్రవర్తక్ యోధ వంశీ కూడా రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించి, యువత ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైభారత్ రాష్ట్ర నాయకులు స్వాతి, దుర్గారెడ్డి, రాజు, లక్ష్మీ, ఉమా, లక్ష్మేశ్వర్, రాహెల్ ఖాన్, మల్లికా వల్లభ, బెనజీర్, సత్యనారాయణ గోల, తదితరులు పాల్గొన్నారు.

## హుజూరాబాద్ లో అరుదైన శస్త్ర చికిత్స.. 4 కిలోల కణితి తొలగింపు

**హుజూరాబాద్ (మనసులోమాట) జూలై 10:**



హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఓ మహిళ కడుపు నుంచి సుమారు 4 కిలోల బరువున్న భారీ కణితిని (ట్యూమర్) వైద్యులు శస్త్రచికిత్స ద్వారా సురక్షితంగా తొలగించి ప్రాణాలు కాపాడారు.

**దీర్ఘకాలిక నొప్పితో నరకయాతన..**

హన్మకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన రేణిగుంట్ల కొమరమ్మ అనే మహిళ గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. రోజురోజుకూ కడుపు ఉబ్బిపోతుండటం, నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి రావడంతో స్థానికంగా పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించింది. అయితే అక్కడ పరీక్షల నిమిత్తం, ఆపరేషన్ కోసం భారీగా ఖర్చవుతుందని చెప్పడంతో.. అంత ఆర్థిక స్తోమత లేక ఆమె తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం మెరుగైన చికిత్స నిమిత్తం ఆమె హుజూరాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ (ఏరియా) ఆసుపత్రిని ఆశ్రయించింది.

**రంగంలోకి దిగిన నిపుణుల బృందం..**

ఆసుపత్రికి వచ్చిన కొమరమ్మకు వైద్యులు స్కానింగ్ సహా పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఆమె కడుపులో ఒక భారీ కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అది ప్రాణాపాయంగా మారే అవకాశం ఉండటంతో తక్షణమే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలోని నిపుణులైన వైద్యుల బృందం శుక్రవారం ఉదయం ఈ క్లిష్టమైన సర్జరీని ప్రారంభించింది. గంటలపాటు శ్రమించిన వైద్య బృందం.. రోగి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా, అత్యంత జాగ్రత్తగా సుమారు 4 కిలోల బరువున్న భారీ కణితిని బయటకు తీశారు.

**రోగి పరిస్థితి నిలకడగా ఉంది...**

"శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం సదరు మహిళా రోగి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగా ఉంది. ఆమె వేగంగా కోలుకుంటున్నారు. త్వరలోనే ఆమెను డిశ్చార్జ్ చేస్తాం." అని ఆర్ఎం ఓ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

**వైద్య బృందానికి ప్రశంసల జల్లు..**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు ఖర్చయ్యే ఇలాంటి అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సను ఉచితంగా, విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందాన్ని డిసిహెచ్ కృష్ణప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీందర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను పేదలకు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రిలో మౌలిక వసతులు, అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, రాబోయే రోజుల్లో ఇక్కడ మరిన్ని క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. ఉచితంగా ఆపరేషన్ చేసి తమ కుటుంబంలో వెలుగులు నింపిన వైద్యులకు, ప్రభుత్వానికి బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు.

## హోటళ్లపై టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడులు

**హాలియా (మనసులోమాట) జూలై 10:**

హాలియాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లపై పౌరసరఫరాల టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తనిఖీల్లో వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పలు హోటళ్ల నుంచి మొత్తం 10 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు పౌరసరఫరాల డీటీసీఎస్ ముక్తార్ తెలిపారు. అనంతరం సంబంధిత ఐదుగురు హోటల్ యజమానులపై 6ఏ సెక్షన్ కింద కేసులు నమోదు** చేసి, స్వాధీనం చేసుకున్న సిలిండర్లను స్థానిక గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు వెల్లడించారు. రెస్టారెంట్లు, హోటళ్లలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను ఉపయోగించడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో దేవరకొండ డీటీసీఎస్ సయ్యద్ మూబీముల్లతో పాటు పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# '420' హామీలతో కాంగ్రెస్ దగా చేసింది

**గంగాధర (మనసులోమాట) జూలై 10:**

ఎన్నికల ముందు ఆచరణ సాధ్యం కాని 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు వాటిని అమలు చేయకుండా '420 పార్టీ'గా మారిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైందని, ఆ పార్టీని గద్దె దించే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. శుక్రవారం గంగాధర మండల కేంద్రంలో బీజేపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగ భృతి అమలు చేయడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. జిల్లాలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని ధ్వజమెత్తారు. 'బీఆర్ఎస్ కాంగ్రెస్ దొందూ దొందే' అని విమర్శించారు. మరోవైపు, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం,



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెస్తున్న జాతీయ రహదారులు, స్మార్ట్ సిటీ, ఈజీఎస్ నిధులతోనే కరీంనగర్ జిల్లా ముఖచిత్రం మారుతోందని కొనియాడారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రవేశపెట్టిన రాజకీయ తీర్మానాన్ని మాజీ ఎమ్మెల్యే బోడిగే శోభ, డిప్యూటీ మేయర్ సునీల్ రావు బలపరిచారు. కిసాన్ మోర్చా నేత సింగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రవేశపెట్టిన వ్యవసాయ తీర్మానాన్ని మేయర్ కోలగాని శ్రీనివాస్, బత్తుల లక్ష్మీనారాయణ బలపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అదుపుతప్పి బైక్ బోల్తా



**మునగాల/కోదాడ (మనసులోమాట) జూలై 10:**

సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన షేక్ అజ్మల్, సమీర్‌లు నడిగూడెంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై తిరిగి కోదాడకు వస్తుండగా మునగాల మండల పరిధిలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బైక్ ఒక్కసారిగా అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై బలంగా పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్యశాలకు తరలించినట్లు తెలిసింది. వైద్యులు ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరొకరికి కూడా తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. అధిక వేగంతో ప్రయాణించడం, బైక్‌పై నియంత్రణ కోల్పోవడమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు.

# సహకార సంఘాలు పారదర్శకంగా సేవలు అందించాలి

**రాజాపేట (మనసులోమాట) జూలై 10:**

రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) రైతులకు మరింత చేరువై పారదర్శకంగా సేవలు అందించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం రాజాపేటలో రేణికుంట పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన సేవలు అందించడం సహకార సంఘాల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాల సరఫరా, పంట రుణాల మంజూరు, ధాన్యం కొనుగోలు వంటి సేవలను సమర్థవంతంగా నిర్వహించి రైతులకు అండగా నిలవాలని



సూచించారు. నూతన పాలకవర్గం రైతుల విశ్వాసాన్ని నిలబెట్టుకుని సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, డైరెక్టర్లు గుజ్జుక బాలరాజు, జంగా లక్ష్మి, భూక్య మన్య, కోరే మల్లయ్య, రాపోలు నారాయణరెడ్డి, మసిరెడ్డి సురేందర్ రెడ్డి, కోటగిరి సంతోష్, జూకంటి వీరయ్య, గుడిసెల నరసింహులు, చెట్కూరి గౌరయ్య, చెక్కల బాలయ్య, చిగుళ్ల చంద్రపాల్, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజానాయకులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భోజన శాలలు ఇలా.. భోజనం చేసేది ఎలా..!

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌళిక వసతులు కల్పనకు ప్రభుత్వం అన్నివిధాలుగా కృషి చేస్తోంది. పాఠశాల విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు చేస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందించాలనే దృఢ సంకల్పంతో పాఠశాలలలో విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు సౌకర్యంగా ఉండేందుకు డైనింగ్ హాల్ లను మంజూరు చేసింది. మన ఊరుమన బడి పథకం ద్వారా పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల హై స్కూల్ తో పాటు మండలంలోని వెదురుగట్ట, గుమ్మూనూర్, రాగంపేట ప్రభుత్వ పాఠశాలలలో డైనింగ్ హాల్ లను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వాటి నిర్మాణాలు



లు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నిలిచిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. అధికారులు తగిన చర్యలు తీసుకొని వినియోగంలోకి తీసుకురాక అవి నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే విద్యార్థులకు ఎంతో సదుపాయమని భావించి లక్షల నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన అవి ఉపయోగానికి దూరంగా ఉన్నాయి.

**భోజన సమయంలో విద్యార్థుల తిప్పలు..**

డైనింగ్ హాల్ లు ఉపయోగపడక విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతుల బెడద నుంచి రక్షణ,ఎండకు ఉపశమనం, గాలి వీచినప్పుడు దుమ్ము, వర్షం కురిసినప్పుడు సమస్యలు లేకుండా పరిశుభ్రతతో క్రమపద్ధతిలో విద్యార్థులు ఒకే చోట భోజనం చేయడానికి డైనింగ్ హాల్ లు దోహదం చేస్తాయి. అయితే ఈ అసంపూర్తితో ఉన్న డైనింగ్ హాల్ లను వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**డైనింగ్ హాల్‌ను ప్రారంభించాలి: అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ అనుజ**

విద్యార్థులకు కావలసిన అన్ని వసతులు ఉంటాయని భావించి తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో పాఠశాలల్లో హాజరు శాతం పెరుగుతున్నాయి. విద్యార్థుల సౌకర్యం కోసం నిర్మించిన డైనింగ్ హాల్ ను ప్రారంభించడానికి అధికారులు కృషి చేయాలని కోరుతున్నాం.

**వర్షంతో విద్యార్థులకు ఇబ్బందులు: కడారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్, చొప్పదండి**

భోజన శాల పూర్తి కాకపోవడంతో అందులో భోజనం చేస్తున్న సమయంలో వర్షం వస్తే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హాల్ ను పూర్తి స్థాయిలో నిర్మాణం చేసి అవసరమైన సామగ్రి సమకూర్చుతే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థుల సౌకర్యం కోసం దాతల సహాయంతో ఫ్యాన్ లు ఏర్పాటు చేశాం.

**నీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది: జలీల్, ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్**

డైనింగ్ హాల్ పూర్తి స్థాయిలో నిర్మాణం అయింది. నీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ డైనింగ్ హాల్ ప్రాంతంలో ప్రహరీ గోడ లేనందున ఆ వైపు నుంచి మూత్ర విసర్జనకు లోనికి ప్రవేశించి అపరిశుభ్రత చేస్తున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావలని కోరుతూ ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశాం.

# హైదరాబాద్ ఆశాడ బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున తెహజీబ్‌కు ప్రతీక

- **పండుగల సందర్భాల్లో హిందూ, ముస్లిం సమాజాల పరస్పర సహకారం,**
- **వారు ప్రదర్శించే లౌకిక స్ఫూర్తి యావత్ దేశానికి గొప్ప సందేశాన్ని ఇస్తున్నది**
- **జూలై 16 నుంచి ప్రారంభమయ్యే ఆషాడ బోనాల ఉత్సవాల్లో తొలి బోనం గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనయితీ**
- **భక్తులు సంతోషంగా అమ్మవారిని దర్శించుకుని, నిండు మనసుతో ప్రభుత్వాన్ని దీవించి,**
- **సంతృప్తిగా ఇళ్లకు తిరిగి వెళ్లేలా అన్ని ప్రభుత్వ శాఖలు కలసికట్టుగా పని చేయాలి**
- **దైవానికే అంకితమైన శివసత్తులకు బోనాల సమర్పణలో అన్ని శాఖలు సహకరించాలి**
- **గోల్కొండ కోటలో జరిగిన జగదాంబికా మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో అధికారులకు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం**
- **అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఆషాడ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్ ను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:**

హైదరాబాద్ లో ప్రతి ఏటా నిర్వహించే ఆశాడ బోనాల ఉత్సవాలు ఇక్కడి గంగా జమున తెహజీబ్ ప్రత్యేకతను చాటుతాయని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల్లో బోనాల ఉత్సవాల నిర్వహణ, ముస్లిం పండుగల సందర్భాల్లో హిందూ, ముస్లిం సమాజాల పరస్పర సహకారం, వారు ప్రదర్శించే లౌకిక స్ఫూర్తి యావత్ దేశానికి గొప్ప సందేశాన్ని ఇస్తున్నదని మంత్రి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని గోల్కొండ కోటలోని జగదాంబికా అమ్మవారి దేవస్థానంలో మంత్రి ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బోనాల ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్ల పై సంబంధిత అధికారులకు మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, జిహెచ్ఎంసి, ఐ అండ్ పి ఆర్ తదితర శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గోల్కొండ జగదాంబికా అమ్మవారి చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, జూలై 16 నుంచి ప్రారంభమయ్యే ఆషాడ బోనాల ఉత్సవాల్లో తొలి బోనం గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనయితీగా వస్తున్నదని అన్నారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే గోల్కొండ బోనాల ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సంపూర్ణ సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జూలై 16న లంగర్ హౌస్ కూడలి నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి బోనం సమర్పణ, తొట్టెలు రథం ఊరేగింపు, మెట్ల పూజకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గోల్కొండ



జగదాంబిక మహంకాళి అమ్మవారికి జూలై 16, 19, 23, 26, 30, ఆగష్టు 2,6,9,13 తేదీల్లో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్, క్యూ లైన్లు, బారికేడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక, ప్రత్యేక బస్సులు తదితర ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. దేవాలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశించారు.

### భక్తులకు ఏ చిన్న అసౌకర్యం కలగకుండా ..

గోల్కొండ కోట పరిధిలోని రహదారులు, మెట్లు, విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్లు, సూచిక బోర్డులు, షెడ్లు తదితర సౌకర్యాలు ముందుగానే సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. అలాగే భక్తుల దర్శనం సాఫీగా సాగేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాలు కొనసాగినన్ని రోజులు పోలీస్ శాఖ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. భక్తుల భద్రత, సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అనుమానితుల ఫొటోలతోకూడిన వాల్ పోస్టర్లను ప్రదర్శిస్తూ భక్తులను అప్రమత్తం చేయాలని సూచించారు. జిహెచ్ఎంసి కాలపరిమితిని నిర్దేశించుకుని పనులు సకాలంలో పూర్తి చేయాలని మంత్రి నిర్దేశించారు. విద్యుత్ శాఖ కరెంటు వైరింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి హెచ్చరించారు. పరిశుభ్రత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. చిన్న పిల్లలు, వృద్ధులు గర్భిణీలు బాలింతల విషయంలో అన్ని శాఖలు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. దైవానికే అంకితమైన శివసత్తులకు బోనాల సమర్పణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సహకరించాలని మంత్రి సురేఖ ఆదేశించారు. భక్తులు సంతోషంగా అమ్మవారిని దర్శించుకుని, నిండు మనసుతో ప్రభుత్వాన్ని దీవించి, సంతృప్తిగా ఇళ్లకు తిరిగి వెళ్లేలా అన్ని ప్రభుత్వ శాఖలు కలసికట్టుగా పని చేయాలని మంత్రి ఆదేశించారు. గోల్కొండ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని పేర్కొన్న మంత్రి రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు అన్ని విధాలా కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఆషాడ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్ ను మంత్రి ఆవిష్కరించారు. గోల్కొండ జగదాంబికా అమ్మవారి దేవస్థానానికి వచ్చిన మంత్రి కొండా సురేఖకి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అక్కడ నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. జగదాంబికా అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సమృద్ధిగా వర్షాలతో, పాడిపంటలతో పచ్చగా వుండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి అమ్మవారిని ప్రార్థించారు.

## పెద్దపల్లిలో దారుణం.. భార్య చేతిలో భర్త హత్య!



**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కదంబపూర్ (కాశిపల్లి) గ్రామంలో కుటుంబ కలహాలు విషాదాంతానికి దారితీశాయి. భర్త వేధింపులను తట్టుకోలేక భార్య అతనిపై దాడి చేయడంతో మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కదంబపూర్ (కాశిపల్లి) గ్రామానికి చెందిన సయ్యద్ గోరేమియాకు ఆయన భార్య గోరేబీతో గత ఏడాది కాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గోరేమియా కొంతకాలంగా జగిత్యాలలో నివసిస్తూ, రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చినట్లు సమాచారం. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన గోరేమియా మరోసారి భార్యతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వేధింపులను తట్టుకోలేక గోరేబీ మట్టి పెల్లలతో భర్త తలపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాల కారణంగా గోరేమియా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి గోరేబీతో పాటు ఆమె కుమారుడు సయ్యద్ అలీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణలో కుటుంబ వేధింపుల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- **33, 19వ వార్డుల్లో ప్రత్యేక తనిఖీ.. మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటుకు ఆదేశాలు**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:**



జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని పెద్ద మసీదు సమీపంలోని 33వ వార్డు భారత్‌నగర్, 19వ వార్డు బండారికుంట ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రత్యేక నమోదు ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను సేకరిస్తున్న సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడంతో పాటు అవసరమైన సహాయం అందించేందుకు మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. ప్రక్రియను వేగవంతం చేసేందుకు మున్సిపల్ సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సమైక్య సంఘాల సభ్యుల సహకారంతో ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కారించండి



- ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ చిన్నారెడ్డికి డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల వినతి పత్రం
- సమస్యల పరిష్కారానికి హామీ

హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:

ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి విద్యాసాగర్‌ను కలిసి కళాశాలలు ప్రారంభమై నెలరోజులు గడిచినా గెస్ట్ లెక్చరర్ల రెన్యువల్ ప్రక్రియ, కొత్త నోటిఫికేషన్ విడుదలలో జాప్యం కారణంగా విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర ఈశ్వర్ లాల్‌తో పాటు నరేందర్, శ్రీనివాసులు కలిసి వివరించారు. గత పదేళ్లుగా గెస్ట్ లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతినిధులు వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డాక్టర్ చిన్నారెడ్డి ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేనతో ఫోన్‌లో మాట్లాడి గెస్ట్ లెక్చరర్ల న్యాయమైన డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ స్పందిస్తూ, ఉన్నత విద్యాశాఖ కమిషనర్, కార్యదర్శి నుంచి తగు సూచనలతో కూడిన ప్రతిపాదనలు అందితే వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు సంఘం ప్రతినిధులు వెల్లడించారు. గెస్ట్ లెక్చరర్ల ప్రధాన డిమాండ్లలో ప్రతి సంవత్సరం కొత్త నోటిఫికేషన్, త్రీమెన్ కమిటీ ద్వారా డెమో నిర్వహించే విధానాన్ని రద్దు చేసి గత విద్యా సంవత్సరంలో పనిచేసిన వారినే రెన్యువల్ చేయడం, పీరియడ్‌లు, యూనివర్సిటీ అల్మానక్‌కు అనుసంధానమైన వేతన విధానాన్ని రద్దు చేసి అకాడమిక్ ఇయర్ మొత్తం ప్రతి నెల రూ.50 వేల కన్సాలిడేటెడ్ గౌరవ వేతనం చెల్లించడం ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర ఈశ్వర్ లాల్‌తో పాటు నరేందర్, శ్రీనివాసులు, తారా వెంకటేష్, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, రాజు, నరసయ్య, కురుమూర్తి, నాగలక్ష్మి, సుధాకర్, ప్రదీప్, కృష్ణయ్య, వెంకట్, దశరథం, మంగళ్ దాస్, శంకరయ్య, రాహుల్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

- ఆర్టీసీ, రవాణా అధికారులకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి

హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:



జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ, శుక్రవారం జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ, రవాణా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు, డిపో మేనేజర్లకు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. హుస్నాబాద్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు, హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ అదనపు కార్యదర్శి సునీతాదేవి లకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం వారు ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని బస్ భవన్ లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ వై.నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారని, తెలంగాణ లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం పరిమిత సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ పేరుకే 1/3 కానీ జర్నలిస్టుల నుంచి 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. వార్తల సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు ప్రయాణ చార్జీలు భారమవుతుందని,దీనిని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా (తెలంగాణ ఎర్త్ వైడ్) ఉచిత ప్రయాణం, ఇతర రాష్ట్రాలకు 1/3 రాయితీ సదుపాయం కల్పించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామారావు, పద్మనాభరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్, నాయకులు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్ల నాటి కాలువ సమస్యకు పరిష్కారం..

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. వార్డు సందర్శనలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి

రామగుండం (మనసులోమాట) జూలై 10:



ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న దీర్ఘకాలిక సమస్యలను వార్డు సందర్శనల ద్వారా గుర్తించి పరిష్కరిస్తున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 23వ డివిజన్ ప్రగతి నగర్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రగతి నగర్ కాలువ నుంచి వచ్చే నీరు ఎన్‌టీపీసీ ప్రహరీ గోడ సమీపంలో అనేక సంవత్సరాలుగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక కార్పొరేటర్ బెంద్రం సునీత-రాజిరెడ్డి మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన మేయర్ ఆదేశాల మేరకు జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో కాలువలో పెరిగిన చెట్ల గుబుర్లు, చెత్తను తొలగించి కాలువను పూర్తిగా శుభ్రం చేశారు. అనంతరం ఎన్‌టీపీసీ పీటీఎస్ పరిధిలోని డ్రెయిన్‌తో కాలువను అనుసంధానం చేయడంతో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన నీరు సాఫీగా ప్రవహించడం ప్రారంభమైంది. మేయర్, కమిషనర్ స్వయంగా పీటీఎస్ పరిధిలోకి వెళ్లి అక్కడి డ్రెయిన్‌ను కూడా పరిశీలించి, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో ప్రగతి నగర్ నుంచి వచ్చే కాలువకు ఎలాంటి ఆటంకం లేకుండా నీటి ప్రవాహం పునరుద్ధరించబడింది. ఈ పరిణామంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఎన్‌టీపీసీ అధికారులు ఏర్పాటు చేసిన గ్రిల్స్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో కాలువ మూసుకుపోయి వర్షాకాలంలో ప్రగతి నగర్ ఇళ్లలోకి నీరు చేరే పరిస్థితి ఏర్పడేదని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా కాలువ వద్ద అవసరమైన పైపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెల్లడించారని చెప్పారు. ప్రస్తుతం నగర పాలక సంస్థ చేపట్టిన పూడిక తొలగింపు కార్యక్రమాలతో వర్షాకాల ముంపు ప్రమాదం గణనీయంగా తగ్గిందని మేయర్ పేర్కొన్నారు. నగర ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్ సీసాలు, చెత్తను కాలువల్లో వేయకుండా మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కాలువల నిర్వహణలో ఎన్‌టీపీసీ అధికారులు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, టీపీఎస్ నవీన్, జూనియర్ అసిస్టెంట్ చంద్రారెడ్డి, శానిటరీ జవాన్ సంపత్, ఎకో వారియర్స్ కన్సల్టెన్సీ బృంద సభ్యులు స్వరూప్, మహేంద్ర, వాటర్ సప్లై సూపర్‌వైజర్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమ్మ బోనాల పండుగకు ముందు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

పెద్దపల్లి (మనసులోమాట) జూలై 10:

పెద్దమ్మ బోనాల పండుగను పురస్కరించుకుని పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో ఉన్న పెద్దమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో దేవాలయం పరిసరాల్లో విస్తృతంగా శుభ్రత పనులు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 1వ వార్డు కౌన్సిలర్ పురేళ్ల శైలజ-సుధాకర్ పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు పెరిగిన పొదలను తొలగించి భక్తుల రాకపోకలకు అనువుగా మార్గాలను శుభ్రపరిచారు. బోనాల పండుగ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. ఈ చర్యలను స్థానిక ప్రజలు, భక్తులు అభినందిస్తూ, పండుగకు ముందే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టిన మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మనసులోమాట

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

**హుజూర్ నగర్ టౌన్ (మనసులోమాట) జూలై 10:**

రాష్ట్ర చరిత్రలో ఒకే చోట 2,160 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదలకు అందిస్తున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో రూ.125 కోట్లతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల మోడల్ కాలనీలో రూ.20 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, అంగన్‌వాడి భవనం, కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, డ్రైన్స్ , వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ లకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. హుజూర్ నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని, రాష్ట్ర విభజన తర్వాత గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసినదని, తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల, కృషి, ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం అని, దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, రూ.75 కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించినట్లు వెల్లడించారు. ఇందులో 10 కోట్లతో 32 వేల స్క్వేర్ ఫీట్ సైజ్ లో తెలంగాణ మోడల్ పబ్లిక్ బోర్డింగ్ స్కూల్ నిర్మాణం చేపట్టమన్నారు. ఇందులో 2,500 మంది హౌసింగ్ కాలనీ, హుజూర్ నగర్ లోకల్ పేద విద్యార్థులు చదువుకోడానికి వీలుంటుందని పూర్తిగా ఇంగ్లీష్ మీడియం లోనే విద్యాభ్యాసం ఉంటుందని మంత్రి అన్నారు. కాలనీలో గ్రీనరీ పెంచాలని అలాగే జిల్లాలోని హౌసింగ్ సిబ్బందితో ప్రతి ప్లాటు క్షుణ్ణంగా చెక్ చేసి, అన్ని పనులు పూర్తి అయినవో, ఇంకా ఏమైనా పెండింగ్లో ఉన్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ కు సూచించారు. ఒకే ఇంట్లో 18 సంవత్సరాలు నిండిన ఇద్దరు పిల్లలు ఉంటే వారికి అదనంగా ఇంకో ప్లాటు మంజూరు చేయాలని, బాత్రూం, టాయిలెట్స్ చిన్నవిగా ఉన్నందువలన ఎవరైనా అతిథులు వస్తే ఇబ్బందికరంగా ఉంటుంది. కావున కాలనీలో బయట వైపు అదనంగా టాయిలెట్స్, బాత్రూమ్స్ మున్సిపాలిటీ వారితో నిర్మించి, వారికే మెయింటినెన్స్ అప్పగించాలని, ప్రతి హౌసింగ్ బ్లాక్ కి మూడు రంగులు స్పష్టంగా కనబడే విధంగా మరొక కోటింగ్ వేయించాలని, ఇందిరమ్మ హౌసింగ్ కాలనీలోకి ప్రవేశించటానికి ప్రస్తుతం ఒకే రోడ్డు ఉన్నదని అదనముగా మరొక రోడ్డును కూడ వేయించడం జరుగుతుందని తెలిపారు. మోడల్ హౌసింగ్ కాలనీ అంటే మోడల్ గా క్వాలిటీ బ్రహ్మాండంగా ఉండాలని, అర్హులకు మాత్రమే ఇండ్లు మంజూరు చేయాలని, అర్హత లేని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండ్లు మంజూరు చేయకూడదని ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించిన తర్వాత జనాభాను బట్టి వార్డులుగా విభజించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా, హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత, డీఎస్ఓ మోహన్ బాబు, హార్టికల్చర్ అధికారి నాగయ్య, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతి వైభవం.. బోనాల జాతర

- **పిల్లలు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**
- **బోనాలు సమర్పించేందుకు తరలివచ్చే శివసత్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి**
- **విఐపి, వివిఐపిలకు దర్శనం కల్పించడంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన కార్యాచరణను అమలు చేయండి**
- **సీఎం రేవంత్ రెడ్డి ఈ యేడాది బోనాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయించడం హర్షణీయం**
- **సీఎం సూచనలకు అనుగుణంగా ఈ యేడాది బోనాల ఉత్సవాలను దేదీప్యమానంగా నిర్వహించాలి**
- **సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల సన్నాహక సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీచేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్ (మనసులోమాట) జూలై 10:**

తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటిచెప్పే బోనాల జాతర రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్తున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిన సికింద్రాబాద్ ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతరను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత ఘనంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ రోజు సికింద్రాబాద్ లోని ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ బోనాల జాతర ఏర్పాట్లపై దేవాదాయశాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సురేఖ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ఇతర శాఖల అధికారులు జాతర ఏర్పాట్లపై మంత్రి సురేఖకి వివరించగా, మంత్రి వారికి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, డిసిపి (సికింద్రాబాద్ జోన్) రక్షితా కృష్ణ మూర్తి, అడిషనల్ డిసిపి (ట్రాఫిక్) రాములు, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, దేవాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణారావు, డిసి వినోద్ రెడ్డి, ఎసిలు మనోహర్ రెడ్డి, శ్రీనివాస్, జిహెచ్ఎంసి, ఐ అండ్ పిఆర్, వైద్యారోగ్యశాఖ, ఆర్ అండ్ బి, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖ, టిజిఆర్టిసి తదితర శాఖలకు చెందిన అధికారులు, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ కోట నీలిమ, దేవాలయ కమిటి సభ్యులు, దక్కన్ మానవ సేవా సమితి, నల్లగుట్ట అభివృద్ధి సంఘం, మన్నూరు కాపు సంఘం, ఆర్యవైశ్య సేవా సమితిలకు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన బోనాల జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. బోనాల జాతర సందర్భంగా జూలై 19న ఘటం ఎదుర్కోలు, ఆగస్టు 2న బోనాల ఉత్సవాలు, ఆగస్టు 3న రంగం (భవిష్యవాణి), గజారోహణ మహోత్సవం కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించాలని మంత్రి సురేఖ ఆదేశించారు. ఈ నెల



19 న ఘటోత్సవముల ప్రారంభం నుంచి ఆగష్టు 3న రంగం కార్యక్రమం వరకు అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరాంగ తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖకు సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, దివ్యాంగులకు, పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక క్యూ లైన్లు, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. బోనాల ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు, బోనాలు సమర్పించేందుకు వచ్చే శివసత్తులకు ప్రత్యేక క్యూలైన్, సులభ దర్శనం, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. గత బోనాల ఉత్సవాల్లో వారి నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. “ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది” అని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, పూలతో సుందరంగా తీర్చిదిద్దాలని, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాలు, పటిష్ట పోలీసు బందోబస్తు వంటి అన్ని సౌకర్యాలను సమకూర్చాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. లక్షలాదిగా భక్తులు తరలివచ్చే పరిస్థితుల్లో, బోనాల సమర్పించేందుకు భక్తులు తీసుకువచ్చే దీపాల కారణంగా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అన్ని దేవాలయాల వద్ద తగిన అగ్నిమాపక పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదే విధంగా దేవాదాయ శాఖ భక్తులకు లడ్డూలు, వడలు, పులిహోర ప్రసాదాలను నిరంతరాయంగా అందుబాటులో ఉంచాలని, సమాచార, ప్రసార సబంధాల శాఖ జాతర ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా భక్తులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నిరంతరాయంగా లైవ్ ప్రసారాలు చేపట్టాలని, దేవాలయ పరిసరాల్లో స్క్రీన్ లు ఏర్పాట్లు చేసి ప్రత్యక్ష ప్రసారాలు చేయాలని సూచించారు. దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంత రావు మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు అన్ని శాఖలు కలసికట్టుగా పనిచేసి జాతరను దిగ్విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పోలీసుశాఖతో పాటు ఇతర శాఖలు బోనాల ఉత్సవ బాధ్యతను విధులుగా పరిగణించకుండా అమ్మవారికి సేవగా భావించి నిర్వర్తించాలని డిసిపి రక్షితా కృష్ణ మూర్తి పిలుపునిచ్చారు. సాంస్కృతిక శాఖ చేపట్టనున్న సాంస్కృతిక కార్యక్రమాలను ఆ శాఖ డైరక్టర్ వివరించారు. ఈ సందర్భంగా దక్కన్ మానవ సేవా సమితి, ఆర్యవైశ్య సంఘం తదితర సంస్థల ప్రతినిధులు చేసిన సూచనలను కార్యరూపంలోకి తీసుకురావలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. సన్నాహక సమావేశం కోసం దేవాలయానికి చేరుకున్న మంత్రి సురేఖకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి సురేఖ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సన్నాహక సమావేశం తర్వాత మంత్రి అధికారులతో కలిసి ఉజ్జయిని మహంకాళి బోనాల పోస్టర్ ను ఆవిష్కరించారు.

# క్రీడలు మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరం

# ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



**సికింద్రాబాద్ (మనసులో మాట) జూలై 10:**
క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. విజయపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పికిల్ బాల్ కోర్టును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. నేటి వేగవంతమైన జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. ముఖ్యంగా యువత మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకే పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు, ప్రోత్సాహం కల్పించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. నగరంలో ఆధునిక క్రీడా వసతులు పెరగడం ఆనందదాయకమని, పికిల్ బాల్ వంటి కొత్త క్రీడలపై యువత ఆసక్తి చూపించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి క్రీడా కేంద్రాలు మరింత మందిని ఆరోగ్యవంతమైన జీవనశైలి వైపు ప్రోత్సహిస్తాయని చెప్పారు. క్రీడలను వినోదంగా మాత్రమే కాకుండా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ అలవాటుచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పికిల్ బాల్ కోర్టు యజమాని షెహజాన్ ముహమ్మద్, అఫ్సర్ రియాజ్, రాజా, జునీద్, శాంసన్, మూర్తి, కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు

## శ్రీకారం.. అక్టోబర్ 1న తుది జాబితా విడుదల

- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే.. జూలై 31న ముసాయిదా జాబితా..
- ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ ఫారమ్ సమర్పణకు అవకాశం.




**హైదరాబాద్, జూలై 10(మనసులో మాట ):**
భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ సర్ ) కార్యక్రమాన్ని ప్రారంభించింది. జూన్ 25 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగియనుంది. తరచూ వలసలు, ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదు కావడం, మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం వంటి లోపాలను సరిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీ ఎల్ వో లు) ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించి ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేసి తిరిగి సేకరిస్తారు. ఓటర్లు తమ వివరాలను పరిశీలించి ఫారమ్‌ను పూర్తి చేసి బ్లాక్ కు అందజేయాలి. ఇంట్లో ఎవరూ లేకపోతే కుటుంబంలోని వయోజన సభ్యుడు కూడా ఫారమ్‌ను నింపి సమర్పించవచ్చు. ఎన్యుమరేషన్ ఫారమ్‌ను voters.eci.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో కూడా సమర్పించే అవకాశం కల్పించారు. నమోదిత మొబైల్ నంబర్ లేదా EPIC నంబర్‌తో లాగిన్ అయి OTP ధృవీకరణ అనంతరం ఫారమ్‌ను అప్లోడ్ చేయవచ్చు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల కానుండగా, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, సవరణలు స్వీకరిస్తారు. చిరునామా మార్పులు ఫారం 8 ద్వారా, కొత్తగా 18 ఏళ్లు నిండిన వారు ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు. అన్ని అభ్యంతరాల పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుంది. ఎన్యుమరేషన్ ఫారమ్‌ను సమర్పించని ఓటర్ల విషయంలో గైర్హాజరు, మరణం, చిరునామా మార్పు లేదా బహుళ నమోదులపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అవసరమైన సమాచారం కోసం 1950 హెల్ప్‌లైన్, సంబంధిత BLO లేదా అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

# సీఎం ప్రజావాణిలో 247 దరఖాస్తులు




- దరఖాస్తులు స్వీకరించిన ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్
- సీఎం ప్రజావాణిని సందర్శించిన క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్

**హైదరాబాద్ (మనసులో మాట )జులై 10:**
మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 237వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 247 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 120, రెవెన్యూ శాఖకు సంబంధించి 45, హోం శాఖకు 17 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 65 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.సీఎం ప్రజావాణిని సందర్శించిన క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ సందర్శించారు. సీఎం ప్రజావాణి, ప్రవాసి సీఎం ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. కాగా డిగ్రీ కాలేజీ గెస్ట్ లెక్చరర్స్ తమకు ఫిక్స్డ్ గౌరవ వేతనం ఇప్పించాలని, ఎడాదికి పది నెలలు పని దినాలు కల్పించాలని కోరారు.స్పోర్ట్స్ కోటా కింద స్టాఫ్ నర్స్ పోస్టులు భర్తీ చేయాలని అభ్యర్థులు కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం చిన్నారెడ్డి, విద్యా సాగర్ కృషి చేశారు.ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై సమన్వయ వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సమన్వయకర్త బొజ్జ అమరేందర్ రెడ్డి, ప్రతినిధి పద్మారాణి కర్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆశలు పదింతలు!



**ఖమ్మం (మనసులో మాట) జూలై 10:**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో హామీలపై ప్రజల ఆసక్తి వ్యవసాయ, పారిశ్రామిక ఆధారిత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటు సాగునీరు, ఇటు ఖనిజ వనరులకు కొదవలేదు.. భూగర్భ గనులు, అటవీ ఉత్పత్తులు, ప్రకృతి అందాలు పుష్కలంగా ఉన్నా వాటిని పూర్తి స్థాయిలో ఉపాధి వనరులుగా మార్చే ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో సాగడం లేదు. కొన్ని దీర్ఘకాలిక సమస్యలూ అపరిష్కృతంగానే ఉంటున్నాయి. రైతులకు భరోసా ఇవ్వడానికి శుక్రవారం జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్య, ఉపాధి పరంగా వరాల జల్లు కురిపిస్తారని, సాగుకు దన్నుగా నిలిచి.. యువతకు ఊతమిచ్చేలా పథకాలు ప్రకటిస్తారని ఉభయ జిల్లాల ప్రజలు ఆశిస్తున్నారు.

# ప్రహరీ గోడపైకి దూసుకెళ్లిన కారు.. ముగ్గురికి తీవ్రగాయాలు



**శంకరపట్నం (మనసులో మాట) జూలై 10:**

ఓ కారు అదుపుతప్పి ప్రహరీ గోడపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డి పేట నుంచి వీణవంక మండలం గన్ముకుల గ్రామానికి ఓ కుటుంబం కారులో బయలుదేరింది. శంకరపట్నం మండలం మెట్ పల్లి గ్రామ పంచాయతీ పరిధి వెంకటేశ్వర్ల పల్లి గ్రామానికి చేరుకోగానే.. వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ఓ ఇంటి ప్రహరీ గోడపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో రమణారెడ్డితో పాటు రమ్య, చిన్నారి అన్విక్ తీవ్రంగా, మరో మహిళ అర్చనకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స కోసం హుజూరాబాద్ లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదంలో కారు ధ్వంసమైంది. ప్రమాద సమయంలో రోడ్డుపై వాహనాలు, బాటసారులు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

# పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**భువనగిరి (మనసులో మాట) జూలై 10:**

నియోజకవర్గంలోని వలిగొండ మండలం సంగెం, ధర్మారెడ్డిపల్లి, గోకారం గ్రామాల పరిధిలో రూ.124 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ధర్మారెడ్డి కాల్వ పునరుద్ధరణ, పనుల నాణ్యత, కాల్వ వెడల్పు, లోతు, నీటి ప్రవాహానికి చేపట్టిన ఏర్పాట్లు, కాల్వను ఆనుకుని నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ధర్మారెడ్డి కాల్వ శిథిలావస్థకు చేరిందన్నారు. కాల్వలో మట్టి, రాళ్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో నీటి ప్రవాహం పూర్తి నిలిచిపోయిందని చెప్పారు. కాల్వ పక్కన ఉన్న రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ రూ.124 కోట్ల నిధులతో కాల్వను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాల్వలో అడ్డంకులను తొలగించి, చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పనులు చేపట్టామన్నారు.

# ఆగ్రహించిన అన్నదాత.. కొనుగోలు కేంద్రంలో వరి కుప్పలకు నిప్పు

**కామారెడ్డి (మనసులో మాట) జూలై 10:**



"మా గోడు వినేవారు లేరు.. అధికారులు స్పందించడం లేదు.." అంటూ కామారెడ్డి జిల్లా రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 40 రోజులుగా ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యానికి విసిగిపోయిన అన్నదాతలు.. ఏకంగా వరి కుప్పలకే నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. 40 రోజులుగా ఎదురుచూసినా పట్టించుకోని అధికారులు: రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామంలోని ఐకేపీ (IKP) వరి కొనుగోలు కేంద్రంలో ఈ ఉద్రిక్త చోటుచేసుకుంది. రైతులు తమ ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి దాదాపు 40 రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు జరగలేదు. ఎండ తీవ్రతతో పాటు అకాలవర్షాలకు.. ధాన్యం పాడైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు కష్టాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అంతేకాకుండా అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహానికి లోనైన రైతులు.. కొనుగోలు కేంద్రంలోనే ఉన్న వరి ధాన్యం కుప్పలకు నిప్పంటించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు:**

వరి కుప్పల దహనం వార్త తెలియగానే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా సరఫరా అధికారి (DSO) వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ (DRDO) సురేందర్, డీపీఎం సాయిలు, డీఎం శ్రీకాంత్ తదితర ఉన్నతాధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో అత్యవసర చర్చలు జరిపారు. హమాలీల కొరత, లారీల లభ్యత లేకపోవడం వల్లే ధాన్యం తరలింపులో కొంత ఆలస్యం జరిగిందని అధికారులు రైతులకు వివరించారు.

**హామీతో శాంతించిన రైతులు:**

హమాలీల సమస్యలను తక్షణమే అధిగమించి.. త్వరలోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు. అయితే ధాన్యం కుప్పలకు నిప్పంటించడంపై డీఎస్ఓ వెంకటేశ్వర్లు రైతుల తీరు పట్ల కొంత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

# చిరుప్రాయం.. మోయలేని భారం



**నిర్మల్ అర్బన్ (మనసులో మాట) జూలై 10:**

పుస్తక సంచుల మోత విద్యార్థుల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతోంది. అవసరమైన పుస్తకాలకు మించి అంటగడుతుండడంతో పిల్లల తల్లిదండ్రులు, పోషకులకు ఆర్థిక భారం కావడంతోపాటు చిన్నారులు మోయలేక వెన్నెముక సమస్యలకు దారితీసేలా పరిస్థితులు నెలకొన్నాయి. సంచుల బరువు ఎంత ఉండాలనే నిబంధనలు ఉన్నా కొన్ని విద్యాలయాలు పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఈఆర్టీ ద్వారా ఆయా తరగతులకు పాఠ్యపుస్తకాలు ఎంత బరువు ఉండాలనే విషయంపై సూచనలివ్వడంతోపాటు రాష్ట్రంలోనూ ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ వెల్లడించిన విద్యా సంవత్సరం కాలసూచీలో నెలలో మూడో శనివారం రోజున (నో బ్యాగ్ డే) విద్యార్థులు సంచి లేకుండా పాఠశాలకు రావాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దానిని పలు విద్యాలయాలు అమల్లోకి తీసుకురాని పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాలయాలు అనేకంగా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగిస్తున్నవీ ఉన్నాయి. అనధికారికంగా విక్రయ కేంద్రాలను నెలకొల్పడం, తమకు అనుకూలమైన దుకాణదారులతో ఒప్పందాలు చేసుకొని పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు, సాక్సులు, టై అమ్మకాలు చేస్తున్నారు. ఐఐటీ, నీట్, తదితర పోటీ పరీక్షలకు తమ పాఠశాల ప్రత్యేకం.. ఈ పుస్తకాలు తప్పనిసరి అని చెబుతూ అధిక ధరలు కలిగిన, అవసరం లేని పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్నారు. తీరా వాటిని బ్యాగుల్లో సర్దుకొని రోజు పాఠశాలకు తీసుకెళ్లడం, తిరిగి ఇళ్లకు తీసుకొస్తుండటంతో పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

**తల్లిదండ్రుల పాత్ర కీలకం**

తల్లిదండ్రులు, పోషకులు పిల్లల సంచుల బరువుల విషయంలో, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు పరిశీలించడం అత్యంత కీలకం. అనవసర వస్తువులు బరువును పెంచే అవకాశం ఉంది. భోజన డబ్బా, నీళ్ల సీసాను వేరే సంచిలో ఉంచడం వంటివి చేయాలి. పాఠశాలలు సమయసారిణి రూపొందించి ఏ పుస్తకాలు అవసరం.. ఏమి తీసుకురావాలి.. అనే విషయాలను విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, పోషకులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనవసరంగా అంటగడుతున్న పుస్తక సంచుల మోత విషయంలో సంబంధిత విద్యాశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేయాలి. అధిక బరువు కలిగిన పుస్తక సంచులతో విద్యార్థులకు అనేక ఆరోగ్య ఇబ్బందులు తలెత్తనున్నాయి. ప్రస్తుత రోజుల్లో రాక్‌సాక్ (వీపు మీద పెట్టుకునే) బ్యాగులనే ప్రోత్సహిస్తున్నారు. బరువుతో వెన్నెముక, నడుమునొప్పి వంటి సంబంధిత సమస్యలు రానున్నాయి. చికాకు పెరిగి చదువుపై ఏకాగ్రత దెబ్బతినే ప్రమాదం ఉంది. బరువు తక్కువ, బలహీనంగా ఉన్న వారికి మరింత ఇబ్బందికరం. ఏ రోజు ఏ పుస్తకాలు అవసరమో వాటినే సదరు పాఠశాలల వారు ముందుగా తెలియజేయడం అత్యంత కీలకం.

# ఇక్రిశాట్‌లో సీడ్ ట్రేడ్ ఇన్నోవేషన్ సమ్మిట్ ప్రారంభం..

## పాల్గొన్న 24 దేశాల ప్రతినిధులు



**పటాన్ చెరు (మనసులో మాట) జూలై 10:**

దేశంలో వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, ప్రపంచ విత్తన వాణిజ్యంలో భారతదేశాన్ని ఒక ప్రముఖ కేంద్రంగా మార్చడానికి అధునాతన పరిశోధనలు, వాతావరణ మార్పులను తట్టుకునే సాంకేతికత అంతర్జాతీయ భాగస్వామ్యం ఎంతో అవసరమని పలువురు విధాన నిర్ణేతలు, శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ వేదికగా అసోచామ్ ఆధ్వర్యంలో "అడ్వాన్సింగ్ గ్లోబల్ సీడ్ ట్రేడ్, ఇన్నోవేషన్ & సస్టైనబుల్ అగ్రికల్చర్" అనే థీమ్‌తో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'ఇండియా సీడ్ ట్రేడ్ & ఇన్నోవేషన్ సమిట్ 2026' గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సుకు 24 దేశాల ప్రతినిధులతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు విత్తన కంపెనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సును ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

**వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా..**

ఈ సందర్భంగా సునీల్ శర్మ మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని చేరుకోవడంలో వ్యవసాయ ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వ్యవసాయ భవిష్యత్తు అనేది కేవలం ప్రభుత్వం లేదా పరిశోధనా సంస్థల వల్లే సాధ్యం కాదని, రైతులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, ప్రైవేట్ రంగాలు ఉమ్మడిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా సాంప్రదాయ వ్యవసాయ విధానాలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారానే స్థిరమైన, సంపన్నమైన భవిష్యత్తును నిర్మించగలమని ఆయన స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గిన ప్రస్తుత తరుణంలో, రైతులు వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ కాలపరిమితి గల పప్పుధాన్యాలు, నూనెగింజలతో పాటు తృణధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచించారు.

**విత్తనాల లభ్యత లైసెన్సింగ్‌లో ఎన్నో సవాళ్లు..**

ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ తన కీలక ఉపన్యాసంలో, భారతదేశం వ్యవసాయ రంగంలో ఎంతో పురోగతి సాధించినప్పటికీ, సబ్సిడీలు, విత్తనాల లభ్యత లైసెన్సింగ్ వంటి సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే కాలంలో వ్యవసాయ పరివర్తన అనేది కేవలం స్వయంసమృద్ధి కోసమే కాకుండా, వాతావరణ మార్పులను తట్టుకునేలా పోషకాలతో కూడిన పంటలను పండించేలా ఉండాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ ఆవిష్కరణలను భారతదేశానికి తీసుకురావడంలోనూ, భారతీయ సాంకేతికతలను ప్రపంచ దేశాలకు చేర్చడంలోనూ ఇక్రిశాట్ ఒక బలమైన వారధిగా పనిచేస్తుందని ఆయన వివరించారు. దేశంలో నాణ్యమైన విత్తనాలు, ఆరోగ్యకరమైన నేల ఉంటేనే రైతాంగం అభివృద్ధి చెందుతుందని ఆయన గుర్తుచేశారు. అసోచామ్ అగ్రికల్చర్ కౌన్సిల్ ఛైర్మన్ డా. వెంకట్రామ్ వసంతవాడ స్వాగతోపన్యాసం చేస్తూ, ప్రతి వ్యవసాయ విప్లవానికి విత్తనమే మూలాధారమని, అది రైతు శ్రేయస్సుకు పునాది అని అన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో విత్తన సాంకేతికత ప్రాధాన్యత మరింత పెరిగిందని చెప్తూ, ప్రైవేట్ భాగస్వామ్యంతో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి విత్తన మార్కెట్‌గా ఎదుగుతోందని వివరించారు. ఈ సదస్సులో భాగంగా అసోచామ్‌గ్రాంట్ థోర్న్టన్ భారత్ సంయుక్తంగా రూపొందించిన ఒక ప్రత్యేక నాలెడ్జ్ రిపోర్టును విడుదల చేశారు. అలాగే, విత్తన పరిశోధనలు, ఆవిష్కరణలలో విశేష కృషి చేసిన పలు సంస్థలకు, వ్యక్తులకు "సీడ్ ఎక్సలెన్స్ అవార్డులను" అందజేశారు. సదస్సులో భాగంగా రాబోయే రోజుల్లో 'విత్తన పరిశోధనల్లో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం' మరియు జీన్‌ఎడిటింగ్ వంటి నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతలకు సంబంధించిన నిబంధనలపై నిపుణులు సుదీర్ఘంగా చర్చించనున్నారు.

## మహిళా బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి



**ఆదిలాబాద్ నేర విభాగం (మనసులో మాట) జూలై 10:**

భార్యాభర్తల వివాదాల పరిష్కారంలో సున్నితంగా వ్యవహరిస్తూ సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కార విధానం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళల రక్షణ, భద్రతకు ఉమెన్ పోలీస్ స్టేషన్ కీలకమని పేర్కొంటూ, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని బాధితుల్లో విశ్వాసం కలిగించే విధంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ.. కేసుల దర్యాప్తును నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఫణిదర్, ఏఎస్సైలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గరళం గాల్లోకి.. గస్తీ నిద్రలోకి



- **వేల పరిశ్రమలకు మూడే నిఘా వాహనాలు**

**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 10:**

కోటిన్నరకు పైగా జనాభా, వేలాది పరిశ్రమలున్న మహానగరంలో పర్యావరణ పరిరక్షణ గాల్లో దీపంలా మారింది. నగరంలో పెరుగుతున్న వాయు, శబ్ద, జల కాలుష్యాన్ని అరికట్టడంలో పీసీబీ ఘోరంగా విఫలమవుతోంది. సిబ్బంది కొరత, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన నిఘా వ్యవస్థలో లోపాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాలుష్య తనిఖీల కోసం కేవలం మూడు ప్యాట్రోలింగ్ వాహనాలు మాత్రమే ఉన్నాయి.

**కారకులను పట్టుకోవడంలో విఫలం..**

చెంగిచెర్ల పరిసర నివాస సముదాయాల్లోని ప్రజలకు అర్ధరాత్రివేళల్లో ఘాటు వాసనలు ఊపిరిసలపనివ్వడం లేదు. స్థానికంగా ఉన్న కొన్ని ల్యాబ్‌లు, చిన్న తరహా రసాయన పరిశ్రమలు అనేకం ఉండడంతో రాత్రివేళ విష వాయువులను నిశ్శబ్దంగా గాల్లోకి వదులుతున్నారు. రసాయన వ్యర్థాల పారబోత నిత్యకృత్యంగా మారింది. ఓ రోజున కాలుష్య నియంత్రణ మండలి నైట్ ప్యాట్రోలింగ్ సిబ్బందికి స్థానికులు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఇదిగో వస్తున్నామంటూ చెప్పిన సిబ్బంది నాలుగు గంటలైనా ఘటనా స్థలికి చేరుకోలేదు. కారణం ఆ వాహనం మరో ప్రాంతంలో వచ్చిన ఫిర్యాదు తనిఖీల్లో ఉంది. అది పూర్తయి చెంగిచెర్లకు చేరుకోగా.. అప్పటికే వాసన రావడం ఆగిపోయింది. దీంతో కారకులను పట్టుకోవడంలో అధికారులు విఫలమయ్యారు.

**పది వాహనాలు అవసరం..**

రాత్రివేళ రసాయన ఘాటు వాసనలు వెదజల్లే పరిశ్రమలు, హానికర వ్యర్థాలను జలాశయాలు, డ్రైనేజీల్లో వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నైట్ ప్యాట్రోలింగ్ సిబ్బందిదే. తూతూమంత్రంగానే నిఘా ఉందన్న విమర్శలున్నాయి. పీసీబీ కేంద్ర కార్యాలయం హైదరాబాద్, ఆర్సీపురం జోన్ కార్యాలయ పరిధిలో ప్రస్తుతం మూడు నైట్ ప్యాట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నాయి. 5 వేలకు పైగా పరిశ్రమలున్న రాజధాని పరిధిలో కనీసం 610 ప్యాట్రోలింగ్ వాహనాలు అవసరం.

# నిండుగా గంగమ్మ.. రైతన్నకు దిక్కేదమ్మా!





- **కోట్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో పంట విరామం**

**వికారాబాద్, ధారూర్, (మనసులో మాట) జూలై 10:**

జిల్లాలోనే అతిపెద్ద ప్రాజెక్టు కోట్‌పల్లి పరిధిలో కాలువల పనులు జరుగుతుండడంతో అధికారులు ఈ ఏడాది పంట విరామం ప్రకటించారు. ఒకవైపు వర్షాలు కురవక వరిసాగుపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక జలాశయ పరివాహక ప్రాంతంలోనూ వరి సాగు చేసే అవకాశం లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రాజెక్టు పరిధి ధారూర్, పెద్దేముల్ మండలాల పరిధిలో 18 గ్రామాలకు సాగు నీరు ఇవ్వలేమని అధికారులు తేల్చేయడంతో ఏమీ చేయాలో పాలుపోవడం లేదని రైతన్నలు వాపోతున్నారు. ప్రాజెక్టు పరిధిలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 9,200 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ప్రస్తుతం 3 నుంచి 4 వేల ఎకరాలకే నీరు అందుతోంది.

**కాలువలు, తూములు శిథిలం కావడంతో..**

ప్రాజెక్టు కాలువలు, తూములు పూర్తిగా శిథిలం కావడంతో మరమ్మతులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.68 కోట్లను గతేడాది అక్టోబరులో విడుదల చేసింది. కుడికాలువ 24 కిలోమీటర్లు కాగా, దీని పరిధిలో నాగసమందర్, మంబాపూర్, మారేపల్లితండా తదితర 16 గ్రామాలు ఉన్నాయి. ఎడమ కాలువ పొడవు 6.8 కిలోమీటర్లు. దీని పరిధిలో రుద్రారం, గొట్టేపల్లి తదితర గ్రామాలున్నాయి. మూడోది బేబీ కెనాల్ దీని పొడవు దాదాపు 2.5 కిలోమీటర్లు. ఇది కుడికాలువకు ఆనుకుని ఉంటుంది. దానికింద కూడా వందల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

**50 శాతమే పనులు పూర్తి..**

ప్రాజెక్టు కింద అలుగు పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత ప్రధాన కాలువ పనులు కొనసాగుతున్నాయి. పనులు కాస్త నెమ్మదించినా.. ఇప్పటి వరకు దాదాపు 50శాతం పూర్తయ్యాయని అక్కడ విధులు నిర్వహించే పర్యవేక్షించే అధికారి సాయి 'ఈనాడు'కు తెలిపారు. ప్రస్తుతం నీరు విడుదల చేస్తే పనులుకు ఆటంకం జరుగుతుందన్నారు. గతేడాది కూడా కలెక్టర్ నిర్ణయం మేరకు విరామం ప్రకటించామని చెప్పారు. 24 కిలోమీటర్ల దూరంలో చాలా వరకు పనులు పూర్తయి, ప్రస్తుతం క్యూరింగ్ పనులు జరుగుతున్నాయని, కొన్ని గ్రామాలకైనా నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

# పారిపోతున్నా వెంటపడి.. మర్మాంగాలు నలిపేసి



- **యువకుడి ప్రాణం తీసిన స్నేహితులు**
- **గంజాయి, అమ్మాయి విషయాలే కారణం**

**హయత్‌నగర్ (మనసులో మాట) జూలై 10:**

స్నేహితులే కదా అని నమ్మి అర్ధరాత్రి తర్వాత వారితో వెళితే.. పసుమాములకు చెందిన నిషాని సుహాస్(22)ను దారుణంగా కొట్టి చంపినట్లు సమాచారం. గంజాయి వ్యాపారంలోని లావాదేవీలతో పాటు.. ఓ అమ్మాయి విషయంలో జరిగిన లొల్లి ఈ హత్యకు కారణమని తెలుస్తోంది. అనుమానిత నిందితుల్లో ఒకరిని పోలీసులు విచారించినప్పుడు పలు విషయాలు వెలుగు చూశాయి. విశ్వసనీయంగా సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి.పసుమాములలో తల్లితో కలిసి ఉంటున్న సుహాస్‌కు గంజాయి వ్యసనంతోపాటు వ్యాపారం చేసిన అనుభవం ఉంది. సికింద్రాబాద్‌లో ఉన్న సమయంలో కుమారుడు పెడతోవ పడుతున్నాడని గ్రహించిన తల్లి నందిని పసుమాములలో సొంతిల్లు కొనుక్కొంది. భర్త చనిపోయినా.. కుమారైకు వివాహం చేసింది. ఆశలన్నీ కుమారుడు సుహాస్‌పైనే పెట్టుకొని జీవనం సాగిస్తోంది. సుహాస్‌కు పసుమాముల, పెద్దఅంబర్‌పేట్, సికింద్రాబాద్‌కు చెందిన రాకేష్, నడిమిట్ల పరశురాం, రాజులతో పాటు మరొకరితో బాగా స్నేహం ఉంది. సుహాస్‌కు చరవాణి లేకపోవడంతో ఈ నలుగురిలో ఒకరి సెల్‌ఫోన్ తీసుకున్నాడు. అతని గర్ల్‌ఫ్రెండ్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేశాడు. సుహాస్ అసభ్యకరంగా సందేశాలు పెట్టడంతో పాటు ఆమె ఫోన్ చేస్తే కూడా అదేతీరులో మాట్లాడినట్లు సమాచారం. జరిగిన విషయమంతా యువతి తన బాయ్‌ఫ్రెండ్‌కు చెప్పింది. గతంలో కలిసి గంజాయి వ్యాపారం చేసిన సమయంలో ఆర్థిక లావాదేవీలపై జరిగిన గొడవలు తోడవ్వడంతో ఆగ్రహించాడు.అదే కారణంతో సుహాస్ అంతుచూడాలని హత్యకు పథకం వేసినట్లు తెలుస్తోంది. పరశురాం, రాజు, రాకేష్ సహా మరో వ్యక్తి బుధవారం తెల్లవారుజామున పరశురాం ఇన్‌స్టాగ్రామ్ నుంచి సుహాస్ తల్లి నందిని ఫోన్‌కు ఆడియో కాల్ చేశారు. ఆమె ఫోన్ ఎత్తకపోవడంతో నేరుగా ఇంటికెళ్లారు. వారంతా స్నేహితులే కావడంతో తల్లి వారించినా సుహాస్ వారితో కలిసి బయటికెళ్లాడు. అక్కడ్నుంచి పసుమాముల గ్రామ శివారులోని మర్రిచెట్టు వద్దకు తీసుకెళ్లారు. విచక్షణరహితంగా దాడిచేశారు. తప్పించుకొని ప్రాణభయంతో అర కిలోమీటర్ దూరం పరుగు తీసినా.. స్నేహితుడని వదిలేయకుండా వెంటపడి మర్మాంగాలను నలిపేసి చనిపోయేదాకా కొట్టారు. ఆ తర్వాత పెద్దఅంబర్‌పేట్ పసుమాముల రోడ్డులోని శ్మశానవాటిక ప్రహరీ పక్కన సిమెంట్ బెంచీపై పడుకోబెట్టి పారిపోయారని సమాచారం. వ్యసనాలు, పద్ధతి లేని స్నేహితులతో తిరగడంతో కుమారుడు చివరికి ప్రాణాలు కోల్పోయాడని సుహాస్ తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

# ఆసుపత్రికని ఆటో ఎక్కితే అత్యాచారం



**ఘట్‌కేసర్ (మనసులో మాట) జూలై 10:**

ఆసుపత్రికి వెళ్లేందుకు ఆటో ఎక్కిన మహిళను డ్రైవర్ ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. పోచారం ఐటీ కారిడార్ సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భరత్‌నగర్‌లో ఉండే ఓ మహిళ బుధవారం ఉదయం ఆసుపత్రికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. డ్రైవర్ కల్లు పార్సిల్ తీసుకుని ఘట్‌కేసర్ ఔటర్ సర్వీసు రోడ్డులోని ఖాళీ ప్రదేశంలోకి తీసుకెళ్లాడు. ఆమెకు కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి తాగించాడు. స్పృహ కోల్పోయిన తరువాత ఆమెపై అత్యాచారం చేసి ఫోన్, కొంత నగదు తీసుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీకెమెరాల ఆధారంగా ఆటో డ్రైవర్ అంగోతు జేత్యగా గుర్తించారు. గురువారం ఎస్సై రాజు, సిబ్బంది కలిసి అన్నోజిగూడలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆటో, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# వారం కిందట బిడ్డ పెళ్లి.. అంతలోనే తండ్రి మృతి



**బీర్కూర్ (మనసులో మాట) జూలై 10:**

వారం కిందట బిడ్డ పెళ్లి చేసిన తండ్రి గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందారు. ఈ ఘటన బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ (45) అనే రైతుకు మూడు ఎకరాల సొంత పొలం ఉంది. అదనంగా రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. పొలానికి నీరు పారించేందుకు గురువారం మధ్యాహ్నం బోరు వేసేందుకు గట్టుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు శ్రీనివాస్‌గౌడ్ చేయి విద్యుత్తు నియంత్రికకు తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై ఘటనాస్థలిలోనే మృతి చెందారు. సమీపంలో ఉన్న గొర్రెల కాపరులు గమనించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబీకులు పోలీసులకు విషయాన్ని తెలియజేయడంతో వారు అక్కడికి చేరుకుని పంచనామా చేసి మృతదేహాన్ని బాన్సువాడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. రైతు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. బిడ్డ పెళ్లి చేసిన వారం రోజులకే అతను మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది.

# దోపిడీకి తరుగు ముసుగు

**వరంగల్ (మనసులో మాట) జూలై 10:**

వరంగల్ జిల్లాలో 25,929 మంది రైతులు 1,27,312 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను విక్రయించగా.. ఒక్కో రైతుపై రూ.2వేలు కోతను లెక్కించినా.. సుమారు రూ.5.18 కోట్లు అక్రమంగా.. ప్రైవేట్ గోదాంల నిర్వాహకుల జేబుల్లోకి వెళ్లినట్లే. ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతు శ్రమను కొందరు తరుగు పేరుతో దోచుకుంటున్నారు. ఈ ఏడాది అంచనాకు మించి మొక్కజొన్న పంట దిగుబడి వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటా రూ.2,400 మద్దతు ధర ప్రకటించారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.1,500 నుంచి రూ.1,900కే కొనుగోలు చేయడంతో.. మెజార్టీ రైతులు ఆపసోపాలు పడి మద్దతు ధరకే అమ్ముకున్నారు. తీరా చెల్లింపుల్లో ఒక్కో రైతుకు ఒక బస్తా నుంచి 5 బస్తాల వరకు తరుగు తీస్తుండటంతో రైతులు మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ కార్యాలయాలకు వెళ్లి అధికారులను నిలదీస్తున్నారు.



**ప్రైవేట్ గోదాం నిర్వాహకుల మాయాజాలం**

కొనుగోలు కేంద్రాల్లో ఒక్కో బస్తా బరువు (50 కిలోలు మొక్కజొన్న, 580 గ్రాములు గన్నీ బరువు) మొత్తం 50.580 కిలోలు ఉండాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. అయితే బస్తాలకు సుతిల్ వేసేటప్పుడు, రవాణా చేసే సమయంలో తరుగు పోతుందని.. ఒక్కో బస్తాను సుమారు 51కిలోల నుంచి 51.500 కిలోల వరకు తూకం వేశారు. గోదాంల నిర్వాహకులు నిబంధనలను పక్కనబెట్టి.. ఒక్కో బస్తా 51 కిలోల కంటే 10 గ్రాముల తక్కువున్నా.. మొత్తం సరకులో నుంచి 2 నుంచి 4 బస్తాల వరకు తరుగు తీస్తున్నారు. దీంతో ఒక్కో రైతు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు నష్టపోతున్నాడు.

**ఆధారాలు తుడిపేసేందుకు కుయుక్తులు**

కేంద్రాల్లో జనరేట్ చేసిన ట్రక్‌షీట్ ఆధారంగా.. గోదాంల నిర్వాహకులు సరకును తూకం వేస్తారు. అందులో తేడాలుంటే.. వెంటనే ఆధారాలను జతచేసి కేంద్రం ఇన్‌ఛార్జికి పంపించాలి. ఆ తర్వాత సరకు వివరాలను ట్రిప్ ఐడీ ద్వారా ఆన్‌లైన్ చేయాలి. పైగా గోదాం వద్ద సరకు దిగుమతి తర్వాత.. కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలకు స్వీకరణ రసీదుతో పాటు రైతులకు మరో రసీదు ఇవ్వాలి. అయితే ఎలాంటి రసీదు ఇవ్వకుండానే.. సరకు దిగుమతి చేసుకుని.. ఇప్పుడు చెల్లింపుల సమయంలో.. తరుగు పేరుతో రైతుల నోటికాడ బుక్క లాక్కుంటున్నారు. విషయం బయటికి పొక్కకుండా.. తరుగు వచ్చిందని ముందే చెప్పి రైతుల సంతకాలు తీసుకుంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో మార్క్‌ఫెడ్, ప్రైవేట్ గోదాంలు, కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలు మిలాఖత్ అయినట్లు ఆరోపణలున్నాయి.ఈ విషయంపై మార్క్‌ఫెడ్ డీఎం చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. చెల్లింపుల్లో కోతలుంటే.. తమ దృష్టికి తీసుకురావాలని, తద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# పంచాయతీలు ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి



**దామెర (మనసులో మాట) జూలై 10:**

గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా దామెరలోని ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో దామెర, ఆత్మకూరు, నడికుడ, పరకాల, శాయంపేట మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సొంత ఆదాయ వనరుల కల్పనపై ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తడి, పొడి కాకుండా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ.. వాటి ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో బీఎల్ఓలు, రెవెన్యూ అధికారులకు సహకరించాలని ఆమె ఆదేశించారు. గ్రామాల్లో వనమహోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేయాలని, పూర్తిస్థాయిలో గుంతలు తీయాలని సూచించారు. సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.రవి, జడ్పీ సీఈవో శేషాద్రి, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంపీడీవోలు శ్రీనివాస్ రెడ్డి, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

# బస్సుల కోసం ప్రయాణికుల ఇబ్బందులు



**పరకాల (మనసులో మాట) జూలై 10:**

వరంగల్ జిల్లా పరకాల ఆర్టీసీ బస్టాండ్లో శుక్రవారం బస్సుల కోసం ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. స్థానిక డిపోలో మొత్తం 80 బస్సులు ఉండగా.. వాటిలో 53 బస్సులను ఖమ్మం జిల్లాలో సీఎం సభకు తరలివెళ్లాయి. మిగిలిన 27 బస్సులు ఆయా రూట్లకు సరిపోలేదు. హైదరాబాద్, హనుమకొండ, భూపాలపల్లి, జమ్మికుంట, హుజురాబాద్ వంటి రూట్లకు వెళ్లేందుకు సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్లో గంటల తరబడి పడిగాపులు కాశారు. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

# గోరంత అనుమతి.. గుట్టంతా తవ్వకం

**వరంగల్ (మనసులో మాట) జూలై 10:**

గుత్తేదారు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, ఏళ్లనాటి భారీ వృక్షాలను ధ్వంసం చేస్తూ.. అనుమతుల పేరుతో ఎక్కువ మొత్తంలో మట్టి తరలిస్తున్నారని ఇటీవల పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ధర్నాలు, అధికారులకు వినతిపత్రాలు సైతం అందజేశారు. చిట్యాలకు చెందిన ఓ వ్యక్తి కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, అమిత్‌షా, పలువురికి ఆన్‌లైన్ గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో గనుల శాఖ జిల్లా డైరెక్టర్ విచారణ చేపట్టారు. నివేదిక వచ్చే వరకు మట్టి తరలింపు ఆపాలని గత నెల 4న చిట్యాల తహసీల్దార్ వసంతరావుకు నోటీసులు జారీ చేసినా.. ఈ తంతు ఆగడం లేదు.భూపాలపల్లి టౌన్, చిట్యాల, న్యూస్‌టుడే: రహదారుల నిర్మాణం ఆ ప్రాంత ప్రగతికి బాటలు వేయాలి. కానీ, ఇక్కడ మాత్రం ఏళ్లనాటి గుట్టలు అ'క్రమంగా' కనుమరుగవడానికి కారణమవుతోంది. మంచిర్యాలవరంగల్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం చేపట్టిన మొరం తవ్వకాల్లో కాంట్రాక్టర్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేట శివారు శాంతినగర్ గుట్టల నుంచి అనుమతులకు మించి రాత్రింబవళ్లు యంత్రాలతో మొరాన్ని తవ్వుతూ చిట్యాల, టేకుమట్ల మండలాల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణానికి తరలిస్తున్నారు. ఈ దోపిడీపై స్థానికులు, పలు పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా.. యంత్రాంగం లో పట్టింపు కరవైంది.

**అనుమతి పేరుతో దోపిడీ..**

జాతీయ రహదారి నిర్మాణ పనులకు నవాబుపేట శివారులోని రెండు గుట్టల నుంచి మొరం తరలించేందుకు అనుమతులు తీసుకున్నామని గుత్తేదారు చెబుతున్నారు. అయితే అధికారులిచ్చిన అనుమతులు కొద్ది మొత్తానికేనని, క్షేత్రస్థాయిలో మాత్రం అనుమతులకు మించి మొరాన్ని తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ శాఖ ఇచ్చిన అనుమతి ప్రాంతం నుంచి కాకుండా వేరేచోటు నుంచి తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. రోజూ దాదాపు 30 టిప్పర్లలో.. ఒక్కో టిప్పర్ 10 చొప్పున రాత్రింబవళ్లు మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మట్టి తీసే ప్రదేశంలో మైనింగ్ శాఖ అధికారి ఉండాల్సి ఉండగా.. అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఫిర్యాదు చేసినా.. ఆగని దందా..

**కొత్త ఎన్వోసీలను అనుమతి ఇవ్వలేదు..**



అనుమతుల కంటే ఎక్కువ మొత్తంలో తవ్వకాలు చేస్తున్నట్లు మా దృష్టికి రాగా, గత నెలలో నోటీసులు జారీ చేశాం. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మైనింగ్ శాఖను కోరాం. విచారణ పూర్తయ్యేదాకా తవ్వకాలు చేయొద్దని గుత్తేదారును ఆదేశించాం. గతంలో తీసుకున్న అనుమతులతో ప్రస్తుతం గుట్టలోని మరో ప్రాంతం నుంచి మట్టి తీస్తున్నారు. కొత్త ఎన్వోసీలకు దరఖాస్తు చేసుకోగా.. అనుమతివ్వలేదు. మైనింగ్ అధికారులు విచారిస్తేనే పూర్తి వివరాలు వెల్లడవుతాయి.

## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి: సబితా ఇంద్రారెడ్డి



**బడంగ్ పేట్ (మనసులో మాట) జూలై 10:**

ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సు కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఎన్యుమరేషన్ ఫారాలు, ఓటరు జాబితా ప్రక్రియ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.

## 'సర్' లేరనడంతో ఉసూరు

**నిజామాబాద్ వైద్య విభాగం**
**(మనసులో మాట) జూలై 10:**

జిల్లాలో ప్రస్తుతం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్') కార్యక్రమం కొనసాగుతోంది. ఇందుకోసం నిజామాబాద్ కార్పొరేషన్‌లో సర్కిల్ కార్యాలయాలను కూడా ఏర్పాటు చేశారు. కరీంనగర్, ఖమ్మం, వరంగల్ వంటి నగరాల్లో లేనివిధంగా, ఇక్కడి నగరపాలికలో అధికారులు, సిబ్బందికే 'సర్' విధులు కేటాయించడంతో సాధారణ పాలన, పౌర సేవలు పడకేశాయి.



**ఎక్కడ చూసినా..**

గతనెల 25వ తేదీ నుంచి 'సర్'ను మొదలుపెట్టారు. రాష్ట్రంలోని ఏ బల్దియాల్లో చూసినా రెవెన్యూ శాఖకు బాధ్యతలు అప్పగించారు. కానీ, గత నిర్ణయాల ఆధారంగా నగరపాలిక అధికారులు, సిబ్బందికే నేరుగా విధులు కట్టబెట్టారు. రెండు వారాలుగా పౌర సేవలతో పాటు రెవెన్యూ వసూళ్లపై తీవ్రప్రభావం పడుతోంది.గత సంవత్సరం కార్పొరేషన్ ఎన్నికలు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలతో రెవెన్యూ సిబ్బంది వసూళ్లపై దృష్టిసారించలేకపోయారు. ఏటా ఆస్తిపన్ను రూపంలో రూ.వంద కోట్లు వసూలు చేయాలని లక్ష్యం విధిస్తున్నారు. అందులో సగమైనా ఖజానాకు దక్కలేదు. కార్యాలయానికి వచ్చే పౌరులు ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు పెండింగ్‌లో పడుతున్నాయి.టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత ఉంది. ఇద్దరు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హైదరాబాద్‌కు వెళ్లారు. ప్రస్తుతం ఒక్క టౌన్ ప్లానింగ్ అధికారే మిగిలారు. ఇంటి అనుమతులు ఇవ్వాలన్నా, హోర్డింగ్‌లు పరిశీలించి పన్నులు రాబట్టాలన్నా సిబ్బందే లేరు. ఫిర్యాదులపై తనిఖీలు చేపట్టేవారే లేరు. ఈ విభాగం ఖాళీగా ఉంది.ఇంజినీరింగ్, మెప్మా, జననమరణ ధ్రువీకరణ, ఎస్టాబ్లిష్‌మెంట్, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది సైతం 'సర్' విధుల్లో బిజీగా ఉన్నారు. పన్నుల వసూళ్ల నుంచి రోజువారీ పారిశుద్ధ్య పనుల వరకు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. అభివృద్ధి పనుల పర్యవేక్షణ సైతం గగనమవుతోంది.'ప్రత్యేక సమగ్ర సవరణ విధులను రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కార్పొరేషన్ సిబ్బందే చూస్తున్నారు. వాస్తవానికి ఈ పనిని రెవెన్యూ వారు చూడాలి. గతంలో ఇలాంటి విధులను ఇక్కడి కమిషనర్లు సొంతంగా సిబ్బందితోనే చేశారని చెబుతున్నారు'

## నల్ల బంగారం.. సిరుల సింగారం



- **తాడిచెర్ల బ్లాక్-2 బొగ్గు తవ్వకాలతో పారిశ్రామిక వెలుగులు**

**మల్హర్ (మనసులో మాట) జూలై 10:**

భూగర్భ పొరల్లో దాగిన నల్ల బంగారం సిరులు కురిపిస్తోంది. పారిశ్రామిక వెలుగులు విరజిమ్ముతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్ల బ్లాక్2 బొగ్గు గని విస్తరణతో ఈ ప్రాంతం రూపరేఖలు మారనున్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధిపై ఆశలు చిగురిస్తున్నాయి. సింగరేణిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు దొరికే అవకాశం ఉంది. వ్యాపార, వాణిజ్య రంగాల్లో పురోగతి చెందనుంది. చిరు వ్యాపారాలకు చేతినిండా పని లభించనుంది. మానేరు నీరు సమృద్ధిగా ఉండటంతో విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తే మరింత ఉపాధి పెరగనుంది.

**ప్రగతి పరుగు..**

రెండో గని విస్తరణలో శాత్రాజ్‌పల్లి గ్రామం, భూములు పూర్తిగా, పెద్దతూండ్లలో పాక్షికంగా భూములు కోల్పోనున్నాయి. తాడిచెర్ల బ్లాక్1 బొగ్గు ఉత్పత్తితో కొంత ఉపాధి లభిస్తోంది. ఉపాధి కోసం దూరప్రాంతాలకు వెళ్తున్న నిరుద్యోగులకు సింగరేణిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. తాడిచెర్ల, మల్లారం, పెద్దతూండ్ల, ప్రాంతాల్లో వ్యాపారం పెరగనుంది. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుకానున్నాయి.

**విద్యుత్తు కేంద్రంపై ఆశలు**

అపార బొగ్గు నిల్వలు, మానేరు నీరు సమృద్ధిగా ఉన్న ఇక్కడ విద్యుత్తు కేంద్రం నిర్మించాలని 1991లో తెరపైకి రాగా, అప్పట్లో నక్సల్స్ ప్రాబల్యం కారణంగా ఆ ప్రయత్నం మరుగున పడింది. ఆ తర్వాత చెల్పూర్‌లో విద్యుత్తు కేంద్రాన్ని నిర్మించగా.. 1,100 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. తాడిచెర బ్లాక్1 గని నుంచి చెల్పూర్‌కు బొగ్గు తరలిస్తున్నారు. రెండో గని బొగ్గుతో స్థానిక అవసరాలకుపోగా, దూర ప్రాంతానికి తరలించనున్నారు. మానేరు నీటిని ఒడిసిపట్టి ఇక్కడే 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం నిర్మిస్తే పారిశ్రామిక వెలుగులు ప్రసరించనున్నాయి. ఆ దిశగా పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలి**

పూర్వం నుంచి అటవీ ప్రాంతంలో జీవిస్తున్నాం. బొగ్గు తవ్వకాలతో ఊరు, భూములు కోల్పోతున్నాం. మాలాంటి పేదలకు ఎలాంటి జీవనాధారం లేదు. ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలి.

**పెరగనున్న వ్యాపారాలు**

గ్రామంలో కిరాణం నడిపిస్తున్నాం. బొగ్గు తవ్వకాలతో కార్మిక కుటుంబాలు ఇక్కడే ఉండనున్నాయి. రవాణా సంబంధాలు మెరుగు కానున్నాయి. చిరు వ్యాపారాలకు మంచి లాభం రానుంది.

**గని స్వరూపం**

**భౌగోళిక విస్తీర్ణం: 7.7 చదరపు కి.మీ**
**బొగ్గు నిల్వలు: 182.07 మి.టన్నులు**
**పొరలు: 16, బొగ్గు రకం: జీ8**
**కోల్పోతున్న భూములు: 1,550 హెక్టార్లు**
**అటవీ: 1,300 హెక్టార్లు**
**సాగు భూములు: 250 హెక్టార్లు**

## మందలింపుతో బావిలోకి దూకిన బాలిక



**ఆసిఫాబాద్ (మనసులో మాట) జూలై 10:**

'స్నానం చేయి' అని కుటుంబ సభ్యులు మందలించినందుకు మనస్తాపానికి గురైన ఓ బాలిక బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడంది. ఈ ఘటన ఆసిఫాబాద్‌లో చోటు చేసుకుంది. అయితే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి బాలికను సురక్షితంగా బయటకు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.ఆసిఫాబాద్‌లోని సందీప్‌నగర్‌కు చెందిన స్వర్ణలత, పోచీరాంల కుమార్తె సాత్విక ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. అయితే బుధవారం సాయంత్రం స్నానం చేయాల్సిందిగా కుటుంబ సభ్యులు ఆమెను కాస్త గట్టిగా మందలించారు. కుటుంబ సభ్యుల మాటలకు తీవ్ర మనస్తాపం చెందిన సాత్విక.. వెంటనే పక్క వీధిలోని బజార్‌వాడిలో ఉన్న ఒక బావి వద్దకు వెళ్లి అందులోకి దూకేసింది. నీటిలో మునిగిపోతూ ప్రాణభయంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. బాలిక అరుపులు విన్న స్థానికులు వెంటనే అప్రమత్తమై '100'నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌హెచ్‌వో బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఫైటర్ నరేష్, ఫైర్‌మెన్ రాము, డ్రైవర్ ప్రవీణ్‌కుమార్‌లు తాడు, రక్షణ పరికరాలతో రంగంలోకి దిగారు. ఫైర్‌మెన్ రాము ప్రాణాలకు తెగించి తాడు సహాయంతో బావిలోకి దిగారు. నీటిలో కొట్టుమిట్టాడుతున్న బాలికకు లైఫ్ జాకెట్ తొడిగారు. అనంతరం సిబ్బంది సహాయంతో బాలికను సురక్షితంగా బావి పైకి తీసుకొచ్చారు.

# మూతపడి.. మెరుగు'బడి'



- విద్యార్థుల రాకతో పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలు

**కామారెడ్డి విద్యావిభాగం (మనసులో మాట) జూలై 10:**

ఉమ్మడి మాచారెడ్డి మండలంలోని రాజ్‌ఖాన్‌పేట బడి ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి నోచుకుంది. గతేడాది వరకు మూసి ఉన్న ఈ బడిలో పంచాయతీ కమిటీ ప్రత్యేక చొరవతో 29 మంది విద్యార్థులు చేరారు. తెరుచుకున్న బడిని సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. విద్యార్థులు ప్రైవేటు విద్యాలయాల వైపు మళ్లకుండా అప్రమత్తమయ్యారు.రామారెడ్డి మండలం సున్నపురాళ్ల తండాలో ఉన్న ప్రాథమిక పాఠశాల మూడేళ్ల క్రితం మూతపడింది. సమీప మండల కేంద్రంలోని ప్రైవేటు బడికి పిల్లలను పంపడంతో ఈ పరిస్థితి తలెత్తింది. స్థానికులు తమ తండాలో బడిని తెరవాలని విద్యాశాఖకు విన్నవించారు. ప్రస్తుతం ఎనిమిది మంది విద్యార్థులను ఈ బడిలో చేర్పించారు. మరిన్ని ప్రవేశాల కోసం ప్రయత్నిస్తున్నారు. మూతపడిన సర్కారు బడుల రూపురేఖలు మారుతున్నాయి. గ్రామవాసులు, పంచాయతీ పాలకవర్గాల కృషితో బడులు మళ్లీ తెరుచుకుంటున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటికే కొత్తగా రెండు బడులను ప్రారంభించారు. ఈ బడుల్లో 50 ప్రవేశాలే లక్ష్యంగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. భవిష్యత్‌లో మరిన్ని బడులు తెరుచుకునేలా యంత్రాంగం క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తోంది.

**గతేడాది ప్రారంభమైనవి ఇవి..**

మూతపడిన ఐదు సర్కారు బడులను గత విద్యాసంవత్సరం ప్రారంభించారు. భిక్కనూరు పరిధిలోని మోటాట్‌పల్లి, గాంధారి పరిధిలోని పల్లెమడుగు తండా, జుక్కల్ మండలం మాతుర తండా, మాచారెడ్డి మండలం నెమలిగుట్ట తండా, సదాశివనగర్ మండలం దగ్గి ప్రాథమిక బడులు గతేడాది ప్రారంభం అయ్యాయి. ఈ బడుల్లో ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నారు.

**బడిబాటలో చేర్పించారు..**

గ్రామీణ, తండా ప్రాంతాల్లో అనేక మంది పిల్లలను తల్లిదండ్రులు బడులకు పంపడం లేదు. తాము పని చేసే చోటకు పిల్లల్ని తీసుకెళ్తున్నారు. దీంతో వారు చదువులకు దూరమవుతున్నారు. కాగా ఈ విద్యాసంవత్సరం బడిబాటలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 186 మంది బాలలను గుర్తించి వారికి సమీప బడుల్లో ప్రవేశాలు కల్పించారు.

**ప్రైవేటుకు దీటుగా విద్య**

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతోంది. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. తల్లిదండ్రుల ఆలోచన సరళిలో మార్పు రావాలి. ప్రభుత్వ విద్యాలయాల్లోనే తమ పిల్లల్ని చేర్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.

# సామ దుబ్బ తండాలో చిరుత పులి బీభత్సం

# మూడు లేగదూడలు మృతి

**కామారెడ్డి జిల్లా (మనసులో మాట) జూలై 10:**



కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడ పరిధిలోని సామ దుబ్బ తండాలో ఆదివారం అర్ధరాత్రి చిరుత పులి బీభత్సం సృష్టించింది. తండాకు చెందిన రమావత్ రమేష్ అనే రైతుకు చెందిన మూడు లేగ దూడలపై చిరుత దాడి చేసి హతమార్చింది.

**సామ దుబ్బ తండాలో చిరుత పులి బీభత్సం:**

బాధితుడు రమేష్ ఆదివారం రాత్రి తన పశువుల పాకలో లేగ దూడలను కట్టివేసి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో పాకపై దాడి చేసిన చిరుత పులి.. రెండు లేగ దూడలను అక్కడికక్కడే చంపేసింది. మరో దూడను కొంతదూరం లాక్కెళ్లి హతమార్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ దాడి వల్ల తనకు సుమారు రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. తాను కూలి పనులు చేసుకునే నిరుపేదనని అన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రమేష్ వేడుకున్నాడు.

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్:**

సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ జాదవ్ రేణుక గణపతి తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అటవీ ప్రాంతానికి సమీపంలో తండాలు ఉండటంతో చిరుత పులుల సంచారం ఎక్కువైందని తెలిపారు. దీంతో తండావాసులు తీవ్ర భయాందోళనల మధ్య గడుపుతున్నారని పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి తండావాసులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో వన్యప్రాణులు పశువులపై దాడులు చేసినా.. అటవీశాఖ అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తం అవ్వాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నష్టపోయిన రైతు కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.

# దుబాయ్‌లో కడెం మండలవాసి మృతి



**నిర్మల్ (మనసులో మాట) జూలై 10:**

దుబాయ్‌లోని ఓ కంపెనీలో 18 ఏళ్లుగా పనిచేస్తున్న కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ అనుబంధంగా ఉన్న పెత్తర్పు గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మణ్ జులై 7న అకస్మాత్తుగా మృతి చెందారు. తొమ్మిదేళ్లుగా ఇంటికి రాకుండా ఒకే కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా పనిచేసిన ఆయన మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. లక్ష్మణ్ మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలంటూ ఆయన భార్య సత్తవ్వ గురువారం కలెక్టరేట్ అధికారులను వేడుకున్నారు. ఆయన ఒరిజినల్ పాస్‌పోర్టు లేదని.. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి అయ్యే ఎంబాల్మింగ్, శవపేటిక, ఎయిర్ కార్గో, రవాణా ఖర్చులు భరించలేమని విలపించారు. జిల్లా సహాయ కార్మికశాఖ అధికారి ముత్యంరెడ్డి, ఎన్నారై రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. లక్ష్మణ్ కుమారుడు, ఇద్దరు కుమార్తెల చదువు కొనసాగించడానికి సాయం చేస్తామని కార్మికశాఖ సహాయ అధికారి హామీ ఇచ్చారు. భారత విదేశాంగ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం మానవతా దృక్పథంతో స్పందించి ఐసీడబ్ల్యూఎఫ్ (ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్) ద్వారా ఆర్థిక సాయం అందించి లక్ష్మణ్ మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నారై సలహా కమిటీ సభ్యుడు పేర్కొన్నారు.

# బాసర ఆలయంలో భారీ చోరీ

## అమ్మవారి వెండి కిరీటం, హుండీ అపహరణ



**నిర్మల్ (మనసులో మాట) జూలై 10:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో భారీ చోరీ జరిగింది. ఆలయ పైఅంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి సన్నిధిలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో మహంకాళి ఆలయ ప్రధాన గేటు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడిలోని అమ్మవారి వెండి కిరీటంతో పాటు కానుకల హుండీని ఎత్తుకెళ్లారు. హుండీలోని నగదును కాజేసిన దొంగలు..ఖాళీ హుండీని సమీపంలోని **వ్యాసగుడి వద్ద పడేసి పరారయ్యారు.**

ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్: మంగళవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాల కోసం వచ్చి చూసేసరికి గేట్లు విరగ్గొట్టి ఉండటం గమనించారు. లోపల కిరీటం, హుండీ కనిపించకపోవడంతో వెంటనే ఆలయ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని సిసిటివి (CCTV) ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితులను పట్టుకునేందుకు ముమ్మరంగా గాలిస్తున్నారు. అత్యంత భద్రత ఉండే బాసర ఆలయ పరిసరాల్లో ఈ చోరీ జరగడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

## అత్తాపూర్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్..
## ఇంజెక్షన్లు, మాత్రలు స్వాధీనం



**రాజేంద్రనగర్ (మనసులో మాట) జూలై 10:**

అత్తాపూర్ పోలీసులు భారీ ఎత్తున డ్రగ్స్ ముఠాను పట్టుకున్నారు. నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్, మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు, అల్ప్రజోలం మాత్రలను అక్రమంగా విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. జూలై 8న న్యూ జలాల్ బాబా నగర్‌లోని ఓ అద్దె గదిపై పోలీసులు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 6.65 గ్రాముల ఎండీఎంఏ, 5 ఇంజెక్షన్లు, అల్ప్రజోలం మాత్రలు, రెండు సిరంజీలు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.16,930 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో అత్తాపూర్‌కు చెందిన సయ్యద్ అబుల్ హసన్, సైఫ్ అలీ మీర్జా, అహ్మద్ హుస్సేన్, షేక్ అయూబ్, యాకుత్‌పురాకు చెందిన మీర్ షబ్బీర్ అలీ ఉన్నారు. ప్రధాన సరఫరాదారు బాకర్, మరో సబ్ పెడ్లర్ ముజాహిద్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు నిందితులు డ్రగ్స్ విక్రయాల్లోకి దిగినట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. ప్రధాన నిందితుడిపై పాత నేర కేసులు ఉన్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ ఐపీఎస్ పర్యవేక్షణలో ఏసీపీ టి. శ్రీనివాస్, అత్తాపూర్ ఎస్‌హెచ్‌ఓ కె. నాగేశ్వరరావు, ఎస్‌ఓటీ బృందం ఈ ఆపరేషన్ నిర్వహించింది.

# మురుగులో మునిగిన రాజేంద్రనగర్ సర్కిల్
# ఉప కమిషనర్ నిద్ర వీడేనా?

- బాధ్యత ఎక్కడ? మురుగులో మగ్గుతున్న రాజేంద్రనగర్ సర్కిల్
- నెలలుగా వీధుల్లో మురుగునీటి ప్రవాహం
- దుర్వాసన, దోమలతో ప్రజల అవస్థలు
- ఫిర్యాదులు చేసినా స్పందన లేదని స్థానికుల ఆగ్రహం





**రాజేంద్రనగర్ (మనసులో మాట) జూలై 10:**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కిస్మత్‌పూర్, బండ్లగూడ జాగీర్, హైదర్షాకోట్ డివిజన్‌లలో నెలలుగా మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రరూపం దాల్చినా పూడికతీత పనులు చేపట్టకపోవడం, మురుగు కాలువల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో అనేక కాలనీలు దుర్వాసన, దోమల మధ్య నరకయాతన అనుభవిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైకి చేరి వీధులన్నీ కంపు కొడుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. దుర్వాసనతో పాటు దోమల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో చిన్నారులు, వృద్ధులు, ఇతరులు సీజనల్ వ్యాధులు, శ్వాసకోశ సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని కనీసం తాత్కాలిక చర్యలు కూడా చేపట్టకపోవడం బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల పరిస్థితి రోజురోజుకూ మరింత దిగజారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, మురుగు కాలువలకు అత్యవసరంగా పూడికతీత పనులు చేపట్టి ప్రజలకు ఉపశమనం కల్పించాలని వారు కోరుతున్నారు.

## ఉప్పల్‌లో ఎంఎంసీ కమిషనర్
## తనిఖీలు



**ఉప్పల్ (మనసులో మాట) జూలై 10:**

సీసీ రోడ్లు, వీధి దీపాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ప్రతిపాదనలపై సమీక్షఆస్తి పన్ను అంచనాల కోసం పత్రాల పరిశీలనకు ఆదేశాలునాలా ఆక్రమణలు, అక్రమ పార్కింగ్ తొలగింపుపై ప్రత్యేక దృష్టిసీ అండ్ డీ వ్యర్థాల నియంత్రణకు కఠిన చర్యలు – అక్రమ డంపింగ్‌పై జరిమానాలు విధించాలినాలా పరిసరాల్లో రితహారం చేపట్టి పచ్చదనం పెంపొందించాలిమల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఇవాళ (గురువారం) ఉప్పల్ భాగాయత్, రామంతాపూర్ భాగాయత్ ప్రాంతాల్లో పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, పట్టణ ప్రణాళిక, ఆదాయ విభాగం, పట్టణ జీవవైవిధ్య కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీ నిర్వహించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

# ఓఆర్ఆర్‌పై ప్రమాదాలకు
# చెక్ 80 బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక నిఘా

**హైదరాబాద్ సిటీబ్యూరో**
**(మనసులో మాట) జూలై 10:**




హైదరాబాద్ మహా నగరాన్ని చుట్టుముట్టిన ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)పై రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రయాణికుల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలను వేగవంతం చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ అధ్యక్షతన టీజీఐసీసీసీలో శుక్రవారం జరిగిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో రహదారి భద్రత, ప్రమాదాల నివారణ, ఆధునిక సాంకేతికత వినియోగంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్ గోపిడి, ఎన్‌హెచ్‌ఏఐ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌జీసీఎల్, ఐఆర్బీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత మే నెలలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని సమీక్షించిన అధికారులు, ఓఆర్ఆర్‌పై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 80 కీలక బ్లాక్‌స్పాట్లను గుర్తించి అక్కడ ఇప్పటికే ప్రత్యేక నిఘా, కట్టుదిట్టమైన ట్రాఫిక్ అమలు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ, ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ఏఐ (కృత్రిమ మేధ) ఆధారిత ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సాంకేతికత ద్వారా అతివేగం, లేన్ ఉల్లంఘనలు, ఇతర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. దీంతో, పదేపదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై సమర్థవంతమైన నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఓఆర్ఆర్‌పై నమోదవుతున్న ట్రాఫిక్ ఉల్లంఘనల్లో దాదాపు 99 శాతం రిపీట్ వైలేషన్లే ఉన్నాయని సజ్జనార్ వెల్లడించారు. ఈ పరిస్థితిని మార్చేందుకు కేవలం జరిమానాలు విధించడం సరిపోదని, వాహనదారుల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం.